fb/prajasakti, www.prajasakti.com

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 36 | విజయవాడ, మంగళవారం 6 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

## జాతీయ స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర కూటమి

జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం


ప్రజలపై బిజెపి భారాలు మోపుతోంది

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం

మీడియాతో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్

12

## ఆగని సెన్సెక్స్ పతనం



### దలాల్ స్ట్రీట్‌లో కొనసాగిన నష్టాలు

### సెన్సెక్స్ మరో 309 పాయింట్ల క్షీణత

కేంద్ర బడ్జెట్ పెట్టుబడిదారులకు తీవ్ర అసంతృప్తిని మిగిల్చడంతో మదుపర్లు భారీగా ఈక్విటీ అమ్మకాలకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ మరో 309.59 పాయింట్లు లేదా 0.88 శాతం పతనమై 34,757.16కు దిగజారింది. 34,719 వద్ద మొదలైన సూచీ ఇంట్రా ట్రేడింగ్‌లో 34,874- 34,520.80 మధ్య కదలాడింది. రెండు రోజుల్లోనే సెన్సెక్స్ ఏకంగా 1,149 పాయింట్లు లేదా 3 శాతం మేర పతనమయ్యింది. నిఫ్టీ 94.05 పాయింట్లు లేదా 0.87 శాతం తగ్గి 10,666.55 వద్ద ముగిసింది. కాగా అంతర్జాతీయ పరిణామాలే మార్కెట్ల పతనానికి కారణమని మంత్రి అరుణ్ జైట్లీ ఆర్థిక శాఖ కార్యదర్శి హస్ముక్ అదియా వివరణ ఇచ్చినప్పటికీ మార్కెట్ల పతనాన్ని కట్టడి చేయలేకపోయారు.

## పకోడ ఉద్యోగాలు

పకోడీలు అమ్ముకుని బతకడం మేలు

రాజ్యసభలో అమిత్ షా వ్యాఖ్య



రాజ్యసభలో ప్రసంగిస్తున్న బిజెపి అధ్యక్షుడు అమిత్ షా

**న్యూఢిల్లీ :** నిరుద్యోగులుగా వుండే కంటే పకోడీలు అమ్ముకుని బతకడం మేలని బిజెపి అధ్యక్షుడు అమిత్ షా వ్యాఖ్యానించారు. రోడ్డుపై ఎవరైనా పకోడీలు అమ్మినా దాన్ని కూడా ఉద్యోగంగానే భావించాలని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుండి తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో అమిత్ షా స్పందించారు. కాంగ్రెస్ పకోడా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగిగా వుండడం కంటే కష్టపడి చిన్నో, చితకో పనిచేయడం తప్పుకాదని, సిగ్గుచేటు అంతకన్నా కాదని ఆయన పేర్కొన్నారు. చాయ్‌వాలా కొడుకు ఈనాడు ప్రధానిగా ఎదిగారని, అలాగే ఈ రోజు పకోడీలు అమ్మిన వ్యక్తి పిల్లలు రేపటి మిగతా 9లో

# కలిసికట్టు నాటకం.. ఉత్తుత్తి పోరాటం



### టిడిపి, బిజెపి వ్యవహారంపై రాజకీయ విశ్లేషకుల ఆక్షేపణ

### వ్యక్తిగత విమర్శలతో సమస్యను పక్కదారి పట్టించే వ్యూహం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రానికి నిధుల కేటాయింపు విషయంలోనూ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత మూడేళ్లుగా బడ్జెట్ కేటాయింపుల సమయంలో జరుగుతున్న తంతు కూడా ఈ అభిప్రాయాన్ని బలపరిచేదిగా ఉంది. ప్రత్యేక హోదా విషయంలోనూ, పోలవరం, అమరావతికి నిధులు, రైల్వే జోన్ తీసుకురావడంలో గత మూడేళ్లు కేంద్రం నిధులు కేటాయించకపోవడం, ఇవ్వకపోతే ఊరుకోనని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనలు చేయడం, ఆనక చల్లబడటం అంతా క్రమ పద్ధతిలో జరిగిపోతున్నాయని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో జైట్లీకి లేఖరాయడం, అనంతరం ఊరకుండిపోవడం జరిగింది. ప్రత్యేక హోదా కావాలని 2016 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోడీకి స్వయంగా లేఖ మిగతా 9లో



పార్లమెంట్ ప్రవేశ ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి ఎంపీలు శివప్రసాద్, నిమ్మల, తోట, కోణకళ్ల, గల్లా, కేశినేని, రామ్మోహన్

### కేవలం ఏడుగురు ఎంపిలతో టిడిపి హడావుడి

### ఆందోళనకు కేంద్ర మంత్రులు 'డుమ్మా'

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో అన్ని పక్షాలు ఉద్యమానికి సన్నద్ధమయ్యాయి. రాష్ట్రం నుంచి పార్లమెంట్ ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్, టిడిపి, వైసిపి సభ్యులు కేంద్ర బడ్జెట్‌లో ఏపికి కేటాయింపులు, విభజన చట్టం హామీలపై చర్చకు నోటీసులిచ్చారు. అయితే ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా వున్న అధికార టిడిపి సోమవారం నామమాత్రంగానే ఆందోళనలో పాల్గొంది. పార్లమెంట్ ఆవరణంలోని గాంధీ విగ్రహం వద్ద కేవలం ఏడుగురు టిడిపి ఎంపిలు హడావుడి చేశారు. తోట నరసింహం, నిమ్మల కిష్టప్ప, టి.జి వెంకటేష్, గల్లా జయదేవ్, కె.రామ్మోహన్ నాయుడు, శివప్రసాద్, కొణకళ్ల నారాయణ ఈ ఆందోళనలో పాల్గొన్నారు. 'ఏపికి సాయం చేయండి, పొత్తు ధర్మాన్ని పాటించండి, హామీలు అమలు చేయండి, విభజన చట్టం అమలు చేయండి" అంటూ ప్లకార్డులతో కాసేపు నినాదాలిచ్చి మిగతా 9లో

## 8వ తేదీ బంద్‌కు పెరుగుతున్న మద్దతు



బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్న కార్మిక సంఘాల నాయకులు ఉమామహేశ్వరరావు, ఓబులేశ్, అజయ్‌కుమార్ తదితరులు

బందుకు వైఎస్‌ఆర్‌సిపి మద్దతు

బంద్‌కు పిలుపుచ్చిన కార్మిక, ప్రజా సంఘాలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరుతూ పది వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. అన్ని వైపుల నుండి మద్దతు పెరుగుతోంది. రాజకీయ పార్టీలతోపాటు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఒక్కొక్కరుగా బంద్‌కు మద్దతు తెలుపుతున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం, విభజన చట్టంలోని హామీలను కనీసం ప్రస్తావించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో అసంతృప్తి చెలరేగింది. ప్రజల ఆకాంక్షలను కేంద్రానికి తెలియజెప్పాలన్న ఉద్దేశ్యంతో పది వామపక్షాలు ఈనెల ఎనిమిదో తేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. గత నాలుగేళ్లుగా విభజన హామీలను అమలుపరచకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎండగట్టేందుకు, హామీలను సాధించడంలో చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపేందుకు వామపక్షాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ పిలుపునకు మిగతా 9లో

## మాల్దీవుల్లో అత్యవసర పరిస్థితి

**మాలే :** మాల్దీవుల్లో 15 రోజుల పాటు అత్యవసర పరిస్థితి విధించారు. సుప్రీంకోర్టుతో వివాదంతో నేపథ్యంలో అధ్యక్షులు అబ్దుల్లా యమీన్ సోమవారం ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయంతో అనుమానితులను అరెస్టు చేయడానికి, వారి నిర్బంధించడానికి భద్రతా దళాలకు అధికారం లభిస్తుంది. అధ్యక్షుడి నిర్ణయంతో దేశంలో తీవ్ర రాజకీయ సంక్షోభం తలెత్తుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని సుప్రీంకోర్టు తీర్పును అధ్య క్షుడు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో అధ్యక్షుడికి, సుప్రీం కోర్టుకు వివాదం నెలకొంది. రాజకీయ ఖైదీల విడుదలపై అంతర్జాతీయంగానూ మాల్దీవు లపై ఒత్తిడి పెరుగుతోంది. అలాగే యమీన్ పార్టీ నుంచి ఫిరాయించిన 12 మంది ఎంపిలకు అనుకూలంగా సుప్రీంకోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. దీంతో 85 సభ్యుల గల పార్లమెంట్‌లో ప్రతిపక్షపార్టీకి మెజార్టీ లభించింది. యమీన్ అత్యవసర పరిస్థితిని విధించినట్లు అతని అను చరుడు అజిమా షుకూర్ ప్రకటించారు. అధ్యక్షుడి నిర్ణయాన్ని దేశ టెలివిజన్‌లో చదవి వినిపించారు. ఖైదీల విడుదలపై తమ నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని జడ్జీలకు యామీన్ మూడు లేఖలు రాసిన అంతరమే ఈ అత్యవసర పరిస్థితి నిర్ణయాన్ని ప్రకటించారు. అత్యవసర పరిస్థితిని ప్రకటించడం యమీన్‌కు ఇది రెండోసారి. 2015 నవంబర్‌లో తనపై హత్యా ప్రయత్నం జరిగిన సమయంలోనూ ఆయన అతవ్యసర పరిస్థితి ప్రకటించారు.

# అంతా అందులోనే

ప్రత్యేక సాయంలో కేంద్రం విదిలింపులు

అన్ని రాష్ట్రాలకూ రూ.15వేల కోట్లు

రాష్ట్రానికొచ్చేది గోరంతే

రాజధాని, ఆదాయ లోటుకూ సర్దుకోవాల్సిందే

తలపట్టుకుంటున్న ఆర్థికశాఖ అధికారులు

7లోగా లెక్కలు తేల్చాలని సిఎస్ ఆదేశం



**ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి**

నిధులివ్వడంలో మొండిచేయి చూపించిన కేంద్ర ప్రభుత్వం, ప్రత్యేక సాయంలో కూడా అదే వైఖరిని అవలంబించింది. వివిధ అదనపు సహాయ కార్యక్రమాల కింద ఇవ్వాల్సిన నిధుల్ని అతి తక్కువ మొత్తంలో కేటాయించడం ద్వారా రాష్ట్ర ఆశలపై నీళ్లు చల్లింది. తాజాగా బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. అయితే ఇది కేవలం రాష్ట్రానికి అనుకుంటే పొరపాటే. దేశంలోని అన్ని రాష్ట్రాలకూ కలిపి ఈ మొత్తాన్ని కేటాయించింది. అంటే సగటున ఒక్కో రాష్ట్రానికి రూ.500 కోట్లు మాత్రమే సర్దుబాటు చేసే అవకాశాలు ఉంటాయి. అయితే రాష్ట్రాల వాస్తవ పరిస్థితి ఆధారంగా కొన్ని రాష్ట్రాలకు ఎక్కువ మొత్తంలో నిధులు ఇచ్చే పరిస్థితి కూడా ఉంటుందని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. అలాగే ఈ నిధుల నుంచే ఆదాయ లోటు, రాజధాని నిర్మాణం, మిగతా 9లో

## రాజౌరీ సెక్టార్‌లో పాక్ కాల్పులు

కెప్టెన్ సహా అమరులైన నలుగురు జవాన్లు

**జమ్ము :** పాకిస్తాన్ మరోసారి భారత ఆర్మీ సెక్టార్‌పై విరుచుకు పడింది. ఈ ఘటనలో ఓ ఆర్మీ అధికారి సహా నలుగురు జవాన్లు మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నారు. జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారలు తెలిపారు. పాక్ కాల్పుల్లో ఆర్మీ కె ప్టెన్ కపిల్ కుందుతో పాటు, జవాన్లు రామ్ అవతార్, శుభం సింగ్, రోషన్ లాల్, నియాక్ మిగతా 8లో



విజయవాడలో మహిళా సంఘాల ఐక్య వేదిక 'తరుణీ తరంగాలు' పేరిట నిర్వహించిన సాహితీ, కళా రూపాల మాలికలో విశేషంగా ఆకట్టుకున్న జానపద నృత్యావళి - వార్త 3వ పేజీలో



## పోలవరం 50శాతం పూర్తి

### సిఎం చంద్రబాబు వర్చువల్ రివ్యూ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పోలవరం ప్రాజెక్టు ఇప్పటి వరకు 50 శాతం పూర్తయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సచివాలయంలో సోమవారం ఆయన పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టు పనులపై 50వ సారి వర్చువల్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత పనులు ఎంతవరకు వచ్చాయో అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. కుడి ప్రధాన కాలువ 91శాతం, ఎడమ కాలువ 60శాతం పూర్తి చేసినట్లు అధికారులు సిఎంకు వివరించారు. హెడ్ వర్క్స్ 39శాతం పూర్తికాగా, డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం 66శాతం అయ్యిందని తెలిపారు. 71శాతం వరకు స్పిల్‌వే, స్పిల్ ఛానల్ తవ్వకం పనులు, 14శాతం మేర కాంక్రీట్ నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ 58శాతం పూర్తయ్యిందన్నారు. 82 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఎర్త్‌వర్క్ తవ్వకం పనులు, 5,314 క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు, 18.8 మిగతా 9లో

# సెట్ ఫీజులకూ జిఎస్టీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి ప్రవేశాల పరీక్ష(సెట్)ఫీజులకు జిఎస్టీని వసూలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆలోచిస్తోంది. ప్రవేశ పరీక్షల ఫీజును రూ.450లుగా నిర్ణయించింది. దీనికి 18శాతం జిఎస్టీ కలిపి వసూలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ప్రవేశాల పరీక్షల నిర్వహణ అంశాలపై ఉన్నత విద్యామండలి సోమవారం సమావేశమయ్యింది.

ఆన్‌లైన్ నిర్వహణ ఏ సంస్థకు ఇవ్వాలనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆన్‌లైన్ సంస్థ ఖరారైన తరువాత నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించింది.. అగ్రికల్చర్ డిప్లొమో విద్యార్థులు బిటెక్‌లో చేరాలంటే ఈసెట్ తప్పనిసరిగా రాయాలని నిర్ణయించింది.

ప్రారంభం



విజయవాడలో రెరా ప్రధాన కార్యాలయంలో సోమవారం రెరా వెబ్‌సైట్‌ని ఆవిష్కరిస్తున్న కరికల వలవన్

# ఏపి రెరా'తో పారదర్శకత

## వెబ్‌సైట్‌ని ఆవిష్కరించిన కరికల వలవన్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఏపి రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ( ఏపి రెరా ) తో స్థిరాస్తి అమ్మకాలు, కొనుగోళ్లలో పారదర్శకత ఉంటుందని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కరికల వలవన్ అన్నారు. విజయవాడ పిఎన్ బస్ స్టేషన్ ప్రాంగణంలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ఏపిరెరా వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన రెరా చట్టం కింద అమ్మకానికి, లీజుకు ఉద్దేశించిన ప్రతి భవన సముదాయం, భూసముదాయం ( ప్లాట్లు, లేఅవుట్లు ) అన్నీ తప్పనిసరిగా రెరా రిజిస్ట్రేషన్ పొందాలన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న, నిర్మించనున్న అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు ముందుగా సంస్థ వద్ద రిజిస్టరు నెంబరు పొందిన తర్వాతే ప్రకటనలు ఇవ్వాలని, మార్కెటింగ్ చేయాలని సూచించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే నిర్మాణాన్ని ఆపివేసేందుకు, అపరాధ రుసుం విధించేందుకు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఏపిరెరాకు అధికారం ఉందన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారాన్ని చేస్తామన్నారు. ఏపిరెరా వెబ్‌సైట్ ష్చష.తీవతీఖ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ ద్వారా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్ని రిజిస్టర్ చేసుకోవడంతోపాటు ఏజెంట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రెరా వెబ్‌సైట్‌లో చేసిన ఫిర్యాదులు, రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ వెబ్‌సైట్‌కు సంబంధించిన సందేహాల్ని హెల్ప్ డెస్క్ ఇ – మెయిల్ helpdesk-rera@ap.gov.in ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు.



## 7న కోస్తా, రాయలసీమలో చిరు జల్లులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

మాల్దీవుల నుంచి కర్నాటక తీరానికి ఆనుకుని తూర్పు మధ్య అరేబియా సముద్రం వరకు అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో దక్షిణ శ్రీలంక తీరానికి సమీపంలో 1.5 నుంచి 2.1 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతున్నట్లు తెలిపింది. రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమల్లో వాతావరణం పొడిగానే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. సోమవారం రాష్ట్రంలో పాక్షిక మేఘావృతం కొనసాగింది. 7వ తేదీన దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

## ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. అంతర్జాతీయ కళా మేళాను తొలిసారిగా ఎక్కడ నిర్వహిస్తున్నారు?
2. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?
3. బంగ్లాదేశ్ నూతన ప్రధాన న్యాయమూర్తి?
4. వాతావరణ మార్పులపై అవగాహన కోసం కేంద్రం చేస్తున్న ప్రచారం పేరు ?
5. నూతన జాతీయ విద్యా విధానం కోసం ఏర్పాటు చేసిన కమిటీ?

## టీచర్ల బదిలీలకు కొత్త చట్టం

- ముసాయిదా బిల్లు సిద్ధం
- సలహాలు, సూచనల సేకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టీచర్ల బదిలీలకు రాష్ట్రప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. 1998లో బదిలీలలో కౌన్సిలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయ బదిలీలు చేపట్టిన ప్రతిసారీ ఒక్కొక్క విధానం పాటించడంతో అనేక వివాదాలు, కోర్టు కేసులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో బదిలీలకు ప్రత్యేకంగా చట్టం చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా బిల్లును పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ బిల్లుపై ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయాలు చెప్పాలని కమిషనర్ కె సంధ్యారాణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్ణాటక రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాన్ని పరిశీలించి ముసాయిదాను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ముసాయిదాపై విస్తృతంగా చర్చించి, అందరి అభిప్రాయాల్నీ తీసుకుని ప్రతిపాదనలు పంపుతామని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె సాల్జీ, పి బాబురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# శాఖాపరమైన కేటాయింపుల్లో ఎక్కువ నిధుల్ని రాబట్టండి

- నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల్ని పూర్తి చేయాలి
- సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకంగా కేటాయింపులు లేకపోవడంతో శాఖాపరమైన కేటాయింపుల్లో రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. నీరు-ప్రగతి, వ్యవసాయ అనుబంధ రంగాలపై సోమవారం ఉదయం తన నివాసం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌తో ప్రతి శాఖకూ వచ్చే నిధులపై అంచనాలు రూపొందించి, వీలైనంత ఎక్కువగా తెచ్చుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. ఉపాధి పథకంలో ఈ ఏడాది రూ.7 వేల కోట్లు వినియోగించుకోవచ్చన్నారు. క్షీర విప్లవం, నీలి విప్లవానికి రూ.10వేల కోట్లుపైగా కేటాయించారని, ఈ నిధులో రాష్ట్రానికే ఎక్కువ రాబట్టాలన్నారు. అన్ని జిల్లాలు పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని, వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు. రాబోయే ఖరీఫ్‌లో ఏ పంటలు సాగు చేయాలో ఇప్పటి నుంచే దృష్టి సారించాలని అధికారుల్ని ఆదేశించారు. పప్పు ధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ సిఎం దృష్టికి తెచ్చారు. నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల్ని వెంటనే పూర్తి చేయాలని సిఎం సూచించారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో 2016-17లో 56 శాతమే పూర్తయ్యాయని, మిగిలిన వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీకీ హెల్త్ బులెటెన్ విడుదల చేయాలన్నారు. పోషకాహార లోపంపై గ్రామాల వారీగా ప్రజల్ని చైతన్య పర్చాలన్నారు. రాష్ట్రంలో ఊబకాయం, పౌష్టికాహార లోపం పెరగడంపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖల ముఖ్య కార్యదర్శులు జవహర్‌రెడ్డి, గోపాలకృష్ణ ద్వివేది, పిఆర్ కమిషనర్ రామాంజనేయులు, జలవనరుల శాఖ ఈఎన్‌సి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం అక్రమాలకు అడ్డుకట్ట

### అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఎర్రచందనం అక్రమ రావాణాను అరికట్టేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యల్ని తీసు కుంటోంది. ఇందుకోసం ఇప్పటికే అధికారులు అడవులు, జిల్లాల్లో భద్రతను పటిష్ట పరిచేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిం చారు. ఎర్రచం దనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ఎర్రచందనం పెరిగే అడవుల్ని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి, వాటిని పరిరక్షించేం దుకు ప్రత్యేక ప్రణాళికల్ని సిద్ధం చేశారు. దీనికి ఈసారి బడ్జెట్‌లో రూ 42.20 కోట్లు కేటాయిం చాలని ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపారు. కార్యాచరణలో భాగంగా ఎ-గ్రేడ్ ఎర్రచందనం పెరిగే ప్రాంతాల్లో బేస్ క్యాంపుల్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ బేస్ క్యాంపులో స్థానిక గిరిజనులు కూడా ఉంటారు. రాష్ట్రవ్యాప్తం గా ఉన్న బేస్ క్యాంపుల్ని పటిష్ట పరచాలని అటవీ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కడప, పొద్దుటూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు డివిజన్లలో మొత్తం 74 బేస్ క్యాంపులున్నాయి. వాటికి అదనంగా మరో 27 క్యాంపుల్ని ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఇచ్చే వేతనాన్ని నిర్ణయిస్తూ ఈ క్యాంపుల్లో అటవీ సిబ్బందితోపాటు స్థానిక గిరిజనుల్ని కూడా నియమించాలని భావిస్తున్నారు. అలాగే ఎర్రచందనం స్మగ్లర్ల ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పహారా కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

## మత్స్యకారుల్ని ఎస్టీల్లో చేర్చాలి : పవన్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారిని ఎస్టీల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర పరిపాలనా కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన మత్స్యకారుల ప్రతినిధులతో కలిసి పాండిచ్చేరి మంత్రి మల్లాది కృష్ణారావు, మత్స్యకార సహకార సంఘం నేత ఆదినారాయణలు పవన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఉత్తరాదిలో మత్స్యకారులు ఎస్సీ, ఎస్టీ జాబితాలో ఉన్నారని, ఏపీ, కేరళ రాష్ట్రాల్లో మాత్రం బిసి-ఎ జాబితాలో ఉండిపోయారన్నారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ మంజూరు చేసిన రూ.380 కోట్లు సరైన లబ్ధిదారులకు చేరాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 21న శ్రీకాకుళం జిల్లాలో నిరసన సభ ఏర్పాటు చేస్తే, తాను హాజరవుతానన్నారు. ప్రధాని మోడీని కలిసినప్పుడు మత్స్యకారుల సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## షీప్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలి

### బిసి వెల్ఫేర్ అసెంబ్లీ కమిటీ ప్రతిపాదన

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గొర్రెల కాపరుల కోసం ప్రత్యేకంగా షీప్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని బిసి వెల్ఫేర్ అసెంబ్లీ కమిటీ ప్రతిపాదించింది. ఆ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ జి తిప్పేస్వామి అధ్యక్షతన సోమవారం అసెంబ్లీలో సమావేశాన్ని నిర్వహించారు. బిసిల సంక్షేమానికి సంబంధించి పలు అంశాల పై ఈ సమావేశంలో చర్చించారు. మరి కొన్ని అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ బిసి సంక్షేమ వసతి గృహాల్లో సీటు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, బిసి కార్పొరేషన్ నుంచి రుణాలు ఇచ్చే విధంగా బ్యాంకర్లను ఒప్పించాలని నిర్ణయించారు. గొర్రెల కాపరులకు బ్యాంకులు రుణాలిస్తేనే గొర్రెలకు బీమా ఉంటుందని, అలాగే లబ్దిదారుల భాగస్వామ్యం తో ప్రభుత్వంతో ఇన్సూరెన్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, బిసి సంక్షేమ శాఖలో ఉన్న ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, ప్రమోషన్లు కల్పించడంలో ప్రాధన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఈ అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నారు.

## ఎస్సీ అభ్యర్థులకు ఉచిత డిఎస్సీ శిక్షణ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయవాడలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, బిసి ( సి ) ఎస్‌జిటి అభ్యర్థులకు ఉచిత డిఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డైట్‌సెట్ పూర్తి చేసి, టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని సూచిం చారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉన్న ఎస్సీ అభ్యర్థులు, లక్ష లోపు వార్షిక ఆదాయం ఉన్న బిసి( సి ) అభ్యరులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన అభ్యర్థు లు మార్చి 3లోగా దరఖాస్తులు చేసుకోవాల న్నారు. పదవ తరగతి, ఇంటర్, టిటిసి సర్టిఫికేట్లతో పాటు టిసి, నాలుగవ తరగతి నుంచి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్లు, టెట్ అర్హత పత్రం, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సొంత చిరునామా గల రూ. 10 స్టాంపులతో రెండు ఎన్వలప్ కవర్లు, రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేసిన దరఖాస్తుల్ని స్పెషల్ ఆఫీసర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ( ఏపి స్టడీ సర్కిల్ ), డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాబు జగజ్జీవన్‌రామ్ భవన్, లెనిన్ సెంటర్, విజయవాడ చిరునామాకు పంపాలని కోరారు. ఇతర వివరాలకు 08662574388 నంబర్‌కు కానీ, krishna.ap.nic.in వెబ్‌సైట్‌ను కానీ సంప్రదించాలని కోరారు.

## నాలుగేళ్లుగా రాష్ట్రానికి అన్యాయమే : ఉండవల్లి

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయమే జరుగుతోందని రాజమహేంద్రవరం మాజీ ఎంపి ఉండవల్లి అరుణకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలు లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో వెల్‌లోకి వెళ్లి టిడిపి ఎంపీలు పోరాటం చేస్తే ప్రయోజనం ఉండదన్నారు. దేశంలో మిగిలిన పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, రాష్ట్రానికి రావాల్సినవన్నీ రాబట్టాలన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చంద్రబాబు కేంద్రంలో మద్దతు ఉపసంహరించుకుంటే, మోదీ ప్రభుత్వం పడిపోతుందన్నారు.చంద్రబాబు జైలుకే వెళ్లాల్సి వస్తే, సానుభూతితో మొత్తం 175 సీట్లూ చంద్రబాబుకే వస్తాయని ఉండవల్లి జోస్యం చెప్పారు. వైసిపి 184 కింద నోటీసులు ఇచ్చి ధైర్యం చేసిందన్నారు. టిడిపి ఇంకా దోబూచులాడుతూ, మెతకవైఖరి అవలంభిస్తూ 193కింద నోటీసుతోనే సరిపెట్టిందన్నారు. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు టిడిపి గురించి, చంద్రబాబు గురించి చేస్తున్న వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయని, వీర్రాజు ఇలా మాట్లాడడాన్ని బట్టి చూస్తే, టిడిపితో గొడవ పెట్టుకోవాలని బిజెపి అధిష్టానమే ప్రోత్సహిస్తున్నట్లు ఉందని అభిప్రాయ పడ్డారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అధికార ప్రతిపక్షాలకు చెందిన 25 మంది ఎంపిలు బిజెపికే మద్దతు ఇస్తున్నారని, అందువల్లే రాష్ట్రానికి ఈ దుస్థితి దాపురించిందని ఉండవల్లి పేర్కొన్నారు.

# సోముపై ఆగ్రహావేశాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరగడంపై రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పలు రూపాల్లో నిరసనలు జరిగాయి. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టిడిపి నాయకులు పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు.

**విజయవాడలో దిష్టిబొమ్మ దహనం**

విజయవాడలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. మహాత్మాగాంధీ రోడ్డులోని టిడిపి జిల్లా కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి బచ్చుల అర్జునుడు మాట్లాడారు. వీర్రాజు వ్యాఖ్యలకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు సంజాయిషీ చెప్పాలన్నారు.

**రాజమహేంద్రవరంలో లాఠీఛార్జి**

బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు కార్యాలయాన్ని బిసి విద్యార్థి సంఘం కార్యకర్తలు ముట్టడించారు. నిరసనకారులకు వ్యతిరేకంగా సోము వీర్రాజు అనుచరులు, బిజెపి శ్రేణులు నినాదాలు చేయడంతో ఉద్రికత్తత నెలకొంది. పరస్పరం కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్వల్ప లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు.



వీర్రాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిడిపి నాయకులు

**బాబుపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి : డొక్కా**

ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని శాసన మండలిలో ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గుంటూరులో ఆయన మాట్లాడుతూ వీర్రాజు భాషా, పదజాలమూ సరిగా లేదని, చంద్రబాబుపై వ్యాఖ్యలను వీర్రాజు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

## ఏపీలో పెట్టుబడులు పెట్టండి : లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏపీలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలు, కంపెనీల సిఇవోలను ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. విదేశీ పర్యటనలో భాగంగా సోమవారం బోస్టన్‌లో పలువురు పారిశ్రామికవేత్తలు, పలు కంపెనీల సిఇవోలతో ఆయన భేటీ అయ్యారు. సమస్యల్ని అధిగమించి అభివృద్ధి సాధిస్తున్నామని, 15 శాతం వృద్ధి సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నామన్నారు. పరిశ్రమలు పెట్టేందుకు అనుమతుల్ని త్వరితగతిన ఇస్తున్నామని, భూముల్ని కేటాయించడంతో పాటు రాయితీలు, సబ్సిడీలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన నైపుణ్యం కలిగిన యువత ఉన్నారన్నారు. అందరూ ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి కంపెనీలను తీసుకురావాలని కోరారు. అంతకుముందు కంటెంట్ డెలివరీ నెట్వర్క్ సేవల్ని అందిస్తున్న ఆకమై కంపెనీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కంపెనీలకు అందిస్తున్న రాయితీల గురించి వివరించారు.

## మహిళపై యాసిడ్ దాడి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ నగరంలోని ఎంవిపికాలనీ సెక్టార్-2లో నివాసముంటున్న ఎస్.సత్యవతి (65)పై సోమవారం రాత్రి దాడి జరిగింది. ఎంవిపి పోలీసుల కథనం ప్రకారం.. సత్యవతి ఇంట్లో రవణమ్మ కొంతకాలంగా ఇంటి పనులు చేస్తోంది. సత్యవతి మెడలో ఉన్న బంగారం కన్నేసింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సత్యవతి ముఖంపై మరుగుదొడ్లు శుభ్రపరిచే యాసిడ్ పోసి బంగారం దొంగిలించడానికి ప్రయత్నించింది. సత్యవతి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. దీంతో రవణమ్మ పరారైంది. సత్యవతిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేకం

# సీట్లూ లేవు...నోట్లూ లేవు

- అయోమయంలో రాష్ట్రం పరిస్థితి
- అసెంబ్లీ సీట్ల పెంపుపై అంతర్మథనం
- స్వీయ తప్పిదాలే కారణమా?



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలాగా తయారయ్యింది. ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకున్న అసెంబ్లీ సీట్ల పెంపు కనుచూపుమేరలో కనిపించకపోగా, తాజాగా ఆశలు పెంచుకున్న నోట్లు కూడా బడ్జెట్‌లో రాకుండా పోయాయి. దీంతో అటు పార్టీపరంగా, ఇటు ప్రభుత్వ పరంగా ఇబ్బందులు నెలకొంటున్నాయి. దీంతో కక్కలేక, మింగలేక చంద్రబాబు సందిగ్ధంలో పడిపోయారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ స్థానాల పెంపు జరిగితే రాజకీయంగా మేలు జరుగుతుందని భావించిన చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో ప్రతిసారీ దానిపైనే కేంద్రంతో మాట్లాడేవారు. వైయస్‌ఆర్ సిపి నుంచి వలసలు ఎక్కువగా ఉన్నందున వారికి సీట్లు సర్దుబాటు చేయాలంటే సీట్ల పెంపు అనివార్యమని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రంపై ఒత్తిడి కూడా తీసుకొచ్చారు. అందుకే ఇతర అంశాలపై కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేయలేకపోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి. గత నెల్లో దీనికి సంబంధించి మోడీ ఆమోదముద్ర వేసారని, రాష్ట్రపతికి వెళ్లిందని, పార్లమెంట్‌లో ప్రవేశపెడతారని ప్రచారం జరగడంతో చంద్రబాబు ఉత్సాహంలో మునిగిపోయారు. అందుకే బడ్జెట్ కేటాయింపులపై పెద్దగా ఒత్తిడి చేయలేదని కూడా ప్రచారం జరిగింది. ప్రతిపక్షాలు కూడా ఇవే ఆరోపణల్ని చేశాయి. సీట్ల పెంపు డిమాండ్ వల్ల ఇతర రాష్ట్ర ప్రయోజనాలు గాలిలో కలిసిపోతున్నాయని కూడా ఆ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పార్లమెంట్ సమావేశాల్లో ఇప్పటివరకు దీనిపై బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ సమావేశాల్లో నిర్ణయం తీసుకునే అవకాశాల్లేనట్లు కనిపిస్తోంది.

కాగా, సీట్ల డిమాండ్ వల్ల బడ్జెట్‌పై పెద్దగా దృష్టి సారించలేదన్న వాదనకు ప్రస్తుతం బడ్జెట్ ప్రతిపాదన బలం చేకూరుస్తోంది. బడ్జెట్ ప్రతిపాదన నేపథ్యంలో అందరి ఆందోళనా నిజమైనట్లు కనిపిస్తోంది. రాష్ట్రానికి బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా రాకపోవడం, రాజధాని, పోలవరం, ఆదాయ లోటు వంటి అనేక రంగాలకు మొండిచేయి లభించడం, కోస్టల్ కారిడార్, విశాఖలో రైల్వే జోన్ వంటి ఊసే లేకపోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే సీట్ల పెంపు ఆలోచన లేకపోవడం, బడ్జెట్‌లో నోట్లు రాలకపోవడంతో రాష్ట్రం పరిస్థితి రెంటికీ చెడ్డరేవడిగా మారినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. దీనికి అధికారులు, మంత్రుల స్వీయ తప్పిదాలు, మొత్తం ప్రభుత్వ నిర్లిప్తత కారణాలుగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

సంక్షిప్తం

## టెట్ పేపర్-3 మార్పునకు నేటితో గడువు పూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో భాషాంశాల అభ్యర్థుల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన పేపర్-3 మార్పునకు మంగళవారంతో గడువు ముగియనుంది. భాషా పండిట్ల కోసం టెట్ పేపర్-3ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ముందుగా పేపర్-2కు దరఖాస్తు చేసుకున్న పండిత అభ్యర్థులందరూ పేపర్-3కి మార్పు చేసుకోవాలి. ఈ నెల 10 నుంచి టెట్ అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## విశాఖ మక్కా మసీద్‌కు రూ. 78 లక్షలు

విశాఖపట్నం జిల్లా మహారాణిపేటలో ఇది వరకే ఉన్న మక్కామసీదు భవనం రెండో అంతస్తు నిర్మాణానికి రూ. 78 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె ప్రవీణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సిఇవో జిల్లా కలెక్టర్‌కు నిధుల్ని పంపనున్నారు. నిర్మాణ పనుల్ని జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తారు.

## గొప్పోళ్లంతా ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చినవారే : ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

గొప్పోళ్లంతా ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన వారేనని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. విట్-ఎపిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని ముఖ్యమైన ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే డిజిటల్ తరగతులు జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో వంద శాతం పూర్తవుతుందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి రానుందన్నారు.

## వైభవంగా నంది నాటిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు)

కళామతల్లి ఒడి అయిన తెనాలిలో నంది నాటకోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఏడు బాలల నాటికలను ప్రదర్శించగా నాటక సమాజాలకు ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ రూ.15 వేల ప్రోత్సాహక బహుమతులను అందించారు. దేశంలో పుట్టి పాకిస్తాన్ తీవ్రవాదులకు సహకరించడం, ఆ తీవ్రవాదుల చేతిలోనే సహకరించిన వ్యక్తి సోదరి అత్యాచారానికి గురవడం, వృద్ధ తల్లితో కలిసి ఆమె వారిని అంతమొందించే నేపథ్యంలో 'మేరా భారత్ మహాన్' నాటికను ప్రదర్శించారు. వ్యాధితో తల్లిదండ్రులు మరణించగా గర్భంలోనే రోగం సోకిన బాలికను దయార్ధ్ర హృదయంతో చేరదీసి పెంచడం, బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే ఇతివృత్తంతో కొనసాగిన 'దేవుడిచ్చిన వరం' నాటిక ప్రేక్షకులను కంటతడి పెట్టించింది.



గుంటూరు జిల్లా తెనాలిలో జరుగుతున్న నంది నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రదర్శించిన 'బ్రేకింగ్ న్యూస్ నాటిక'లో సన్నివేశం

## 10, 11 తేదీల్లో 26వ జాతీయ నాస్తికమేళా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చార్వకాశ్రమంలో ఈ నెల 10, 11 తేదీల్లో 26వ జాతీయ నాస్తికమేళా నిర్వహించనున్నట్లు నాస్తిక సమాజం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, మహిళా విముక్తికై హేతువాదం అనే అంశంపై స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు సి విజయ, 'మూఢ విశ్వాసాల వ్యాప్తిలో మత ప్రవచనకర్తలు' అనే అంశంపై మూఢ నమ్మకాల నిరోధక చట్ట సాధన సమితి కన్వీనర్ పి సుబ్బరాజు, 'భారతీయ సమాజం-కుల ప్రభావం' అనే అంశంపై మార్క్స్-అంబేద్కర్ అధ్యయన వేదిక అధ్యక్షులు బివి రాఘవులు, 'నేటి రాజ్యంలో మతోన్మాద ప్రభావం' అనే అంశంపై ఏపీ హేతువాద సంఘం పూర్వ కార్యదర్శి కత్తి పద్మారావు, 'బాల బాలికలు-హేతువాదం' అనే అంశంపై చైతన్య మహిళా సంఘం నాయకురాలు సిపోర ప్రసంగిస్తారని పేర్కొన్నారు. రాత్రి పెరియార్ సినిమాను ప్రదర్శిస్తారని, సాయంత్రం మంగళగిరిలో ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 11న జరిగే కార్యక్రమాల్లో 'శ్రామిక ఉద్యమాలు-భౌతికవాద దృక్కోణం' అనే అంశంపై ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి జె కిశోర్ బాబు, 'జాషువా సాహిత్యం-హేతువాద భావజాలం' అనే అంశంపై అధ్యాపకులు కోయి కోటేశ్వరరావు, 'దేశభక్తి-జాతీయవాదం' అనే అంశంపై విప్లవ రచయితల సంఘం సి కాశీం, 'నాస్తికత్వం-ఆచరణ' అనే అంశంపై నాస్తిక సమాజం నాయకులు ఎంఎన్ బుద్ధ, 'దళిత ఉద్యమాలకు అండగా హేతువాదం' అనే అంశంపై దళిత విముక్తి కన్వీకన్ ఎస్‌వి రమణ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. హృద్యమైన భావం, భారత రాజకీయాలు-అంబేద్కర్ దృక్పథం, ఫిన్‌ల్యాండ్ విద్య పుస్తకాల్ని ఆవిష్కరిస్తారని, 'శాస్త్రజ్ఞులపై మతవాదుల దాడులు-విజ్ఞాన శాస్త్ర పురోగమనం' రాత్రి లేజర్‌షో ఉంటుందని తెలిపారు.

# మహాసభల ప్రచారం మార్మోగుతోంది

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.సత్యనారాయణరాజు



ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రచారం మార్మోగుతోంది. గోడరాతలు, కళారూపాలు, సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ సభలకు వివిధ జిల్లాలతో పాటు పోరాటాల్లో కాకలు తీరిన యోధులు, ఉద్యమ నేతలు సుమారు ఎనిమిది వందల మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 10, 11, 12 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించనున్న సందర్భంగా మహాసభల విశిష్టత, ప్రాముఖ్యత, నిర్వహణ, ప్రచారం వంటి అంశాలపై మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్‌ఎస్) ప్రజాశక్తితో మాట్లాడారు.

**ప్ర: సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు పశ్చిమ గోదావరి జిల్లాలో.. అదీ భీమవరంలో నిర్వహించడంపై ఎలా ఫీలవుతున్నారు?**

**జ:** మొదటిసారి భీమవరంలో సిపిఎం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ జరిగిన అన్ని రాష్ట్ర మహాసభలకు హాజరయ్యాను. నాకు వయస్సు అయిపోయింది. రాష్ట్ర నాయకత్వాన్ని భీమవరంలో రాష్ట్ర మహాసభలు పెట్టాలని కోరాము. జిల్లా నాయకత్వం, నా కోరిక మేరకు ఇక్కడ మహాసభలు నిర్వహించేందుకు రాష్ట్ర కమిటీ ఆమోదం తెలిపింది. నా జీవితంలో ఇవే చివరి మహాసభలు అనుకుంటున్నాను. ఈ మహాసభలు గత మహా సభల కంటే సిద్ధాంత రీత్యా, రాజకీయ నిర్మాణ రీత్యా చాలా ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. ఈ మహాసభల్లో ఇప్పటి వరకూ జరిగిన ఉద్యమాలు, పోరాటాలు, పని పద్ధతులపై సమీక్షించడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణ, కర్తవ్యాలను నిర్ణయించనున్నాయి.

**ప్ర:మహా సభల నిర్వహణకు ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి?**

**జ:** గత 20 రోజులుగా భీమవరం పట్టణ పరిసర ప్రాంతాలతోపాటు జిల్లాలో గోడ రాతలు, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ మహా సభలకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి పోరాటాల్లో కాకలు తీరిన యోధులు, ఉద్యమ నేతలు సుమారు ఎనిమిది వందల మంది వరకూ ప్రతి నిధులుగా హాజరు కానున్నారు. ఇప్పటికే ఈ సభల ప్రాముఖ్యత, ప్రాధాన్యత వివరిస్తూ కళా రూపాలతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా భీమవరం పరిసర ప్రాంతాల్లో అన్ని తరగతుల ప్రజలను కలిశారు.

**ప్ర: నాడు మీరు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న కాలానికి, ప్రస్తుత కాలానికి ఉద్యమ రూపాల్లో ఏమైనా తేడాలున్నాయా?**

**జ:** ప్రస్తుతం పార్లమెంటరీ యుగంలో ఉన్నాం. 1948-49-50 సంవత్సరాల్లో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నాం. ఒకవైపు భూస్వాములు, మరోవైపు కమ్యూనిస్టు వ్యతిరేక శక్తుల దాడులను ఎదుర్కోవాల్సి వచ్చేది. నాటి పరిస్థితులకు, నేటి పరిస్థితులకు తేడా ఉంది. సిపిఎం విశిష్టతను కాపాడుకుంటూ ప్రస్తుతం ముందుకు సాగుతోంది. ఉద్యమంలోకి యువత ఎక్కువగా రావాల్సి ఉంది. దాని కోసం ప్రత్యేక కృషి ప్రారంభమైంది.

**ప్ర:వృద్ధాప్యంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుని బాధ్యతలు అప్పగించడంపై మీరు ఎలా ఫీలవుతున్నారు?**

**జ:** మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించడం చాలా సంతృప్తి, గౌరవంగా ఉంది. నా ఓపిక మేరకు ఈ మహాసభల జయప్రదానికి శ్రమించి పని చేస్తున్నాను. నాయకత్వం నాకు ఏ బాధ్యతలు ఇచ్చినా చేయడానికి కృషి చేస్తాను.

**ప్ర: మహాసభల ప్రచారం, ఏర్పాట్లకు జన స్పందన ఎలా ఉంది?**

**జ:**జిల్లాతోపాటు భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రచారం మార్మోగుతోంది. గోడరాతలు, కళారూపాలు, సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా సాగుతున్న ప్రచారం ప్రజల హృదయాల్లో బాగా నాటుకుంది. ఈ మహాసభల సందర్భంగా ఈ నెల 10న నిర్వహించే ప్రజాప్రదర్శన, బహిరంగ సభలకు విస్తృతంగా జన సమీకరణకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయి.

**ప్ర: చివరిగా ప్రజలకు, కమ్యూనిస్టు శ్రేణులకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

**జ:** ప్రజలు, కార్మికులు కొన్ని పరిస్థితుల్లో బూర్జువా పార్టీల వెనుక వెళ్తున్నారు. వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉంది. పేదలు అనివార్యంగా భవిష్యత్తులో కమ్యూనిస్టుల వెనుక రాక తప్పదు. దీనికోసం కార్యకర్తలు నీటిలో చేపలా ప్రజలతో మమేకం కావాలి. తద్వారా భవిష్యత్తు పోరాటాలకు ప్రజాపునాదిని నిరంతరం బలపర్చుకోవాలి.

పంచదార ధర పతనమైంది. ఫలితంగా చక్కెర పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయిన సహకార చక్కెర కర్మాగారాలపై దీని ప్రభావం చూపనుంది. కొంతకాలంగా చెరుకు సాగు తగ్గి, ఫ్యాక్టరీ క్రషింగులు గణనీయంగా పడిపోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీలు పంచదార ధరపైనే ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి. గతేడాది పంచదార క్వింటా రూ.3,800 నుంచి రూ.4 వేలు వరకు అమ్ముడు పోయింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.3,060కు పడిపోయింది. ఈ నేపథ్యంలో యజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

# తగ్గుతున్న పంచ'ధర'

- క్వింటాకు రూ.600 వరకు తగ్గుదల
- చక్కెర పరిశ్రమలకు తీవ్ర నష్టం
- సహకార ఫ్యాక్టరీలపై అధిక ప్రభావం



ప్రజాశక్తి-విజయనగరం ప్రతనిధి

విజయనగరం జిల్లాలో ఏకైక సహకార చక్కెర పరిశ్రమగా భీమసింగి విజయరామ గజపతి కర్మాగారం నడుస్తోంది. ఈ ఫ్యాక్టరీ ఇప్పటికే సుమారుగా రూ.42 కోట్లు వరకు అప్పుల్లో ఉంది. ఈ ఏడాది క్రషింగ్ ఆశాజనకంగా చేపట్టి అప్పుల ఊబి నుంచి బయట పడాలన్న ఉద్దేశంతో యాజమాన్యం క్రషింగ్‌ను ముందుగానే ప్రారంభించింది. క్రషింగ్ ఆశాజనకంగా సాగుతున్నప్పటికీ ఆశించిన మేర రికవరీ రావడం లేదు. దీనికి తోడు పంచదార ధర కూడా పడిపోయింది. వాస్తవానికి భీమసింగి పరిశ్రమలో అన్నీ పురాతన యంత్రాలే. దీంతో ఒక బస్తా పంచదార ఉత్పత్తికి రూ.1000 వరకు ఖర్చువుతోంది. చెరుకు రైతుకు మరో రూ.2600 చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఒక బస్తాకు రూ.3600 వరకు ఖర్చువుతోంది. బస్తా దగ్గర రూ.600 వరకు నష్టపోవాల్సి ఉంది. ఫ్యాక్టరీ లక్ష బస్తాలు ఉత్పత్తి చేస్తే రూ.6 కోట్లు వరకు నష్టం తప్పదు. అంతర్జాతీయ మార్కెట్లో పంచదార ధరలు పడిపోవడం, విదేశీ పంచదార దేశంలోకి దిగుమతి కావడంతో దేశీయ పంచదారకు డిమాండ్ తగ్గి ధర పడిపోయిందని అధికారులు చెబుతున్నారు.

**సహకార ఫ్యాక్టరీలకు తీవ్ర నష్టం**

సామాన్యుడు కొనుక్కోలేని విధంగా మార్కెట్‌లో పంచదార ధర ఉంటే ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేసే పంచదారకు మాత్రం రోజురోజుకూ ధర పడిపోవడం దారుణం. రికవరీ అనుకున్నంత రాకపోవడం, ధర పతనంతో ఫ్యాక్టరీలు అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు.

**- ముత్యాలు, సుగర్ కేన్ కమిషనర్**

**ధర తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది**

పంచదార ధర రోజురోజుకూ పడిపోవడం ఆందోళనకరంగా ఉంది. క్వింటా రూ.3 వేలకు తగ్గిపోవడంతో ఉత్పత్తికి, అయ్యే ఖర్చు కూడా రాని పరిస్థితి. కనీసం ఆ ధరకైనా అమ్ముదామంటే ట్రేడర్స్ ఎవరూ ముందుకు రావడం లేదు. ధర పెరుగుతుందని ఎదురు చూస్తున్నాం.

**- ఎం.సత్యన్నారాయణ, ఎండి భీమసింగి**

## శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లోని శ్మశాన వాటికలను రూ.80కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు పురపాలక శాఖమంత్రి నారాయణ తెలిపారు. సోమవారం ఆయన నగరంలోని కబాడిపాళెం, రంగనాయకులపేట, జనార్ధన్‌రెడ్డికాలనీ, దీనదయాళ్ నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్ కాలనీల్లోని శ్మశానవాటికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.80 కోట్లలో ప్రభుత్వం రూ.40 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇతర నిధులను మున్సిపాల్టీ, ఇతర వనరుల ద్వారా సేకరించాలని తెలిపారు. ఈ నిధులతో శ్మశానవాటికలకు ప్రహరీ గోడలు, లైట్లు, పారిశుధ్యం, మంచినీరు తదితర వసతులు కల్పిస్తామన్నారు. నగరంలోని శ్మశానవాటికల్లో ముళ్ల కంపల్ని తొలగించి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని నగర పాలక సంస్థల కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీంబాషా, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంఎల్ఎ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తాళ్లపాక అనూరాధ, పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగలముఠా అరెస్టు

### రూ.36 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం క్రైమ్

అపార్టుమెంట్లలో చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగలముఠాను రాజమహేంద్రవరం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.36 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులతో పాటు విదేశీ కరెన్సీ నోట్లు, రెండు యాక్టివా మోటార్ బైకులు, ఐదు మొబైల్ ఫోన్లు, ఇంటి తలుపులు తెరిచేందుకు ఉపయోగించిన ప్రత్యేక ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌పి బి.రాజకుమారి వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆవుల కిరణ్‌కుమార్ అలియాస్ రాహుల్ నేతృత్వంలోని ఈ ముఠా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు చోరీలకు పాల్పడుతుందన్నారు. అతనితోపాటు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కోరుమిల్లి సత్యసాయి పాండురంగ విఠల్, ఉర్ల శ్రీనివాసరావు, మానేపల్లి వీరవెంకట సూర్యసత్య నాగమోహన్ గుప్తా రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టున ఇసుకర్యాంపు వద్ద చోరీ సొమ్ము పంచుకునేందుకు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సెంట్రల్ జోన్ డిఎస్‌పి జె.కులశేఖర్ ఆధ్వర్యాన పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. కిరణ్‌కుమార్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 70కి పైగా చోరీల్లో అరెస్టయి, పలుమార్లు జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. తనకు జైలులో పరిచయమైన నిందితులు ముగ్గురితో కలిసి కొన్ని నెలలుగా రాజమహేంద్రవరంతోపాటు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో 16కు పైగా చోరీలకు పాల్పడ్డాడని చెప్పారు. ఈ సమావేశంలో డిఎస్‌పి కులశేఖర్, సిఐ రవీంద్ర పాల్గొన్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌పి

## రైతు ఆత్మహత్యాయత్నం

### తహశీల్దార్ ఎదుటే పురుగుల మందు తాగిన వైనం

ప్రజాశక్తి-బంటుమిల్లి



బొమ్మిడి సత్యనారాయణ

తన పొలాన్ని పక్క రైతులు తవ్వేస్తున్నారని, ఈ సమస్యను అధికారులు కూడా పరిష్కరించడం లేదని మనస్తాపం చెందిన ఓ రైతు స్థానిక తహశీల్దార్ ముందే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం నారాయణపురంలో సోమవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం.. నారాయణ పురానికి చెందిన బొమ్మిడి సత్యనారాయణ(50) తండ్రి బొమ్మిడి వెంకటేశ్వరావు పేరున దాదాపు 8ఎకరాల 20 సెంట్ల భూమి ఉంది. ఈ పొలాన్ని స్థానికంగా ఉన్న రైతులు తవ్వేస్తూ వారి పొలంలో కలిపేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా ఇప్పటివరకూ ఎకరానికిపైగా పొలాన్ని చెరువుగా మార్చారు. ఈ విషయాన్ని స్థానిక తహశీల్దార్ డి.వి శేఖర్‌రావుకు సత్యనారాయణ గతంలో ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోనూ ఫిర్యాదు చేయడానికి వెళ్తే వారు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్దే సమస్య పరిష్కారమవుతుందన్నారు. దీంతో సోమవారం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. అయినా వారు స్పందించకపోడంతో విధిలేని పరిస్థితులో తహశీల్దార్ ముందే పురుగులమందు తాగాడు. స్థానికుల సహాయంతో బాధితుడిని చిన్నపాండ్ర ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరగా ఇది అన్నదమ్ముల గొడవని, దానిని వారే తెల్చుకోవాలని, పొలానికి సంబంధించిన అడంగల్ పత్రాలను తీసుకు రమ్మని తెలపడంతో అ తను ఆత్మహత్మ చేసుకోబోయాడని తెలిపారు.





ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న యండపల్లి శ్రీనివాసులురెడ్డి

## ఎస్‌ఎఫ్‌ఐ 'ప్రజ్ఞా వికాస ప్రశ్నాపత్రం' విడుదల

### విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి : యండవల్లి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న 'ప్రజ్ఞా వికాస పరీక్షా ప్రశ్నాపత్రాన్ని' తిరుపతిలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి గిరికుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యండపల్లి శ్రీనివాసులురెడ్డి, లిటిల్ ఏంజెల్స్ స్కూల్ కరస్పాండెంట్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై పోరాటాలే కాకుండా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బట్టీ విధానానికి స్వస్తి పలికి సృజనాత్మకతను పెంచేలా ప్రశ్నాపత్రం రూపొందించారని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, జయచంద్ర మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం పోరాడుతూనే, మరోవైపు విద్యార్థులకు, నిరుద్యోగులకు మోడల్ టెస్టులను నిర్వహిస్తుండటం వల్ల విశేషమైన స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాధవకృష్ణ, విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భరత్‌రెడ్డి, మునెప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఫెస్ట్

# ఉత్సాహంగా తరుణీ తరంగాలు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం(విజయవాడ)

తరుణీ తరంగాలు పేరిట సోమవారం నిర్వహించిన జానపద నృత్యాల ప్రదర్శన కోలాహలంగా జరిగింది. తొలుత అభ్యుదయ గీతాలాపన పోటీలు నిర్వహించారు. ఏకపాత్రాభినయం, వ్యాసరచన, కథారచన వంటి కార్యక్రమాలు జరిగాయి. రెడ్‌క్రాస్ సంస్థ సౌజన్యంతో ఆత్మరక్షణలో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్ రవి కరాటేలో మెళకువలను విద్యార్థులు, మహిళలు చేసి చూపించారు.

విజయవాడలోని మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మహిళా ఫెస్ట్ కార్యక్రమంలో మహిళలు, కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకనుగుణంగా నూతన రాజధాని అమరావతిని ఉమెన్ సేఫ్ సిటీగా తీర్చిదిద్దేందుకు లక్ష్యం నిర్దేశించుకొని పోలీసు శాఖ పని చేస్తోందని చెప్పారు. అంతకుముందు రెండ్రోజుల పాటు నిర్వహించనున్న మహిళా ఫెస్ట్‌ను సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మాయిలు ఎక్కువ అహం ప్రదర్శించకుండా కుటుంబ విలువల్ని కాపాడాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళల్ని గౌరవించాలనే అంశానికి విస్తృత ప్రచారం కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన తరుణీతరంగాలు అధ్యక్షురాలు డాక్టర్ రావి శారద మాట్లాడుతూ యువతుల్లో ఆత్మస్థైర్యాన్ని, చొరవను, శక్తి సామర్థ్యాలను పెంచేందుకు తరుణీతరంగాలు పని చేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, తరుణీతరంగాలు గౌరవాధ్యక్షురాలు చెన్నుపాటి విద్య, ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, స్వాతంత్ర సమరయోధురాలు మనోరమ, డాక్టర్ నాగళ్ల విద్యాకన్న, మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## కీళ్లమార్పిడిపై విదేశీ సర్జన్లకు శిక్షణ

### సాయిభాస్కర్ హాస్పిటల్ అధినేత నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

నవ్యాంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా కీళ్లమార్పిడి విభాగంలో అంతర్జాతీయ ఫెలోషిప్‌కు గుంటూరు సాయిభాస్కర్ హాస్పిటల్‌కు అవకాశం దక్కిందని హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బంగ్లాదేశ్, ఇండోనేషియా దేశాల ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీలతో ఆ దేశాలకు చెందిన యువసర్జన్లకు శిక్షణిచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. తమ హాస్పటల్‌లో ప్రతి ఆరు నెలలకు నలుగురికి కీళ్లమార్పిడిపై శిక్షణ ఇస్తామని, ఇలాంటి ఒప్పందం వల్ల మెడికల్ టూరిజం పెరగటంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ప్రస్తుతం ఢాకాలో నెలకు 25 కీళ్లమార్పిడి ఆపరేషన్లు చేస్తున్నారని, ఢాకాలోని ప్రభుత్వ వైద్యశాలలో 500 పడకలతో ఆర్థో విభాగం ఉన్నా మరో 500 పడకలు పెంచనున్నారని వివరించారు. దీంతో సార్క్ దేశాలలోనే ఇది అతిపెద్ద ఆర్థో విభాగంగా మారుతుందన్నారు. మార్చి 23 నుంచి అహ్మదాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ ఆర్థోప్లాస్టీ సదస్సుకు సాయిభాస్కర్ హాస్పటల్ నుంచి కీళ్లమార్పిడిని లైవ్‌గా ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తూ యువకుడు మృతి

ప్రజాశక్తి -కనగానపల్లి

అనంతపురం జిల్లా కనగానపల్లి మండలంలో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తూ ఓ యువకుడు విద్యుధ్ఘాతానికి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండల పరిధిలోని దాదులూరు గ్రామానికి చెందిన ధనుంజయ (27) కరెంటు పనులకు దినసరి కూలీగా పనిచేస్తుండేవాడు. సోమవారం దాదులూరు-చంద్రాచర్ల మధ్యలో గల తోటకు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్నాడు. ఒక్కసారిగా కరెంటు సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురై తీగలపైనే ప్రాణాలను వదిలాడు.

సంపాదకీయం

# ప్రధాని పకోడీ ఉద్యోగాలు

ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ఒక ప్రైవేటు చానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ రోడ్ల పక్కన పకోడీలు అమ్ముకోవడం కూడా స్వీయ ఉద్యోగమేనని సెలవిచ్చారు. పకోడీలు అమ్ముకునే వ్యక్తి రోజుకు తక్కువలో తక్కువ రూ.200 సంపాదిస్తాడనీ చెప్పుకొచ్చారు. ఈ ఉద్యోగాల లెక్కలు ఏ పుస్తకాల్లోనూ ఏ కాగితాల్లోనూ నమోదు కావన్నారు. ప్రధాని ఉద్ఘాటన మేరకు వీధుల వెంట పకోడీలు, బజ్జీలు, పునుగులు అమ్ముకునేవారు, చిన్న చిన్న సామాను విక్రయించి ఏ పూటకాపూట పొట్టపోసుకునే అల్పాదాయ జీవులందరూ ఉపాధి పరులే. ప్రభుత్వం వల్లనే వారందరికీ సదరు ఉద్యోగాలొచ్చాయి మరి! ఉద్యోగాల కల్పనపై బాధ్యతాయుత స్థానంలో ఉన్న మోడీ ఈ విధమైన ప్రకటన చేయడం విషాదం. మూడున్నరేళ్ల పాలనలో ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఎన్‌డిఎ సర్కారు ఘోరంగా వైఫల్యం చెందిందనడానికి పకోడీ వాలాలపై ప్రధాని వక్కాణింపు తిరుగులేని సాక్ష్యం.

కాంగ్రెస్ పాలనలో దేశం సర్వనాశనమైందని నిరుద్యోగం పెరిగిందని తాము భిన్నమైన వారమని ఎన్నికల్లో తూలనాడిన మోడీ, తామొస్తే ఏడాదికి రెండు కోట్ల కొత్త ఉద్యోగాలిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ వాగ్దానం నెరవేర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందారు. తీరా ఎన్నికల ఏడాదిలో పడ్డాక పకోడీ వాలాల సృష్టి సైతం తమ ప్రభుత్వ ఘనతగా నిస్సిగ్గుగా చాటుతున్నారు. సర్కారు వైఫల్యం నుంచి ప్రజలు, ముఖ్యంగా నిరుద్యోగ యువతను పక్కదారి పట్టించేందుకు పకోడీ పంచాంగ శ్రవణాన్ని ఆలాపిస్తున్నారు. బిజెపి సర్కారు తమకు నిజంగానే ఉద్యోగాలిస్తుందేమోనని కళ్లల్లో వత్తులేసుకొని కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న కోట్లాది మంది నిరుద్యోగుల్లో ప్రధాని పకోడీ సూత్రీకరణపై సహజంగానే ఆగ్రహావేశాలు మిన్నంటాయి. ఆదివారం మోడీ ర్యాలీ సందర్భంగా బెంగళూరు నగరంలో విద్యార్థులు పకోడీలు అమ్మి నిరసన తెలిపారు. పకోడీల అమ్మకమూ స్వయం ఉపాదేనన్న ప్రధాని ఉవాచ నిరుద్యోగులపై సంధించిన క్రూరమైన జోక్ అని సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ నేత చిదంబరం అయితే వీధుల్లో అడుక్కుతినే వారు కూడా మోడీ సర్కారు దృష్టిలో ఉద్యోగులేనని ఘాటుగా విమర్శించారు.

ఉద్యోగ కల్పన విషయంలో ప్రధాని వ్యాఖ్యలపై సర్వత్రా దుమారం చెలరేగ్గా, నిరుద్యోగులను అపహాస్యం చేయడంపై తప్పు ఒప్పుకొని లెంపలేసుకొని జాతికి క్షమాపణలు చెప్పాల్సిన బిజెపి, పార్లమెంట్ సాక్షిగా సమర్థించుకోవడం మరీ దారుణం. అధికారపార్టీ అధ్యక్షుడు అమిత్‌షా సోమవారం రాజ్యసభలో చేసిన తొలి ప్రసంగంలో ప్రధాని 'పకోడీ' వ్యాఖ్యలు సరైనవేనని కితాబిచ్చారు. నిరుద్యోగులు ఖాళీగా ఉండే బదులు సాయంత్రం వేళల్లో పకోడీలు అమ్ముకొని ఎంతోకొంత సంపాదించడం మంచిదేని ఉద్బోధించారు. బిజెపి నాయకుల వాలకం చూస్తుంటే నిరుద్యోగులను వీధులపాల్జేసేందుకు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఉపాధి కల్పనపై 2015-16లో వచ్చిన ప్రభుత్వ సర్వే ప్రకారం దేశంలో పని చేయగలిగే వారి (వర్క్‌ఫోర్స్)లో సగం మంది నిరుద్యోగులే. అంటే 120 కోట్ల జనాభాలో 60 కోట్ల మంది ఉపాధి రహితంగా కొట్టుమిట్టాడుతున్నారన్నమాట. వీరిలో 41 శాతం మంది చిన్న చిన్న పనులు చేసుకోవడం ద్వారా నెలకు రూ.ఐదు వేల వరకు సంపాదిస్తున్నారు. అటువంటి వారి వార్షిక ఆదాయం రూ.60 వేలు. ప్రజలు ఇలాంటి అల్పాదాయ వనరులపై ఆధారపడటానికి కారణం ప్రభుత్వరంగంలో ఉద్యోగాల భర్తీ నిలిచిపోవడమే. ప్రైవేటురంగంలో అరకొరగా తక్కువ వేతనాలతో ఉద్యోగులను నియమించుకుంటున్నారు. ప్రభుత్వేతర సంఘటిత రంగంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ప్రాతిపదికన అదీ స్వల్ప సంఖ్యలో ఉపాధి దొరుకుతోంది.

ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాల మూలంగా జరుగుతున్న ఆర్థికాభివృద్ధి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచట్లేదు. పెద్ద నోట్ల రద్దు ఉద్యోగావకాశాలను ఘోరంగా దెబ్బతీసింది. గ్రామీణ ప్రాంతాల్లో అసలే ఉపాధి అవకాశాలు తక్కువ. పెద్ద నోట్ల రద్దు వలన వాటికీ కోత పడింది. తయారీ రంగ వృద్ధి వెనకపట్టు పట్టింది. దీంతో కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. వారి చేరికతో నిరుద్యోగ సైన్యం ఇంకా పెరుగుతోంది. స్వయం ఉపాధి రుణాల కోసం సర్కారు అట్టహాసంగా అమలు చేస్తున్న ముద్రా పథకంలో 90 శాతం మంది లబ్ధిదారులకు రూ.50 వేల లోపు లోను రావడం కనాకష్టంగా ఉంది. ఈ స్వల్ప పెట్టుబడితో స్వయం ఉపాధి ఎంతమాత్రం సాధ్యం కాదు. ఉద్యోగాల కల్పన కోసమంటూ పెట్టుబడుల కోసం మోడీ తిరిగినన్ని దేశాలను ఏ ప్రధానీ తిరగలేదు. అయినా పెట్టుబడులొచ్చింది లేదు. ఈ కఠోర సత్యం ఇటీవల సర్కారు విడుదల చేసిన ఆర్థిక సర్వేలో నిక్షిప్తమైంది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటివి ప్రచారానికే పనికొచ్చాయి. ప్రభుత్వ వైఫల్యాల మూలంగా ఉపాధి కోసం కోట్లాది మంది నిరుద్యోగులు నిరీక్షిస్తుండగా పకోడీలు, కూరగాయలు అమ్ముకోవాలని ప్రధానే సలహా ఇవ్వడం దుర్మార్గం. యువతను వంచించిన బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు తొందర్లోనే ఉంది.

ఇదీ విషయం



కుర్చీలాటకు లెక్కలు
గుణిస్తోంది కమలం...
హస్తిన పాటకు 'దేశం'
చేస్తున్నది నాట్యం!

దాగుడు మూతలు చాలిక
ఎన్నాళ్లీ బూటకం...
కడుపులు కాలేదాకా
చూస్తారా నాటకం!

- కొల్లూరు వెంకట్

# కార్మిక భద్రత మరచిన మోడీ



పి అజయ్ కుమార్



మోడీ ప్రభుత్వ పూర్తి స్థాయి ఆఖరి బడ్జెట్ ఇది. ఒకటి రెండు పథకాలకు మసిపూసి మారేడు కాయ చేసి చూపటం తప్ప పాలక వర్గాల విధానంలో ఎటువంటి మార్పు లేదు. సంస్కరణలను బడ్జెట్ మరింత తీవ్రం చేసింది.

మోడీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను ఇంతకు ముందు ఎప్పుడూ లేనంత పెద్ద ఎత్తున అమ్ముకున్నది. 2017-18లో రూ.72,500 కోట్ల వాటాల అమ్మకాన్ని ప్రతిపాదిస్తే దానికి మించి లక్ష కోట్ల రూపాయల మేర అమ్మామని బడ్జెట్ ప్రసంగంలోనే చెప్పారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ వాటాల అమ్మకాన్ని రూ.80 వేల కోట్లుగా ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు హెచ్‌పిసిఎల్‌లో 51 శాతం వాటాలను ఓఎన్‌జిసి చేత కొనిపించారు. రెండూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలే. దీని వలన ఓఎన్‌జిసి దగ్గర ఉన్న నిధులు కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరాయి. దీంతో మన రాష్ట్రంలో ఓఎన్‌జిసి ప్రతిపాదించిన రిఫైనరీ, పెట్రో కారిడార్లకు ఓఎన్‌జిసి వద్ద పెట్టుబడులు లేకుండా పోతాయి.

ఎయిర్ ఇండియాతో సహా 24 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ (అమ్మకం) ప్రక్రియను ప్రారంభించామని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోని సాధారణ బీమా కంపెనీలైన నేషనల్ ఇన్సూరెన్సు, ఓరియంటల్ ఇన్సూరెన్సు, యునైటెడ్ ఇన్సూరెన్సు కంపెనీలను విలీనం చేసి వాటి వాటాలను అమ్మకానికి పెడతామని బడ్జెట్‌లో ప్రకటించారు.

భారతీయ రైల్వేస్టేషన్ అభివృద్ధి కంపెనీ ద్వారా 600 పెద్ద రైల్వే స్టేషన్లను తిరిగి అభివృద్ధి చేస్తారు. ఇది రైల్వే స్టేషన్ల ప్రయివేటీకరణకు ప్రతిరూపమే. రైల్వే స్టేషన్ల యాజమాన్యం లో ప్రవేశించే ప్రయివేటు కంపెనీలకు రైల్వే స్టేషన్ల చుట్టూ ఉన్న వాణిజ్య స్థలాలను అప్పగిస్తారు. రైల్వేలకు 2017-18లో బడ్జెట్ మద్దతును రూ.55 వేల కోట్లుగా ప్రకటించి మరలా దానిని రూ.40 వేల కోట్లకు తగ్గించారు. ఈ బడ్జెట్‌లో బడ్జెట్ మద్దతును రూ.53,060 కోట్లుగా ప్రకటించారు. అందులో వాస్తవంగా ఎంత ఖర్చు పెడతారో చూడాలి. 2018-19 బడ్జెట్‌లో మొత్తం పెట్టుబడి వ్యయం రూ.1.46 లక్షల కోట్లుగా చూపారు. దానిలో ప్రభుత్వం ఇచ్చేది రూ.53,060 కోట్లు మాత్రమే. మిగతా దానిలో రైల్వేలు తమ అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకోవాలి. ఇంకా రైల్వే యాజమాన్యంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు తమ లాభాల నుండి, అప్పులు చేయటం ద్వారా, తమ వాటాలు అమ్మటం ద్వారా పెట్టుబడు లు పెట్టాలి (అంతర్గత, అదనపు బడ్జెట్ వనరులు -ఇబిఆర్). కృత్రిమ మేధస్సులో పరిశోధన, అభివృద్ధిని ప్రభుత్వం ప్రవేశపెడు తుంది. రోబోట్లు, డ్రైవర్లు లేని కార్లు, ఐటి రంగంలో ఆటోమేషన్ యంత్రాలను నడిపే యంత్రాలు కృత్రిమ మేధస్సులో భాగం. ఉన్న ఉపాధిని కూడా ఊడగొట్టి యాజమాన్యాలకు లాభాలను చేకూర్చే పనుల్లో ఇదొక భాగం. నీతి ఆయోగ్ దీనికి చొరవ చేస్తుంది.

ఈ బడ్జెట్లో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్ల జీతాలను పెంచారు. 2018 ఏప్రియల్ 1 నుండి మొదలుకుని ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి వినిమయ ధరల సూచికను బట్టి పార్లమెంట్ సభ్యుల వేతనాలు, అలవెన్సులు ఆటోమేటిక్‌గా పెరుగుతాయి. కానీ కార్మిక సంఘాలు కోరుతున్న 12 కనీస కోర్కెలు బడ్జెట్ ప్రసంగంలో చోటు చేసుకోలేదు. కనీస వేతనాల పెంపు, కనీస పెన్షన్ పెంపుపై ఆర్థిక మంత్రి నోరు మెదపలేదు. 'వ్యవసాయం నుండి పారిశ్రామిక రంగానికి జనాభా పెద్ద ఎత్తున మళ్ళుతున్నారు. పారిశ్రామిక రంగంలో వేతనాలు తక్కువ. కార్మికుల ఆదాయం పెరగదు. సంపన్న పారిశ్రామిక వర్గాల ఆదాయం శరవేగంగా పెరుగుతోంది. ఆదాయ అంతరాలు పెరుగు తున్నాయి' (ఈనాడు 02.02.2018). ఈ అంశం బడ్జెట్ ప్రసంగంలో చోటు చేసుకోలేదు. 2013-14 లో ఉన్న ద్రవ్యలోటు 4.4 శాతాన్ని 2018-19 నాటికి ప్రభుత్వం 3.3 శాతానికి తగ్గించింది. ప్రభుత్వ పథకాలపై ఖర్చును పెంచకుండా ద్రవ్య లోటును నియంత్రిస్తున్నది. ప్రపంచ బ్యాంక్ ప్రాపకం కోసం పాకులాడు తున్నది.

రూ.100 కోట్ల టర్నోవరు కలిగిన... రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేసే... కార్పొరేట్ కంపెనీలకు వచ్చే లాభాల మీద పన్నులను 2018-19 నుండి 5 సంవత్సరాల పాటు మినహాయించారు. పైగా వీటిని సహకార సంఘాలతో పోల్చారు. దశల వారీగా కార్పొరేట్ ఆదాయ పన్నును 30 నుండి 25 శాతానికి ప్రభుత్వం తగ్గిస్తుంది. దీంతో ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతుంది. ఆ లోటును భర్తీ చేసుకునేందుకు జిఎస్టీ ద్వారా ప్రజలపైన, చిన్న వ్యాపారస్తులపైన భారాలు వేయడమే ప్రభుత్వ విధానం. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితి పెంచలేదు. ప్రామాణిక తగ్గింపు (స్టాండర్ట్ డిడక్షన్)ను తిరిగి ప్రవేశపెట్టారు. కానీ దానికి బదులుగా ప్రయాణ భత్యం రూ.19,200, వైద్య ఖర్చులు రూ.15 వేల వరకు ఇచ్చే మినహాయింపులను తొలగించారు. అదనంగా విద్య, ఆరోగ్య సెస్సును 3 నుండి 4 శాతానికి పెంచారు. దీని వలన ఉద్యోగులకు లాభం కలగకపోగా అదనపు పన్ను భారం పడుతుంది.

తమ పరిపాలనా కాలంలో వందలాది విధానాలు, నిబంధనలలో సంస్కరణలు తీసుకొచ్చామని, దీని వలన వ్యాపారాన్ని సరళీకరించటంలో ప్రపంచ బ్యాంకు ఇచ్చే ర్యాంకుల్లో 42 స్థానాలు పైకి ఎగబాకామని ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో చెప్పింది. ఇటువంటి సంస్కరణలే ఆర్థిక అసమానతలు పెరగటానికి కారణం.

కేంద్ర ప్రభుత్వ పథకాలకు, కార్మికుల సామాజిక భద్రతకు అరకొర కేటాయింపులే చేశారు. ఈ కేటాయింపులతో పేదరికం తగ్గటం కానీ, కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత లభించటం కానీ జరగదు. పైగా కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయివేటీకరణకు దారి తీస్తుంది.

**కేంద్ర ప్రభుత్వ పథకాలకు, కార్మికుల సామాజిక భద్రతకు అరకొర కేటాయింపులే చేశారు. ఈ కేటాయింపులతో పేదరికం తగ్గటం కానీ, కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత లభించటం కానీ జరగదు.**

( రచయిత సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు )

బడ్జెట్ విశ్లేషణ

# అంకెల్లో ఆరెస్సెస్



డాక్టర్ కత్తి పద్మారావు



మోడీ తరపున అరుణ్ జైట్లీ ఇంతకు ముందు సమర్పించిన బడ్జెట్‌కు, దీనికి పెద్ద తేడా లేదు. స్త్రీ అభ్యున్నతికి ఒక్క వాక్యం కూడా లేదు. మూడింట రెండు వంతుల జనాభా ఉన్న మహిళలు, పిల్లల సంక్షేమానికి కేటాయించినది కేవలం రూ.1,84,632 కోట్లు. పదహారు శాతం జనాభాగా ఉన్న షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి ఇస్తున్నది రూ.52,393 కోట్లు. రక్షణకు మాత్రం రూ.2,82,114 కోట్లు కేటాయించారు. దీన్ని బట్టే ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటో అర్థమవుతుంది. తాజా బడ్జెట్ చేనేత పరిశ్రమపై శీతకన్ను వేసింది. చేనేత రంగానికి గత సంవత్సరం రూ.604 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో కేవలం రూ.386.09 కోట్లు కేటాయించారు. గతంలో చేనేత రంగానికి ఇంత తక్కువ ఎన్నడూ కేటాయించలేదు. ఇక పంటల నష్టపరిహారం, సాగునీటి వ్యవస్థలకు జరిగే కేటాయింపులు మామూలే. అలాగే ప్రధాని ఫసల్ బీమా యోజన అంత ప్రోత్సాహకరంగా లేదు. మరో పక్క 'ఆయుష్మాన్ భవ' అంటూనే ప్రాథమిక వైద్యశాలలను విస్తృతం చేయడానికి బడ్జెట్ ప్రకటించ లేదు. మరో పక్క కోట్లాది మంది వేతన జీవులు ఎదురు చూసే ఆదాయం పన్ను మినహాయింపు విషయమై చాలా నిర్దయగా వ్యవహరించారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలకూ ఈ బడ్జెట్‌లో దక్కింది శూన్యం.

మొదటి నుంచి భారతదేశంలో పరిశోధనలకు బడ్జెట్‌లో కేటాయింపులు నామమాత్రమే. శాస్త్ర సాంకేతిక రంగాలను మోడీ ప్రభుత్వం కావాలని అణగదొక్కుతోంది. న్యూఢిల్లీ పరిశోధనా కేంద్ర ఫెలోషిప్‌లో మనుస్మృతి, భగవద్గీత, భారత, రామాయణ పరిశోధనలు ప్రోత్సహించే వారికే స్కాలర్‌షిప్‌లు ఇస్తామని ప్రకటిస్తుంది. మానవ వనరుల అభివృద్ధికి సంబంధించిన చరిత్ర, అర్థశాస్త్రం, సామాజిక శాస్త్రం, భౌగోళిక శాస్త్రం, మానవ పరిణామ శాస్త్రం, ద్రవిడ భాషా పరిశోధనల్ని ఐసియస్‌ఆర్‌సి నిరాకరిస్తుంది. వేదాల్లోనే అన్ని వున్నాయని కనిపెట్టే వారికి ఎంత పారితోషకమైనా ఇవ్వడానికి ఐసియస్‌ఆర్‌సి కమిటీ సిద్ధంగా వుంది. వీరు పూనుకుంటున్నారు. అందుకే ఆయుష్ మంత్రిత్వ శాఖకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1626.37 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కన్నా 13 శాతం ఎక్కువ. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ ప్రాజెక్టులు, పథకాలకయ్యే మొత్తం వ్యయాన్ని రూ.71.36 కోట్లుగా అంచనా వేశారు. కుటుంబానికి రూ 5 లక్షలు వైద్యం కోసం ఆర్థిక సహాయం చేస్తామని అదీ ఐదేళ్లకు ఇప్పుడు ప్రకటించడం మోసపూరితం.

విద్య వైద్య వ్యవస్థను అంతర్గతంగా కుళ్ళబొడుస్తూ పైకి ఆయుష్మాన్ భవ అని పైకి చెప్తూ ఈ ఏడాది కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు బడ్జెట్‌లో రూ.24,700 కేటాయించగా.. దీంట్లో రూ.16,334 కోట్లను అంగన్‌వాడీ సేవలకు వినియోగిస్తారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు రూ.6 వేలు అందించే ప్రధాన్‌మంత్రి మాతృ వందన యోజనకు గతేడాది రూ.2,594 కోట్లు కేటాయించగా, ఈసారి ఆ మొత్తం రూ.2,400 కోట్లకు పరిమితమైంది. బేటీ బచావో-బేటీ పఢావో పథకానికి ఈసారి రూ.280 కోట్లు కేటాయించారు. గతేడాది ఈ మొత్తం రూ.200 కోట్లు. మహిళల రక్షణకు 2013లో రూ.3,500 కోట్లతో ఏర్పాటు చేసిన నిర్భయ ఫండ్‌కు ఈసారి రూ.500 కోట్లు ఇచ్చారు. చిన్నారుల్ని రక్షించే సేవలకు ఈసారి రూ.725 కోట్లు ఇవ్వనున్నారు. ఇది అంకెల గారడీ బడ్జెట్. మోడీ-ఆర్‌ఎస్‌ఎస్ భావజాల బడ్జెట్. ప్రభుత్వ ధనంతో హిందూ మత ప్రచారానికి, హిందూ మత పునరుద్ధరణకు ఉద్దేశించిన బడ్జెట్ ఇది.

( రచయిత నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెల్ : 9849741695 )

# కౌలు రైతుకు రక్షణ కరువు



పి జమలయ్య



దేశంలోని సాగు భూమిలో 50 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ఆహార పంటలతోపాటు, వాణిజ్య పంటలు పండిస్తూ జాతికి తిండి పెడుతూ పరిశ్రమ అవసరాలు తీరుస్తూ కష్టాలు, కడగండ్ల పాలౌతున్నది కౌలు రైతులే. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ ప్రవేశపెడుతూ కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చే విషయంలో ఆలోచన చేస్తున్నామని మొసలి కన్నీరు కార్చారు. సంస్థాగత రుణాలు అందక, పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతాంగాన్ని ఆదుకొనే నిర్దిష్ట ప్రతిపాదనలు ఈ బడ్జెట్‌లో ఏమీ లేవు. రైతు ఆత్మహత్యల్లో 90 శాతం కౌలు రైతులవే. రైతాంగం సంక్షోభం నుండి బయట పడాలంటే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, అప్పుల భారం నుండి రుణ విముక్తి జరగాలి. ఇది వదిలి పెట్టి అంకెల గారడీలు ఎన్ని చేసినా ఫలితం శూన్యం.

కర్షకులకు ఈ ఏడాది రూ.11 లక్షల కోట్లు పంట రుణాలు ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. పంట రుణాలు ఇచ్చేది బ్యాంకులు, వాటికి వడ్డీ రాయితీ (4 శాతం) చెల్లించేది కేంద్ర ప్రభుత్వం. గత సంవత్సరం రూ.10 లక్షల కోట్ల పంట రుణాలకు రూ.15 వేల కోట్లు వడ్డీ రాయితీ కింద కేటాయించారు. ఈ ఏడాది కూడా అంతకంటే ఎక్కువ కేటాయించలేదు. పైగా అదనంగా మరో రూ.లక్ష కోట్లు పంట రుణాలు ఇస్తామని చెప్పి, వడ్డీ రాయితీకి నిధులు పెంచకపోవడం విడ్డూరం.

కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని బాకాలు ఊదుతోంది. సాగుదారుల ఆదాయం రెట్టింపు పెరగాలంటే కేంద్ర బడ్జెట్‌లో రూ.6.4 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయించింది కేవలం రూ.63,836 కోట్లు. గత సంవత్సరం రూ.56,589 కోట్లు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అదనంగా కేటాయించింది రూ.7 వేల కోట్లే. ఈ బడ్జెట్‌లో రైతులకు ఆదుకోవడానికి ధరల స్థిరీకరణ నిధి కింద కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే కేటాయించారు. గత సంవత్సరం రూ.3,500 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు.

మద్దతు ధరల కోసం కమిషన్ వేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో కూడా రైతాంగ సమస్యల పరిష్కారానికి అనేక జాతీయ కమిషన్లు వేశారు. కానీ ఏ ఒక్క కమిషన్ సిఫారసులను అమలు చేయలేదు. ఈ సంవత్సరం పంటల బీమాను రూ.13 వేల కోట్లకే పరిమితం చేశారు. గత సంవత్సరం రూ.14,750 కోట్లు కేటాయించారు. ఈ డబ్బుతో 30 శాతం పంటలను కవరేజి చేసామని చెప్తున్నారు. 50 శాతం కవరేజి కావాలంటే నిధులు పెంచాల్సింది పోయి తగ్గించడం వింత. మరొక విషయం ఏంటంటే ప్రభుత్వం ఇచ్చే బ్యాంకు రుణాలు కౌలు రైతులకు అందవు. దీని వలన కౌలు రైతులు ప్రయివేటుగా ఈ బీమా పథకంలో చేరవచ్చు. నష్టం జరిగినప్పుడు ఇచ్చే పరిహారాలు భూ యజమానులకే చెందుతున్నాయి. దీని వలన ఏ ఆదరణ లేక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంస్థాగత రుణాలు, మద్దతు ధరలు, నష్టపరిహారాలు, బీమా పరిహారాలు, కల్తీలు, తెగుళ్ళు నిరోధించకుండా రైతులను ఆత్మహత్యల నుండి ఎలా రక్షిస్తారు?

ఈ నాలుగేళ్ళ బిజెపి పరిపాలనలో 52 వేల మంది రైతులు ప్రభుత్వ విధానాల వలన బలవన్మరణాలు చెందారు. ఇందులో 90 శాతం మంది కౌలు రైతులే. రైతాంగాన్ని రుణ ఊబి నుండి బయట పడవేయక పోవడమే దీనికి కారణం. మన రాష్ట్రంలో అనేక మంది చిన్న, సన్నకారు కౌలు రైతులు 1,500 మంది దాకా చనిపోయారు. రూ.11 లక్షల కోట్లు పారిశ్రామికవేత్తల బకాయిలను రద్దు చేసిన ఎన్‌డిఏ ప్రభుత్వం పేద రైతుల అప్పుల రద్దు గురించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం బాధాకరం. ఈ ప్రభుత్వాలు రైతాంగాన్ని రక్షించేవి కావు. ముమ్మాటికీ భక్షించేవే!

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాకుండా మాయ మాటలు కట్టి పెట్టి చిత్తశుద్ధితో రైతాంగాన్ని ఆదుకోవడానికి బడ్జెట్లు రూపొందించాలి. కౌలు రైతుల రక్షణ కోసం, వారి సంక్షేమానికి నిధులు కేటాయించి ఖర్చు చేయాలి. అప్పుడే జాతికి ఆహార భద్రత, కౌలు రైతుకు జీవిత భద్రత.

( రచయిత ఏపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి )

# చంద్రబాబూ! నాటకాలు ఆపుతావా?

ఎ కోటిరెడ్డి

ఎన్నికలు దగ్గర పడుతుండటం, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని గురించి పట్టించుకోకపోవటంతో ప్రజలలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమౌతున్నది. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టటం కోసం తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారని ఆందోళన వ్యక్తం చేసినట్లు నటించారు. ఆదివారం నాడు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్ చేయటంతో పరిస్థితి మారిపోయింది. చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు కొన్ని ప్రశ్నలను ముందుకు తెస్తున్నది. రాష్ట్ర ప్రయోజనాలు తెలుగుదేశం, బిజెపి వ్యక్తిగత వ్యవహారమా? రాజ్‌నాథ్ సింగ్ నుండి ఫోన్ రావటానికి ముందు రాష్ట్రానికి జరిగిన అన్యాయం ఫోన్ వచ్చిన తర్వాత అదృశ్యమై పోయిందా? కేంద్రమంత్రుల నుండి ఫోన్ వస్తే రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని పక్కన పెట్టే ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందా? ఆదివారం నాడు బిజెపి ఎంఎల్‌సి సోము వీర్రాజు మాట్లాడుతూ రెండెకరాలున్న చంద్రబాబుకు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడివని ప్రశ్నించారు. ఈ ఆరోపణకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. చంద్రబాబు అంతటి అవినీతిపరుడైతే ఆయనను ఎన్‌డిఎలో ఎందుకు ఉంచారో బిజెపి కూడా ప్రజలకు సమాధానం చెప్పాలి.

**చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు, తెలుగుదేశం నాయకులు, ఇంతకాలం కేంద్రం బాగానే వ్యవహరిస్తున్నదని భజన చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నదని, కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడాలని రాష్ట్రం లోని ప్రతిపక్షాలు, వామపక్షాలు పోరాటాలు చేస్తుంటే వారిని అభివృద్ధి నిరోధకులని ముద్ర వేశారు.**



### రాష్ట్రానికి ఎప్పుడూ అన్యాయం చేస్తున్న బిజెపి

కేంద్రం ఇంతకు ముందు బడ్జెట్లలోనూ రాష్ట్రానికి అదనంగా ఇచ్చింది లేదు. అపుడు బడ్జెట్లు బాగా ఉన్నాయని భజన చేసిన చంద్రబాబు, మంత్రులు ఈ బడ్జెట్‌పై ఎందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు? రాష్ట్ర విభజన ద్వారా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ఇవ్వాలని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తే, ప్రతిపక్షంలో ఉన్న బిజెపి పది సంవత్సరాలు ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేసింది. బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా అంశాన్ని పక్కన పెట్టటంతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. ఆ అంశాన్ని మసిబూసి మారేడుకాయ చేయటానికి, నిర్దిష్టంగా ఏమీ చెప్పకుండా హోదాకు మించి ప్యాకేజి ఇస్తామని కేంద్రం ప్రకటిస్తే, హుటాహుటిన అర్ధరాత్రి పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, కేంద్రానికి ఎందుకు అభినందనలు తెలియజేశారు? వెంకయ్య నాయుడుకు ఎందుకు సన్మానాలు చేశారు? ప్రత్యేక హోదా ఇవ్వబోమని కేంద్రం చెబితే కేంద్రాన్ని అభినందించి, కేంద్ర మంత్రులకు సన్మానాలు చేసిన మీరు ఇపుడు కేంద్రం రాష్ట్రానికి కేటాయింపులు చేయలేదని, ఆందోళనలు చేస్తామని చెప్పటం కన్నా పెద్ద నాటకం ఏముంది?

విభజన వలన నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడే రెవిన్యూ లోటును ఐదు సంవత్సరాల పాటు కేంద్రం భర్తీ చేస్తుందని చెప్పారు. లోటును భర్తీ చేయటం కాక, నామమాత్రపు నిధులనే ఇస్తుండటంతో రాష్ట్రానికి పదహారు వేల కోట్ల రూపాయలకు పైగా బకాయి ఉన్నది.. రాష్ట్ర రాజధాని నిర్మాణం, పోలవరం తనకు రెండు కళ్ళని చంద్రబాబు తరచుగా చెబుతుంటారు. కేంద్రం రెండు కళ్ళలోనూ పొడిచింది. రాజధాని నిర్మాణానికి రూ.ఐదు లక్షల కోట్లు కావాలని పార్లమెంటులో డిమాండ్ చేసిన చంద్రబాబు కేంద్రం చేస్తున్న విదిలింపులపై నోరు మెదపటం లేదు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం రాష్ట్రం ఖర్చు చేసిన మొత్తాన్ని చెల్లించటం లేదు. ప్రాజెక్టు ఖర్చు 16 వేల కోట్ల రూపాయల నుండి 56 వేల కోట్ల రూపాయలకు పెరిగిందని రాష్ట్ర ప్రభుత్వం అంచనాలను కేంద్రానికి పంపింది. పెరిగిన అంచనాలను కేంద్రం ఆమోదించలేదు. కేంద్రం పోలవరానికి నిధులు ఇవ్వకుండా నాబార్డు నుండి, ఇతర సంస్థల నుండి రుణాలిప్పించి, భారాన్ని మొత్తం రాష్ట్రంపై నెడుతున్నా చంద్రబాబు వ్యతిరేకించటం లేదు.

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోయినా నోరు మెదపలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని తుంగలో తొక్కి, రాష్ట్రం లోని వెనుకబడిన ఏడు జిల్లాల అభివృద్ధి కోసమంటూ రెండు దఫాలుగా జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున రూ. 100 కోట్లు మాత్రమే ఇచ్చి బిచ్చం వేసినట్లుగా కేంద్రం వ్యవహరించినా చలనం లేదు. విశాఖకు రైల్వే జోన్ తెస్తామని చెప్పి కేంద్రం పచ్చి మోసం చేసింది. అయినా వీటన్నింటినీ కేంద్రం చేస్తున్న మోసంగా, రాష్ట్రానికి జరిగిన అన్యాయంగా చంద్రబాబు చెప్పటం లేదు.

చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు, తెలుగుదేశం నాయకులు, ఇంతకాలం కేంద్రం బాగానే వ్యవహరిస్తున్నదని భజన చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నదని, కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడాలని రాష్ట్రం లోని ప్రతిపక్షాలు, వామపక్షాలు పోరాటాలు చేస్తుంటే వారిని అభివృద్ధి నిరోధకులని ముద్ర వేశారు. ఇపుడు రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రకటనలు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల వ్యాపార ప్రయోజనాలు, స్వలాభాల కోసం పాకులాడే ధోరణి వలన రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోకుండా బిజెపికి దాసోహం అంటున్నారు. అవినీతి కేసులలో ఇరుక్కుని బిజెపికి లొంగిపోయిన తెలుగుదేశం నాయకులు రాష్ట్రాభివృద్ధికి చేయగలిగింది శూన్యం. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయటం, నిధులు సాధించటం వీరి వల్ల కాదు. టిడిపి చేస్తున్న ఈ విద్రోహానికి రాష్ట్ర ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం వామపక్షాలు చూపిస్తున్న పోరుబాటలో నడవటం ద్వారా మాత్రమే కేంద్ర ప్రభుత్వాన్ని లొంగదీయటం, రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవటం సాధ్యమౌ తుంది. రాష్ట్ర ప్రజలు ఆ మార్గంలో ముందుకు సాగటానికి, ఈ నెల 8వ తేదీన వామపక్షాలు ఇచ్చిన బంద్‌ను జయప్రదం చేయటానికి సన్నద్ధం కావాలి.

కేంద్ర బడ్జెట్‌పై చర్చ ముగిసింది.
- ఎడిటర్



అద్భుతాలు చేసేవారెవరూ.. ఆకాశం నుంచి ఊడిపడరు. వారూ మనలాంటివారే. మనలాగానే సమాజం, కుటుంబంపట్ల బాధ్యతగా ఉంటారు. కానీ వాళ్ళల్లో ఒక అంతరంగ జ్వాల ఉంటుంది. అలాంటి వాళ్లు మంచుపర్వతాలెక్కి జెండాలు పాతొచ్చు.. సప్తసముద్రాలను సైతం అవలీలగా దాటేయొచ్చు. కొందరు అంతే.. అతిసామాన్యంగా కనిపిస్తూనే.. అద్భుతాలు సాధిస్తుంటారు. అలాంటివాడే నలభై ఆరేళ్ల మధు నాగరాజ. కెనడాలో స్థిరపడిన మన తెలుగాయనకి సముద్రాల్లో ఈత కొట్టడమంటే మహాసరదా. అలలతాకిడి ఎక్కువగా ఉండే ప్రపంచ ప్రసిద్ధిచెందిన జలసంధిల్లోనూ ఎదురీదుతూ రికార్డులను తిరగరాస్తుంటారు. అసలు ఎవరీయన? ఆయన చేసే సాహసాలేంటి? తెలుసుకుందాం!

# అతడు సముద్రాన్ని జయించాడు !

మధు నాగరాజ పుట్టింది చిత్తూరు జిల్లా పుంగనూరు. పెరిగింది, చదువుకున్నదీ కర్ణాటకలోని మైసూరు. ఉద్యోగం చేస్తూ నివసిస్తున్నది కెనడాలోని టొరంటో ప్రాంతం. చిన్నప్పటి నుంచే ఈత కొట్టడంపై ఉన్న సరదా కాలక్రమేణా ఆయన్నొక సాహసిగా తీర్చిదిద్దింది. మైసూరులో ఉన్నప్పుడే మూడుసార్లు విశ్వవిద్యాలయ పరిధిలో ఈతలో ఛాంపియన్‌గా గుర్తింపు పొందారు. గతేడాది నవంబర్ 29న మధు నాగరాజు 'మెగల్లాన్ జలసంధి'ని ఈదడంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అందుకే కెనడా ప్రధానమంత్రి జస్టిన్ త్రుద్యేవ్ స్వయంగా మధుని అభినందించి ప్రశంసించారు. ఇప్పటి వరకూ ఈ జలసంధిని ఈదిన వారిలో మధు ప్రపంచస్థాయిలో 23వ వ్యక్తి. కెనడాలో మొదటి వ్యక్తీ, మొదటి భారతీయుడు ఈయనే కావడం విశేషం.

## కఠినమైన లక్ష్యం

మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించాలంటే ఎంత సాహసం చేయాలో ఇంగ్లీష్ ఛానల్‌ని ఈదాలంటే కూడా అలాంటి సాహసం చేయాల్సిందే. దానిని ఈదినవారు వేలసంఖ్యలో ఉన్నారు. ప్రపంచంలోనే మహాసరస్సు అని పేరొందిన ఒంటారియోను ఈదిన వారు యాభైమందికి పైనే ఉన్నారు. కానీ మెగల్లాన్ జలసంధిని ఈదినవారు మాత్రం మధుతో కలిపి 23 మందే. ఈ సంఖ్యే చెబుతోంది, ఆ లక్ష్యం ఎంత కఠినమైనదో. మెగల్లాన్ జలసంధి ప్రాంతంలో వాతావరణం తీవ్ర ప్రతికూలమైనది. ఎముకలు కొరికేసి, రక్తాన్నీ గడ్డకట్టించగల చల్లదనం, పెనుగాలులు, ఎగసిపడే అలలు.. ఇలా అవాంతరాలెన్నో ఉన్నాయి దానికి. అట్లాంటిక్ – ఫసిఫిక్ మహాసముద్రాలకు దారితీస్తూ ఈ జలసంధి ఉంటుంది. దక్షిణ అమెరికాకు దక్షిణ కొసలో చిలీ సమీపంలో ఇది ఉంది. అక్కడి గాలులు, అలలు ఆపదలకు సంకేతాలుగా నిలుస్తుంటాయి. వాతావరణపరంగా అనూహ్యమైన ప్రాణాపాయ పరిస్థితులు పొంచి ఉంటాయని అంతా చెబుతుంటారు.

## రెండో ప్రయత్నంలో విజయం

మెగల్లాన్ జలసంధిని ఈదడంలో మధు చేసిన తొలిప్రయత్నం విఫలమైంది. అయినప్పటికీ రెండోసారి విజయం అతనిని వరించింది. 2015లో మొదటిసారి ఈ జలసంధిని ఈదడానికి ఆయన ప్రయత్నించిన సమయంలో వాతావరణం



మరింత ప్రతికూలంగా మారింది. అప్పుడు అత్యంత ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆయన్ని సహాయకులు బైటకి తీసుకొచ్చారు. ఆ ప్రయత్నాన్ని ఆయన "ఓ విజయవంతమైన వైఫల్యం"గా అభివర్ణించారు. అయినా ఏమాత్రం వెనుకంజ వేయకుండా మళ్ళీ గత నవంబర్ 24–30 తేదీల్లో కేవలం అండర్‌వేర్‌ని మాత్రమే ధరించి ఈ జలసంధిని ఈది, తన సాహసానికి ఎదురులేదని చాటిచెప్పారు. ఆయన ఈ సాహసకార్యాన్ని



ఆరంభించిన రోజు నీటి చల్లదనం 4 డిగ్రీలు, గాలివేగం గంటకు 50 కిలోమీటర్లు, రెండు మూడు మీటర్ల ఎత్తులో ఎగసిపడే కఠినమైన అలలున్నాయి. ఈ ప్రమాదకరమైన జలసంధి పొడవు నాలుగు కిలోమీటర్లు మించదు.. కానీ ఎదురయ్యే ప్రతికూలతలు అనేకం. ఇలాంటి జలసంధిని ఈదిన ఘనత సాధించిన మొట్టమొదటి కెనడియన్, భారతీయుడైన మధుని అభినందించడానికి ఒక తెల్లవారు జామున కెనడాలోని గొప్ప స్విమ్మర్లు, పర్యావరణమంత్రీ ఆయనింటికి వచ్చి, ఆశ్చర్యకరమైన రీతితో ప్రశంసలు అందించారు.

### ఇది నా గొప్పతనం కాదు



"స్విమ్మింగ్‌లో నేను సాధించిన విజయాలు నా గొప్పతనం కాదు. నాకు శిక్షణ ఇచ్చినవారు, నన్ను ప్రోత్సహిస్తున్నవారి ప్రేరణే అది. ఇలాంటివాటిల్లో ప్రకృతి సహకరించకపోతే ఎంతటివారైనా ఏమీ చేయలేరు. స్విమ్మిగ్‌లో నేను సాధించిన విజయాలన్నీ నాతోటివారందరికీ చెందుతాయి"

- మధు నాగరాజ

## ఈతపై మక్కువతో



మధు నాగరాజ ఈత ప్రస్థానం ఎలా మొదలైందో అతని తల్లి సుశీల వివరిస్తూ "చిన్నప్పటి నుంచి సరదాగా పిల్లలందరూ కలిసి మైసూరు విశ్వవిద్యాలయం స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్ళేవారు. తరువాత మేము సరస్వతిపురం, పూల్‌కు దగ్గరగా వచ్చాము. అన్నిరకాల ఈత పోటీలలో మధు విజయం సాధించి, మెడల్స్ తెచ్చేవాడు. అలా రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యాడు. మేము ఎప్పుడూ ఈ స్థాయిలో సాధన చేస్తాడని అనుకోలేదు. మైసూరు విశ్వవిద్యాలయంలో వరుసగా మూడేళ్లు ఈతలో ఛాంపియన్‌షిప్ సాధించాడు. అమెరికాకు చదువుకోవడానికి వెళ్లడం, అక్కడే ఉద్యోగంలో చేరిన తర్వాతా తనకిష్టమైన ఈతని కొనసాగించాడు. అక్కడివారు మధులోని ప్రతిభను గుర్తించారు. లాంగ్ డిస్టెన్స్ స్విమ్మింగ్‌కు ప్రోత్సాహం అందించారు. ఇంగ్లీష్ ఛానల్ ఈదడానికి ట్రైనింగ్ పొందాడు. ఇలా తన సాహసాలు ప్రారంభమయ్యాయి. ఒకటి తరువాత ఒకటి సాధనను చేస్తూ వెళ్తున్నాడు. ఈ సాధనలు చాలా కష్టతరమైనవి. దీక్ష అవసరం, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. అంతేకాదు ఆర్థికంగా చాలా ఖర్చుతో కూడుకొన్నది. అనేక సాధక బాధకాలుంటాయి. ఈ సాధనల వెనుక ప్రోత్సాహమిస్తున్నవారు ఎంతోమంది ఉన్నారు" అని ఆమె అన్నారు.

## సాహసాలే ఊపిరిగా

మధు నాగరాజ చదువుకునే రోజుల్నుంచే తన జీవితాన్ని సాహసాల వైపు మళ్ళించారు. స్వతహాగా స్విమ్మర్ అయిన ఆయన 2004లో ఇంగ్లీష్ ఛానెల్ ఈదారు. 2010లో ఏప్రిల్ 4 నుంచి 10 వరకు సహారా ఎడారిలో 250 కిలోమీటర్లు మారథాన్ పూర్తిచేశారు. ఒంటారియో గ్రేట్‌లేక్‌లో 30 జులై, 2012న 24 గంటల పాటు నిర్విరామంగా ఈత కొట్టారు. అంతేకాదు 2016 అక్టోబర్ నెలలో తన సహస్విమ్మర్లయిన మరో ఆరుగురితో కలిసి 24 గంటల్లో 1600 కిలోమీటర్లు ప్రయాణం చేసి, ఐదు అతిపెద్ద సరస్సుల్లో ఒక్కొక్కమైలు ఈత కొట్టారు. ఇలా ఎన్నో విజయాలు సొంతం చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు. అతని తల్లి సుశీల ఆంధ్రాలో పుట్టి పెరిగారు. ప్రస్తుతం మైసూరులో నివాసముంటున్నారు. తన సాహసాలతో ప్రపంచవ్యాప్తంగా స్విమ్మర్లకు స్ఫూర్తిగా నిలుస్తున్న మన తెలుగువాడు మధు నాగరాజని అభినందిద్దాం!

- బెండాళం క్రిష్ణారావు

# ఈ డాక్టర్ సేవకు సలామ్!

**రోడ్డుమీది చెత్తాచెదారం ఏరుకునే ఓ అబ్బాయి.. అంగట్లో పనిచేసే ఓ అమ్మాయి.. అలాంటివారి ముఖాల్లో కనిపించే నీరసం, నిస్సహాయత వెనుక కారణం ఏంటో.. ఎప్పుడైనా ఆలోచించించారా? వారి జీవితాలను అర్థంచేసుకునే ప్రయత్నం చేశారా? ఒకవేళ ఆలోచించి ఉంటే, అలాంటి ప్రయత్నమే చేసి ఉంటే వారేంటో వారి కలలేంటో మనకు అర్థమవుతుంది. అలాంటి పిల్లలకు సహాయం అందించడానికి 29 ఏళ్లుగా కృషి చేస్తోంది ఓ వైద్యురాలు. ఆమె ఇప్పటిదాకా ఎంతోమంది పిల్లల జీవితాల్లో వెలుగులను నింపింది. అనాథలుగా మిగిలిన ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించి, వారికంటూ ఓ మంచి భవిష్యత్తును అందిస్తోంది. ఇంతకీ ఎవరామె? అనాథ పిల్లల కోసం ఏం చేస్తుంది? తెలుసుకుందాం!**

ఢిల్లీలోని "సలామ్ బాలక్ ట్రస్టు". వెనుకబడిన వర్గాలకు చెందిన, ఎలాంటి ఆధారం లేని, ఆహారం కోసం వీధిన పడ్డ పిల్లలను ఈ ట్రస్టు గుర్తిస్తుంది. ఆ పని నుంచి విముక్తి కల్పించి, ఓ కొత్త జీవితాన్ని ప్రసాదించడమే ఈ ట్రస్టు ముఖ్య ఉద్దేశ్యం. ముఖ్యంగా వారిని ప్రేమగా చూసుకోవడం ఆ ట్రస్టు భాధ్యుల పని. ఈ ట్రస్టు ఫౌండర్ డాక్టర్ ప్రవీణ్ నాయర్. మూగ, చెవిటికి సంబంధించిన ఓ ఆర్గనైజేషన్‌లోనూ ముఖ్య



భూమిక పోషిస్తున్నారు. డాక్టర్ నాయర్ 1988 లో ముగ్గురు సిబ్బందితో 25 మంది పిల్లలకు ఢిల్లీ రైల్వేస్టేషన్ సమీపంలో జీఆర్‌పి ద్వారా లభించిన ఓ చిన్న స్థలంలో 'సలామ్ బాలక్ ట్రస్టు'ను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం సలామ్ బాలక్ ట్రస్టుకు ఆరు షెల్టర్‌లు ఉన్నాయి. పిల్లల కోసం పనిచేయాలన్న సంకల్పమే నన్ను ముందుకు నడిపింది అంటారామె.

## ఉజ్వల భవిష్యత్తు కోసం

అనాథ పిల్లలకు పౌష్టికరమైన ఆహారం, ఆడుకోవడానికి, ఉండడానికి మంచి సదుపాయాలు ఏర్పాటు చేశారు. చదువుకయ్యే ఖర్చును కూడా ఈ సంస్థే భరిస్తుంది. ఢిల్లీలోని ఎన్‌సిఆర్‌లో ఈ ట్రస్టుకు 25 సెంటర్లు ఉన్నాయి. అక్కడ ఏటా ఎనిమిది వేలమంది పిల్లలు చదువుకుంటున్నారు. మంచి వాతావరణంతో పాటు, ఆహారం, మంచి దుస్తులు, మెడికల్ చెకప్‌లు అన్నీ రకాల సదుపాయాలను అందుబాటులో ఉంచారు. వారి ఉజ్వల భవిష్యత్తు కోసం కౌన్సిలింగ్ ఇప్పిస్తుంటారు. పిల్లలు ప్రతిరోజూ స్కూల్‌కి వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు. ట్రస్టుద్వారా ఎప్పటికప్పుడూ హెల్త్‌క్యాంప్‌లను నిర్వహిస్తుంటారు. పిల్లల మనోవికాసాన్ని పెంపొందించేందుకు ఆటలపోటీలు, ఎడ్యుకేషనల్ టూర్, కల్చరల్ ఈవెంట్స్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. చదువుతో పాటు స్కిల్స్‌ను కూడా అభివృద్ధి చేయాలనేది నాయర్ ఆలోచన. అందుకే, వొకేషనల్ ట్రైనింగ్ కూడా ఇప్పిస్తుంటారు.

## వేల మందికి ఆశ్రమమయ్యింది

ఇక్కడి పిల్లలు ఎక్కువశాతం మల్టీమీడియా యానిమేషన్, ఫిల్మ్ ఎడిటింగ్, థియేటర్, మ్యూజిక్, డ్యాన్స్, ఫోటోగ్రఫి, గ్రాఫిక్ డిజైన్ వంటి స్కిల్స్‌పై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఇవేకాకుండా ట్రస్టుద్వారా చాలా స్కిల్స్‌ను నేర్పుతున్నారు. సలామ్ బాలక్ డే కేర్ సెంటర్ లాంటి కాంటాక్ట్ పాయింట్‌లను ఏర్పాటు చేశారు. ఈ కాంటాక్ట్ పాయింట్లు బస్‌స్టాఫ్, రైల్వేస్టేషన్, స్లమ్ ఏరియాలలో ఉంటాయి. ప్రస్తుతం ఇలాంటివి 21 ఉన్నాయి. సలామ్ బాలక్ ట్రస్టు 1098 చైల్డ్ కేయిర్ హెల్ప్‌లైన్స్ కూడా నడుపుతోంది. గడిచిన 29 ఏళ్లలో ఈ సంస్థ 81,791 మంది పిల్లలకు సహాయం చేసింది. ప్రస్తుతం 10,360 మంది పిల్లలు సలామ్ బాలక్ ట్రస్టు ద్వారా స్కూల్‌కు వెళుతున్నారు. 28 అక్టోబరు 2017 లో ప్రవీణ్ నాయర్ జమన్‌లాల్ బజాజ్ అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారాన్ని అందుకున్న 40 తొలి మహిళగా గుర్తింపు పొందారు నాయర్. అంతేకాదు, నాయర్ కుమార్తె మీరా నాయర్ ఫేమస్ ఫిల్మ్ మేకర్. ఆమె "సలామ్ బాలక్" పేరుతో ఓ సినిమాను కూడా నిర్మించారు. ఎదుటివారికి సాయపడాలనే ఆలోచనను తల్లిద్వారా గ్రహించిన మీరా తన వంతుగా తల్లిగా సాయపడుతోంది. ★



# కూరగాయలు, పండ్లు ఇలా వాడాలి

ఆరోగ్యానికి తాజా కూరగాయలు, పండ్లు ఎంతో ముఖ్యమైనవి. వీటిని ఎలా ఉపయోగిస్తే ఎక్కువ ప్రయోజనం అనే విషయంపై చాలా భిన్నాభిప్రాయాలున్నాయి. వీటి నుంచి రసం తీసుకుని, తాగే అలవాటు చాలా మందికి ఉంది. అయితే, పండ్లు, కూరగాయల్లో వేటిలో ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలున్నదీ తెలిసింది తక్కువ మందికే.

➢ద్రవ పదార్థాలు (రసాలు) శరీరానికి ఎంతో అవసరం. ఇవి శరీరంలో పేరుకున్న వ్యర్థాలను బయటకు పంపిస్తాయి. జీర్ణవ్యవస్థకు కాస్తంత విరామాన్నిస్తాయి. పేగులను శుభ్రం చేయడానికి ఇవి చాలా అవసరం.

➢పండ్ల రసాలైనా, కూరగాయల రసాలైనా శరీరానికి శక్తినిచ్చేవే. ఓ గ్లాసుడు ఆరెంజ్ జ్యూస్‌తో విటమిన్–సి కావాల్సినంత లభిస్తుంది. అలాగే, కీరదోస, పాలకూర జ్యూస్ రక్తంలోని వ్యర్థాలను పోగొట్టి, తాజాదనం అందిస్తాయి. యాపిల్, బీట్‌రూట్, క్యారట్ జ్యూస్ కలిపి తాగితే బరువు తగ్గుతారు.

➢జ్యూస్ కోసం సాధారణంగా సూచించే ఓ నిబంధన ఉంది. అదే 90/10. అంటే 90 శాతం కూరగాయలు అయితే, 10 శాతం పండ్లు ఉండాలి. పండ్లు అన్నవి సహజ తీపికి, రుచికోసం యాడ్ చేసుకోవాలి. పండ్లలో ఫ్రక్టోజ్ రూపంలో సహజ తీపి ఉంటుంది.

➢పండ్లను తాజాగా, డ్రై చేసినా.. ఏ రూపంలో తీసుకున్నా అందులో తీపిదనం ఉంటుంది. పండ్లను రసం చేసుకుని, తీసుకోవడం కన్నా పండు రూపంలో తీసుకుంటే మంచిది. ఇందులో తగినంత పీచు పదార్థం ఉంటుంది.

➢పండ్ల రసాలను తీసుకున్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు ఉన్నట్టుండి



పెరుగుతాయని, అందుకే మధుమేహులు వాటిని తక్కువగా తీసుకోవాలని వైద్యనిపుణుల సూచన.

➢తాజాపండ్లలో, కూరగాయల్లో తగినన్ని పోషకాలుంటాయి. అయితే, పోషక ప్రయోజనాలు కాస్తంత కూరగాయల్లోనే ఎక్కువగా ఉంటాయి.

➢పండ్ల రసాల్లో మంచి పోషకాలతోపాటు చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. కనుక ఒకేసారి పండ్లను ఎక్కువ మొత్తంలో తీసుకోకూడదు. కాకపోతే పండ్లరసం రూపంలో తీసుకోవచ్చు.

➢కూరగాయలను ఎంత పరిమాణంలో అయినా తీసుకోవచ్చు. వీటివల్ల నష్టం ఉండదు. కేలరీలు, చక్కెరలు తక్కువగా ఉండడమే అందుకు కారణం. కొన్ని తిన్న వెంటనే కడుపునిండిపోతుంది. కేలరీలు కూడా తక్కువగానే ఉంటాయి గనుక ఆందోళన అక్కర్లేదు. బరువు తగ్గాలనుకునే వారు తమ ఆహారంలో కూరగాయలను ఎక్కువగా చేర్చుకోవడం మంచిది.

➢కూరగాయలు, పండ్లు ఏవైనా సరే వాటిని నేరుగా తినడమే మంచిదంటున్నారు పోషకాహార నిపుణులు. జ్యూస్ చేసుకోవడంవల్ల చాలా వరకూ విటమిన్లు, మినరల్స్, ప్లాంట్ కెమికల్స్ ఉన్నప్పటికీ, ఫైబర్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. రసం తీసుకుని, పండును వదిలేయడం వల్ల అందులో ఉండే పూర్తి పోషకాలు జ్యూస్‌లోకి రావు.

➢పండ్లు, కూరగాయలను నేరుగా తినలేని పరిస్థితుల్లో మాత్రమే జ్యూస్ తీసుకోవడం మినహా మరో ఆప్షన్ లేదు. అయితే, ఇలాంటప్పుడు జ్యూస్ చేసుకున్న తర్వాత పండులో తినదగిన భాగాలను కూడా తింటే ఫైబర్ ఎంతో కొంత అందుతుంది. జ్యూస్ చేసుకున్న వెంటనే తాగేయాలి. లేదంటే నిమిషాల వ్యవధిలోనే బ్యాక్టీరియా ఫామ్ అయిపోతుంది. జ్యూస్‌లో అధిక చక్కెరలు ఉంటాయి.. గనుక బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ★

# ఇంటి చిట్కాలతో.. పాదాలు పదిలం

సీజన్లతో సంబంధం లేకుండా చాలామందిని కాలి పగుళ్ల సమస్య తీవ్రంగా వేధిస్తుంటుంది. ఈ సమస్య కారణంగా చూడడానికి పాదాలు ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. వీటి నివారణకు చాలామంది రకరకాల చిట్కాలు పాటిస్తుంటారు... మరికొందరు వైద్యుల సలహాతో వివిధ రకాల మందులు వాడినా ఆశించిన ఫలితం లేక విసుగు చెందుతుంటారు. అలాంటి వారికి నిపుణులు సూచిన మేరకు మన ఇంట్లో ఎలా తగ్గించుకోవాలో కొన్ని చిట్కాలు.



✧తగినంత తేమ లేకపోవడం, ఎక్కువగా తడిలో పాదాలు నానుతుండడం, మురికికి ఎక్కువగా ఎక్స్‌పోజ్ కావడం.. కాలి పగుళ్ల సమస్యకు ప్రధాన కారణాలు. పగుళ్ల సమస్యను నిర్లక్ష్యం చేస్తే పాదాలు ఎర్రబారి, వాచి తీవ్రమైన నొప్పికి, ఫంగల్ ఇన్ఫెక్షన్‌కూ దారితీస్తుంది.

✧కొవ్వొత్తి వెలుగునివ్వడమే కాదు పాదాలకు ఓ రూపునిస్తుంది. మైనాన్ని ఆవనూనెతో కలిపి రాత్రిపూట పగుళ్లపై రాసి చూడండి. తెల్లవారే సరికి మార్పును గమనిస్తారు.

✧ గ్లిజరిన్, రోజ్‌వాటర్‌తో కలిపి ప్రతిరోజూ రాత్రి నిద్రించడానికి ముందు.. అలా 15 రోజుల పాటు రాసి చూడండి.

✧ నువ్వులనూనె ఈ సమస్య నివారణకు పనిచేస్తుంది. నిద్రించే ముందు పాదాలకు మర్దన చేయాలి.

✧ అరటిపండు గుజ్జు పగుళ్లపై మంచి ఔషధంగా పనిచేస్తుంది. పగుళ్ల తొందరగా మానేలా చేస్తుంది.

✧ పసుపు, తులసి, కర్పూరం సమాన మొత్తాల్లో తీసుకుని వీటికి అలోవెరా జెల్ కలిపి పాదాలకు రాస్తే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ★

### మీ కోసం



**ఉపయోగించిన టీ పొడికి తగినంత నీరును కలిపి ఉడికించాలి. ఆ నీటిని తలకు పట్టించి, తర్వాత షాంపుతో స్నానం చేస్తే.. తలవెంట్రుకలు మెరుస్తూ ఉంటాయి**

### జీవన సౌరభం

**శరీరానికి వ్యాయామం ఎలాంటిదో మనసుకి చదువు అలాంటిది.**

సెన్సెక్స్ ⬇ 310
34,757

నిఫ్టీ ⬇ 94
10,666

రూపాయి ⬆ 00 పై.
అమెరికా డాలరుకు రూ.
64.06




**క్విడ్ 'సూపర్ హీరో'**

ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనో సోమవారం క్విడ్ కారును 'సూపర్ హీరో ఎడిషన్'లో మార్కెట్లోకి తీసుకు వచ్చింది. ఈ కారు ప్రాథమిక ధరను కంపెనీ రూ.4,34,000గా నిర్ణయించింది. ఈ సూపర్ హీరో ఎడిషన్ క్విడ్ 1.0 లీటర్ పవర్ ట్రైన్, 67 బిహెచ్‌పి, 91 ఎన్‌ఎం సామర్థ్యంతో మ్యానువల్, ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్లలో అందిస్తుంది.



**టివిఎస్ 'ఎన్‌టార్క్' స్కూటర్**

టివిఎస్ మోటార్ ఎన్‌టార్క్ పేరుతో కొత్త స్కూటర్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ.58,750గా నిర్ణయించింది. కొత్త సివిటివి-ఆర్ఇవివి ఇంజిన్, 124.799సిసి సామర్థ్యంతో తయారు చేసింది. అత్యధిక వేగం గంటకు 90 కి.మీ. కేవలం 9 సెకనులో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు.

# ఆగని సెన్సెక్స్ పతనం

- దలాల్ స్ట్రీట్‌లో కొనసాగిన నష్టాలు
- సెన్సెక్స్ మరో 309 పాయింట్ల క్షీణత
- రెండు రోజుల్లో 1100 ఫట్
- వెంటాడిన ద్రవ్యోల్బణ భయాలు
- 10,666కు నిఫ్టీ..

## నిండా ముంచిన బడ్జెట్



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

గత కొద్ది రోజులుగా తారజువ్వాల రాణించిన దేశీయ స్టాక్ మార్కెట్లను మోడీ బడ్జెట్ అమాంతం ముంచేసింది. ఇది వరకు బడ్జెట్ కాలంలో ఎప్పుడూ జరగని స్థాయిలో మార్కెట్లు నష్టపోతున్నాయి. గత గురువారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్ మదుపర్లకు తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. దీంతో రెండు రోజుల్లోనే సెన్సెక్స్ ఏకంగా 1,149 పాయింట్లు లేదా 3 శాతం మేర పతనమయ్యింది. సోమవారం కూడా మార్కెట్లు మదుపర్ల విశ్వాసాన్ని చూరగొనలేకపోయాయి. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 309.59 పాయింట్లు లేదా 0.88 శాతం పతనమై 34,757.16కు దిగజారింది. 34,719 వద్ద మొదలైన సూచీ రోజంతా ఒత్తిడికి గురి అయ్యింది. ఓ దశలో 34,874 గరిష్ట స్థాయికి చేరనప్పటికీ అనంతరం అమ్మకాల ఒత్తిడితో మరో దశలో 400 పైగా పాయింట్ల నష్టంతో 34,520.80 కనిష్ట స్థాయిని తాకింది. నిఫ్టీ 94.05 పాయింట్లు లేదా 0.87 శాతం తగ్గి 10,666.55 వద్ద ముగిసింది.

కాగా అంతర్జాతీయ పరిణామాలే మార్కెట్ల పతనానికి కారణమని మంత్రి అరుణ్ జైట్లీ ఆర్థిక శాఖ కార్యదర్శి హస్ముఖ్ అదియా వివరణ ఇచ్చారు. అయినా మార్కెట్లు నష్టాల నుంచి బయటపడలేకపోయాయి. ఈ నెల 7న రిజర్వు బ్యాంకు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది. జిఎస్‌టి రాకతో వరుసగా ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం పెట్టుకున్న అంచనాలకు మించి ద్రవ్యోల్బణం సూచీ నమోదవుతోంది. దీంతో ఆర్‌బిఐ సమీక్షలో వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని మదుపర్లలో భయాలు నెలకొన్నాయి. ఈ పరిణామాల మధ్య దలాల్ స్ట్రీట్‌లో నష్టాలు కొనసాగాయి.

**రంగాల వారిగా..**

బిఎస్ఇలో రంగాల వారిగా కాపిటల్ గూడ్స్ 2.65 శాతం, బ్యాంకింగ్ 1.11 శాతం, లోహ 0.56 శాతం, రియాల్టీ 0.36 శాతం చొప్పున అధిక నష్టాల పాలై మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. కాగా ఆటో సూచీ 0.73 శాతం, విద్యుత్ 0.68 శాతం, పిఎస్‌యు 0.38 శాతం చొప్పున రాణించి మార్కెట్లకు మద్దతునిచ్చాయి. సెన్సెక్స్-30లో హెచ్‌డిఎఫ్‌సి 4.06 శాతం, లర్సన్ అండ్ టర్బో 3.65 శాతం, ఇండస్ఇండ్ బ్యాంకు 2.36 శాతం, కొటాక్ బ్యాంకు 2.32 శాతం, అదానీ పోర్ట్సు 2 శాతం, బజాజ్ ఆటో 2 శాతం, ఒఎన్‌జిసి 1.87 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ 4.20 శాతం, టాటా మోటార్స్ 3.12 శాతం, పవర్ గ్రిడ్ 2.08 శాతం, ఐటిసి 1.43 శాతం, సన్‌ఫార్మా 1.08 శాతం, కోల్ ఇండియా 0.99 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

**ప్రతికూల పరిణామాలు..**

ఈ క్విటీలపై రూ.1 లక్ష పైగా లాభాలు ఆర్జించిన మదుపర్లపై లాంగ్‌టర్మ్ ఈక్విటీ గెయిన్స్ (ఎల్‌టిసిజి)పై 10 శాతం పన్ను విధించాలని కేంద్రం బడ్జెట్‌లో నిర్ణయిం చింది. ఈ పరిణామం మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. మరోవైపు రూ.250 కోట్లకు లోపు కార్పొరేట్ పన్ను రేటును 25 శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రకటించినప్పటికీ మదుపర్లలో విశ్వా సాన్ని నింపలేకపోయింది. మరోవైపు దేశంలో వరుసగా పెరుగు తున్న ద్రవ్యోల్బణంపై మదుపర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదల వడ్డీ రేట్ల తగ్గుదలకు ప్రధాన అడ్డంకిగా మార నుందన్న విశ్లేషణలు మార్కెట్లను నష్టాలకు గురి చేశాయి. ప్రస్తుత పరిణామాలు పైగా వడ్డీ రేట్ల పెంపునకు ఎక్కడ దారి తీస్తాయోనన్న భయాలు మార్కెట్లను మరింత ఒత్తిడికి గురి చేశాయి.

**ప్రపంచ మార్కెట్లు..**

అంతర్జాతీయంగా అన్ని యూరప్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. బ్రిటన్‌లోని ఎఫ్‌టిఎస్ఇ 100 సూచీ 1 శాతం, ఫ్రాన్స్‌కు చెందిన సిఎసి 40 సూచీ 0.8 శాతం, జర్మనీకి చెందిన డిఎఎక్స్ సూచీ 0.6 శాతం చొప్పున నష్టపోయాయి. యూరప్ ఎస్‌టిఒఎక్స్ఎక్స్ 600 సూచీ 1.1 శాతం విలువ కోల్పోయింది.

**పన్ను కారణం కాదు.. : జైట్లీ**

దీర్ఘకాలిక మూలధన లాభాలపై 10 శాతం పన్నును ప్రవేశ పెట్టడం ద్వారానే మార్కెట్లు పడిపోయాయని భావించడం సరైంది కాదని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ప్రపంచ పరిణామాలే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ఎల్‌టిసిజి లేదా బడ్జెట్ వల్ల ఈ పతనం జరగడం లేదని వివరనిచ్చారు. డౌ జోన్స్ కూడా 2 శాతం మేర పడిపోయిందని అన్నారు. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 665.75 పాయింట్లు నష్టపోయిందన్నారు. బలహీనమైన అంతర్జాతీయ పరిణామాలే ఇందుకు కారణమని ఆర్థికశాఖ కార్యదర్శి హస్ముఖ్ అదియా కూడా ఇదే తరహా వివరణ ఇచ్చారు.

**దిద్దుబాటు మంచిదే : అసోచామ్**

కేంద్ర బడ్జెట్ తర్వాత స్టాక్ మార్కెట్లో చోటు చేసుకున్న దిద్దుబాటునీ (కరెక్షన్) ప్రముఖ పారిశ్రామికవేత్తల సంఘం అసోచామ్ సమర్థించింది. ఇప్పటికే మార్కెట్లో ముఖ్యంగా అనేక చిన్న, మధ్య తరహా కంపెనీలు ఆయా కంపెనీల ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా పెరిగాయని తెలిపింది. ఈ నేపథ్యంలో మార్కెట్లో దిద్దుబాటు మంచిదేనని అసోచామ్ అభిప్రాయపడింది. ఈ నెల 7న ప్రకటించే ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో ఆర్‌బిఐ కీలకమైన రెపో రేటు పెంచకుండా సంయమనం పాటించాలని కోరింది.

## అదరగొట్టిన టాటా మోటార్స్

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో టాటా మోటార్స్ నికర లాభాలు ఏకంగా 10 రెట్లు పెరిగి రూ.1,214.6 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.111.57 కోట్ల లాభాలు నమోదు చేసింది. గత క్యూ3లో కంపెనీ అమ్మకాలు 14.2 శాతం పెరిగి రూ.74,156.07 కోట్లకు చేరాయి.

## వాహన బీమా తగ్గింపు


### హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో నిర్ణయం

**ముంబయి :** జీవితబీమా యేతర సంస్థ హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో మోటారు బీమా ప్రీమియం ధరల్లో సవరణ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. దేశ వ్యాప్తంగా ప్రస్తుత, నూతన ఖాతాదారులకు ఈ బీమాలో 15 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇడి ముకేష్ కుమార్ పేర్కొన్నారు. జిఎస్‌టి అమలు, వ్యయాల తగ్గింపు చర్యలు, మెరుగుపర్చిన ఆటోమోటెడ్ ప్రక్రియ తదితర వాటి వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుత రేట్లపై ఈ తగ్గింపు ఉంటుందన్నారు. దేశంలోని 5,300కు పైగా నెట్‌వర్క్ గ్యారేజీల్లో ఈ సేవలు అందిస్తామన్నారు.

## పసిడి దిగుమతుల్లో క్షీణత

**ముంబయి :** ప్రస్తుత ఏడాది జనవరిలో భారత బంగారం దిగుమతుల్లో భారీ క్షీణత చోటు చేసుకుంది. భారీగా పెరిగిన ధర, దిగుమతి సుంకంపై కోత ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో ట్రేడర్లు దిగుమతిని తగ్గించుకు న్నారని తెలుస్తోంది. పసిడి దిగుమతులు 37 శాతం క్షీణించి 30 టన్నులకు తగ్గి 17 మాసాల కనిష్ట స్థాయిని తాకిందని లోహాల కన్సల్టెన్సీ జిఎఫ్ఎంఎస్ వెల్లడించింది.

# Stress is indicated with a...



K MADHUSUDHANA RAO
JUNIOR LECTURER IN ENGLISH
UPPUGUNDURU, PRAKASAM DT.

## TET MODEL PAPER - IV

### LANGUAGE – II (Content and Methodology)



**1. 'Heat expands bodies.'**
**The interrogative form of the given sentence is**
a) Has heat expand bodies?
b) Is heat expand bodies?
c) Do heat expands bodies?
d) Does heat expand bodies?

**2. He has no prejudice ________ foreigners. Select the suitable answer from the given options.**
a) for b) against
c) before d) with

**3. I am quite pleased with ______________ Choose the relevant form of the pronoun.**
a) myself b) me
c) I d) none of the above.

**4. One of the following sentences is grammatically unacceptable. Identify the sentence.**
a) You'd better consult a doctor.
b) I wish I didn't have to write this exam.
c) Neither of my brothers are married.
d) Would you please tell me the way to the station?

**5. One of the following phrases with 'Make' is not an acceptable collocation. Identify the expression from the options.**
a) Make arrangements
b) Make a mistake
c) Make a decision
d) Make a noise

**6. Which of the following is an example of a compound sentence?**
a) Buy two shirts and get one free.
b) If you buy two shirts, you get one free.
c) Buy two shirts to get one free.
d) In case of buying two shirts, you get one free.

**7. Regarding Degrees of Comparison, one of the following sentences is grammatically incorrect. Identify the sentence.**
a) Africa is the hottest continent in the world.
b) She is the taller of the two sisters.
c) No other flower are as beautiful as the rose.
d) Apples are not as cheap as oranges.

**8. At this time tomorrow, _____________. Identify the clause that replaces the blank.**
a) I shall go to my office.
b) I will be leaving to my office.
c) I should have gone to my office.
d) I shall have been gone to my office.

**9. He says, 'I don't want to wait any longer.' If the same in written in Indirect Speech, you get**
a) He says that he doesn't want to wait any longer.
b) He said that he didn't want to wait any longer.
c) He said that he didn't want to wait any longer.
d) He says that he didn't want to wait any longer.

**10. Identify the sentence that is not in passive voice.**
a) Let the weak not be insulted.
b) The patient is being looked after by the nurse.
c) The enemy has defeated by our army.
d) One's promises should be kept.

**11. You want to say that your friend narrowly missed the accident. How do you say with an idiom?**
a) He missed the accident in a hair's gap.
b) He missed the accident in a hair's distance.
c) He missed the accident in a hair's breadth.
d) He missed the accident in a hair's loss.

**12. One of the phrasal verbs in the following sentences is not grammatically correct. Identify the sentences.**
a) Please look for this word in the dictionary.
b) She is bad-tempered. I can't get on with her.
c) He has given up smoking most recently.
d) I am sick off the whole business.

**13. By the time the fire fighters ________ the fire ________ many huts. Now choose the suitable pair of verbs to fill in the blanks.**
a) arrived, engulfed
b) arrived, had engulfed
c) had arrived, engulfed
d) had arrived, had engulfed

**14. Identify the conjunction that fills the blank in the following sentence.**
**______ you give me the keys, I will kill you.**
a) If b) If not
c) Unless d) If/Unless

**15. Identify the Noun Phrase from the following phrases.**
a) the richly decorated auditorium.
b) at the railway station.
c) beautiful red Mercedes Benz.
d) without pains no gains.

**16. "Don't be silly." is an example of an**
a) assertive sentence
b) imperative sentence
c) interrogative sentence
d) exclamatory sentence

**17. They looked into each _________ eyes. The suitable option is**
a) other's
b) others
c) another's
d) one anothers

**18. One of the following sentences is grammatically incorrect. Identify the sentence.**
a) The secretary and treasurer has gone on leave.
b) The secretary and the treasurer have gone on leave.
c) I like Cathie because she is beautiful, kind and intelligence.
d) I admire Cathie for her beauty, intelligence and kindness.

**19. 'As soon as the sun rose, the fog disappeared.'**
**If you write the above sentence with 'no sooner - than' the sentence reads like**
a) No sooner had the sun risen than the fog disappeared.
b) No sooner did the sun risen than the fog disappeared.
c) No sooner had the sun risen then the fog disappeared.
d) No sooner has the sun risen than the fog disappeared.

**20. Study the sentences and choose the answer from the given options.**
1. We enjoyed ourselves at the party.
2. The students entered the class room.
3. The police prevented us from crossing the barricade.
4. My father came to the college to pay my fees.
a) All are correct. b) All are wrong.
c) Only 4 is wrong. d) Only 3 is correct.

**Read the following passages carefully and answer the questions from 21 to 24.**

Bees live in a house that is called a hive. There are three kinds of bees: workers, drones, and queens. Only one queen bee can live in each hive. If she is lost or dead, the other bees will stop their work.

Bees are very wise and busy little creatures. They all join together to build cells of wax for their honey. Each bee takes its proper place and does its own work. Some go out and gather honey from the flowers; others stay at home and work inside the hive.

The cells which they build are all of one shape and size, and no room is left between them. The cells are not round. They have six sides. Did you ever look into a glass hive to see the bees while at work? It is pleasant to see how busy they always are.

But the drones do not work. Before winter comes, all the drones are driven from the hive so that they don't eat the honey which they did not gather. It is not safe for children to handle bees. Bees have a painful sting that they use in their defense.

**21. What is the place where bees live?**
a) wax b) hive
c) cells d) room

**22. What happens to the drones in the winter?**
a) They sleep.
b) They find a new hive.
c) They are driven out.
d) They repair the hive.

**23. The shape of each cell is**
a) heptagon b) pentagon
c) hexagon d) octagon

**24. Which is not a kind of bee?**
a) Workers b) Kings
c) Queens d) Drones

**Methodology**

**25. A role play is an example of**
a) an oral activity done in pairs.
b) a written activity done in groups.
c) an activity done alone.
d) an activity outside the class room.

**26. Grammar translation classes are usually conducted in the student's**
a) foreign language.
b) native language.
c) target language.
d) None of the above.

**27. Harold Edward Palmer, a pioneer in the field of English language and teaching dedicated himself to**
a) audio method. b) drill method.
c) written method d) oral method.

**28. The effective method for communicating theories, ideas, and facts to students is**
a) Lecture method.
b) Grammar translation method.
c) Direct method.
D) Audio l-lingual method

**29. Stress is indicated with a**
a) small star. b) small vertical bar.
c) small hyphen. d) small dot.

**30. One of the following words has a triphthong in it. Identify it.**
a) clear b) hour
c) fire d) nine

★

**Answer : Explanation**

**1. d** HV+ Sub+ MV+ Obj?
**2. b** Usage: Have prejudice against something.
**3. a** Usage: Be pleased with oneself
**4. c** With 'either and neither,' we use plural noun and singular verb. Similarly with 'Either of the two' or 'Neither of the two.'
**5. d** No such expression like 'make a noise' exists. To make noise (idiom) means 'to talk
**6. a** A compound sentence will have two or more main clauses connected with coordinating conjunctions like 'and, so, but, yet, else, nor, or and for.'
**7. c** No other + singular noun + singular verb
**8. b** 'At this time tomorrow' indicates the continuity of the action in future.
**9. a** If the reporting verb is the simple present/simple future/present perfect, the tense in the reported speech doesn't change.
**10. c** To identify passive voice, look for sentences with 'be/ be form+V3.'
**11. c** To miss something in'a hair's breadth' means to escape from something in a very short distance or amount.
**12. a** When you have to refer to a word, we use 'look up' and not 'look for' which is different in sense.
**13. b** When two past actions take place one after another, the first action is expressed in simple past and the second action in past perfect.
**14. c** Use 'unless' with negative clauses.
**15. a** The order of a Noun Phrase is 'determiner+adverb+adjective+noun.'
**16. b** There are three types in imperative sentences. 1) Verb + Object. 2. Please + Verb + Object 3) Let + Personal Pronoun + Verb + Object Similarly their negatives.
**17. a** The sense requires possessive form.
**18. c** If you are creating a list, make sure that all items in the list have the same grammatical property. You can't create a list consisting of nouns and adjectives.
**19. a** When we use 'hardly, scarcely or no sooner – than' the subject and verb are written in inversion form i.e HV + Sub + MV.
**20. a** Study the rules of the sentences carefully.
**21. b** **22. c** **23. c** **24. b** **25. a**
**26. b** **27. d** **28. a** **29. b** **30. c**

## ఫిషింగ్ హార్బర్ బంద్ విజయవంతం

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలని కోరుతూ మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ బంద్ విజయవంతమైంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మత్స్యకార వృత్తిపై ఆధారపడే సుమారు 10 వేల మంది విధులను, వ్యాపారాలను బహిష్కరించి బంద్‌లో పాల్గొన్నారు. బంద్ కారణంగా ఫిషింగ్ హార్బర్‌లో సుమారు రూ. 2 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. 800 వరకు మెకనైజ్డ్ బోట్లు, 600 వరకు చిన్న బోట్లు చేపల వేటకు వెళ్లకుండా నిలిపివేశారు. మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు 41వ రోజుకు చేరాయి.



గాజులకొల్లివలసలో నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు తేజేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి తదితరులు

## రూ.1.50 లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా సాధ్యం : సిపిఎం

### 'వంశధార' నిర్వాసితులకు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)

వంశధార నిర్వాసితులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస, కొత్తూరు మండలాల్లోని గాజులకొల్లివలస, పాడలి, గదబపేటలోని వంశధార నిర్వాసిత పునరావాస కాలనీల్లో సోమవారం సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను ఈ బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. పునరావాస కాలనీలకు విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు వంటి 26 రకాల మౌలిక వసతులు కల్పించాలన్న నిబంధనలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. పైగా, నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నిర్వాసితులకు ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద రూ.1.50 లక్షల ఇస్తున్నట్లు ప్రభుత్వం చెప్తోందన్నారు. ఆ మొత్తంతో ఇళ్ల నిర్మాణం పూర్తయితే ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి నిర్వాసితునికీ పరిహారం, యూత్ ప్యాకేజీతోపాటు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి నిర్వాసితులు ఐక్యంగా పోరాడాలన్నారు. ఆయన వెంట సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి, ప్రాజెక్టుల నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.సింహాచలం ఉన్నారు.

## హామీల అమలుతోనే అభివృద్ధి

### సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ వెల్లడి

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

రాష్ట్ర విభజన సందర్భంగా నాటి ప్రభుత్వం అనేక హామీలను తన ఆర్డినెన్స్‌లో పొందుపరిచిందన్నారు. వీటిని అమలు చేయాల్సింది పోయి బిజెపి, టిడిపి నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశంలో రాయలసీమ అభివృద్ధికోసం ఇచ్చిన హామీలను పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. సోమవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఆంజనేయులుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ప్రధానంగా కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ, కర్నూలు జిల్లాలో గూడ్సు వ్యాగన్ నిర్మాణ కేంద్రం, చిత్తూరుకు మన్నవరం పరిశ్రమ, కునోముఖ్ పిల్లేట్ పరిశ్రమ విమానాల విడి భాగాల తయారీ కేంద్రంతో పాటు మరో 70 వాగ్ధానాలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దాదాపు నాలుగేళ్లు పూర్తయినా అమలు కాక పోవడం దారుణమన్నారు. హామీలను అమలు చేయాలని కోరుతూ చేసే బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

## హోదా కోసం వంటావార్పు

ప్రజాశక్తి - మైలవరం (కృష్ణా)

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా వెంటనే ప్రకటించాలని కోరుతూ కృష్ణాజిల్లా మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ రహదారిపై సోమవారం వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర అధి కార ప్రతినిధి జోగి రమేష్ మాట్లాడుతూ హోదా రాకపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని విమర్శించారు. నాలుగేళ్లుగా రాష్ట్రానికి టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. వైసిపి నాయకులు పి.శ్రీనివాసరావు, డి.అంజిరెడ్డి, అజాద్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ప్రేమికుల ఆత్మహత్య

ప్రజాశక్తి - రాజంపేట (కడప)

కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని పెనగలూరు మండలం కొత్త శింగనమల గ్రామానికి చెందిన కడప శ్రీనివాసులు(41), కోనేరు లక్ష్మీదేవి(36) సోమవారం విషపు ద్రావనం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... శ్రీనివాసులు, లక్ష్మీదేవిలు గత కొంత కాలంగా ప్రేమించుకొంటున్నారు. వీరిరువురికి ముందే వివాహం అయింది. శ్రీనివాసులకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు, లక్ష్మీదేవికి భర్త, ముగ్గురు ఆడ పిల్లలున్నారు. నాలుగు రోజుల క్రితం వీరిరువురు గ్రామాన్ని వదలి వెళ్లిపోయారు. ఆదివారం తిరిగి ఇంటికి చేరుకొన్నారు. సోమవారం తెల్లవారుజామున సమీపంలోని పొలాల్లో శీతలపానీయంలో విష ద్రావనం కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.గ్రామస్తులు హుటాహుటిన ప్రయివేటు వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

## ప్రజ్ఞ

### జవాబులు

1. న్యూఢిల్లీ (ఫిబ్రవరి 4 నుంచి 18)
2. ఫిబ్రవరి 4
3. సయ్యద్ మహ్మద్ హుస్సేన్
4. గ్రీన్ గుడ్ డీడ్స్
5. కె. కస్తూరిరంగన్ కమిటీ

# వాడవాడలా సిపిఎం ప్రచారభేరి

- మహాసభలకు విస్తృత ప్రచారం



పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్(పశ్చిమగోదావరి)

ఈ నెల 10, 11, 12 తేదీల్లో భీమవరంలో నిర్వహించనున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ప్రచారభేరి యాత్రలు వాడవాడలా విస్తృత ప్రచారం సాగించాయి. ఐదోరోజైన సోమవారం టి.నర్సాపురం, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, ద్వారకా తిరుమల, భీమడోలు మండలాల్లో ఒక దళం, పెనుగొండ, ఇరగవరం, తణుకు రూరల్ మండలాల్లో ఒక దళం, అత్తిలి, పెనుమంట్ర, వీరవాసరం మండలాల్లో మరో దళం యాత్రలు నిర్వహించాయి. ఈ నెల 2 నుంచి తాడేపల్లిగూడెం, నర్సాపురం, భీమవరం పట్టణాల నుంచి మూడు ప్రచారభేరి జాతాలు ప్రారంభమయ్యాయి. ఇంటికొక మనిషి.. ఊరుకొకబండి.. ఎర్రజెండా చేతబట్టి భీమవరం రావాలి... అంటూ కళాకారులు ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర మహాసభల కోసం రూపొందించిన పాటలు, నాటికల ద్వారా ప్రచారం సాగుతోందని సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా (డెల్టా) కమిటీ కార్యదర్శి బి.బలరామ్ తెలిపారు. 'జనస్వరం.. పోరుస్వరం.. భీమవరం పిలుస్తోంది' అనే టైటిల్ సాంగ్ విశేషంగా ఆకట్టుకుంటోందని చెప్పారు. మూడు ప్రచార భేరి యాత్రలు ఇప్పటికే 32 మండలాల్లో 435 గ్రామాల మీదుగా ప్రచారం చేసి 670 వీధి మీటింగులు నిర్వహించాయని తెలిపారు. ప్రజానాట్యమండలిలో చిన్నారి కళాకారులు సైతం ఎర్రజెండా పట్టుకుని, కాళ్లకు గజ్జెలు కట్టి ఉత్సాహంగా ప్రచారంలో భాగస్వాములవుతున్నారని వివరించారు. మరో నాలుగురోజుల్లో మిగిలిన గ్రామాల్లో ప్రచారాన్ని పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. భీమవరం ప్రచార భేరి జాతాకు బి.ఆంజనేయులు, నర్సాపురం జాతాకు జక్కంశెట్టి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం జాతాకు కె.శ్రీనివాస్, జి.శివకుమార్ నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు.

# శ్రీకాకుళంలో ఉద్రిక్తత

- ఇతర కులాలను ఎస్‌టిల్లో చేర్చొద్దంటూ గిరిజనుల ర్యాలీ
- మత్స్యకారుల దీక్షా శిబిరం దగ్ధం



శ్రీకాకుళంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు (ఇన్‌సెట్) దగ్ధమవుతున్న మత్స్యకారుల దీక్షా శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

బోయ, వాల్మీకి, మత్స్యకార తదితర కులాలను ఎస్‌టిల్లో చేర్చొదంటూ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన శ్రీకాకుళంలో గిరిజనులు సోమవారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన గిరిజనులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఇతర కులాలను ఎస్‌టిల్లో చేర్చొద్దని, వాల్మీకి, బోయలను ఎస్‌టిల్లో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. గిరిజనులను కలెక్టరేట్ లోనికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడంతో సుమారు మూడు గంటలపాటు కలెక్టరేట్ ఎదుట బైటాయించారు. కలెక్టర్‌కు తమ సమస్యను విన్నవించే వరకూ ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు.

దీంతో, వారి వద్దకు జాయింట్ కలెక్టర్-2 పి.రజనీకాంతారావు వచ్చారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారని, ఆందోళన విరమించాలని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గిరిజనులు ఆందోళన కొనసాగించడంతో అక్కడ్నుంచి వెళ్లిపోయారు. మళ్లీ అక్కడికి వచ్చిన జెసి-2కు గిరిజనులు వినతిపత్రం అందించారు. కలెక్టర్ రావాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌టిల్లో చేర్చాలని మత్స్యకారులు 56 రోజులుగా కలెక్టరేట్ వద్ద చేపడుతున్న రిలే దీక్షా శిబిరంలోని కుర్చీలను ధ్వంసం చేశారు. బ్యానర్లు, కుర్చీలకు నిప్పు పెట్టారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ కమ్ముకోవడంతో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేశారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. కలెక్టర్ కె.ధనంజయరెడ్డికి జెసి-2 సమాచారం అందించడంతో ఆయన ఆందోళనకారుల వద్దకు వచ్చారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

# రాష్ట్ర బంద్‌తో ప్రజాగ్రహం తెలపాలి

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్



కర్నూలులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 8న చేపట్టే రాష్ట్రబంద్‌ను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ప్రజాగ్రహాన్ని తెలపాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు కెకె భవన్‌లో వామపక్ష, ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.షడ్రక్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఎంఏ.గఫూర్ మాట్లాడారు. ఈనెల ఒకటో తేదీన పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన రూ.21 లక్షల కోట్ల బడ్జెట్‌లో మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. విభజన సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారని గుర్తు చేశారు. కేంద్ర విద్యా, వైద్య సంస్థలు ఏర్పాటు చేస్తామని, రాజధాని, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తుందని హామీనిచ్చారని చెప్పారు. కేంద్రం 4 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టినా రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటా నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ రకంగా మన జిల్లా నుండి రాష్ట్రం వరకు అన్నింటా కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా వామపక్షాలు ఈ నెల 8న వామపక్షాలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు కర్నూలు జిల్లాలో ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, అసోషియేషన్లు, ప్రజాసంఘాలు, సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు సమావేశమైన పార్టీలు, అసోషియేషన్లు, ప్రజాసంఘాలన్ని జిల్లావ్యాప్తంగా లక్ష కరపత్రాలను వేసి 6,7 తేదీలలో పంచుతూ ప్రజలకు తెలియజేయాలన్నారు. 8న ఉదయం 6 గంటలకు ఆర్‌టిసి బస్టాండ్ వద్దకు వచ్చి బస్సులను ఆపి 12 గంటల వరకు ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. ఆ తరువాత రాజ్‌విహార్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేయాలని కోరారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

### 20 నుంచి విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ శాఖ పరిధిలోని పలు విభాగాల్లో పని చేస్తున్న 24 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యునైటెడ్ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి తెలిపారు. దీనికి నిరసనగా ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని సంఘాలనూ కలుపుకొని ఉద్యమాన్ని తీవ్రరూపంలోకి తెచ్చామన్నారు. సమస్యలపై పూర్తి నివేదికల తయారికీ ప్రభుత్వం గడువు కోరడంలో జనవరి 27న తలపెట్టిన సమ్మెను వాయిదా వేశామని తెలిపారు. అయినా, ప్రభుత్వ తీరుమారకపోవడంతో ఈ నెల 20 నుంచి సమ్మె చేపట్టక తప్పడం లేదన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు పి.వి.రమణమూర్తి, గణపతిరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

## హైకోర్టు భిక్ష కాదు సీమ హక్కు

### చేసిన తప్పే పునరావృతం అవుతోంది

### సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి/కర్నూలులీగల్

హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అది సీమ ప్రజలకు బిక్ష కాదని వారి హక్కని సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు వద్ద న్యాయవాది నాగరాజు చేపట్టిన నిరవధిక దీక్షకు ఓబులు, ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 14 రోజులుగా న్యాయవాదులు హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరుతూ ఆందోళకు పూనుకుంటున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. గత్యంతరం లేక నిరవధిక దీక్షలకు వెళ్ళాల్సిన స్థితిని ప్రభుత్వమే న్యాయవాదులకు కల్పించిందన్నారు. అమరావతిలో రాజధాని ఏర్పాటు చేసినప్పుడు సీమలో హైకోర్టు ఎందుకు ఏర్పాటు చేయరని ప్రశ్నించారు. రాయలసీమ వికేంద్రీకరణ పేరుతో జెండా పండుగను జిల్లాల వంతును ఉత్సవాలు నిర్వహించినంత మాత్రాన సీమ వెనుకబాటు మారదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే అది సాధ్యమవుతుందని వక్కాణించారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా హైకోర్టు ఏర్పాటు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తదితర డిమాండ్లపై ఈ నెల 8న బంద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. న్యాయవాదుల దీక్షలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేసేంత వరకు ఉద్యమిస్తామని, అప్పటి వరకు అనేక రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.నాగలక్ష్మిదేవి, ఎస్.బాబుసాహెబ్ తెలిపారు. కర్నూలులోనే హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాదులు కర్నూలు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 16వ రోజుకు చేరాయి.. ఈ సందర్భంగా నాగలక్ష్మిదేవి, బాబుసాహెబ్ మాట్లాడారు. ఈ దీక్షలను ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగిస్తామని చెప్పారు. ఆతరువాత ఉద్యమం మరో రూపంలో ఉంటుందని హెచ్చరించారు.

## 19న చలో నెల్లూరు

### ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - నెల్లూరు

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ 19న జరిగే చలో నెల్లూరును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, పులిగండ్ల శ్రీరాములు, కౌలు రైతు సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు పొట్టేపాళెం చంద్రమౌళి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టు నీటితో పెన్నా డెల్టా, కావలి, కనుపూరు, ఉత్తర, హైలెవల్ కాలువలు, కండలేరు, బావులు, బోర్లు కింద సుమారు 6 లక్షల ఎకరాలకు పైగా పంట పండిందన్నారు. ఇందులో 90 శాతం ఏ గ్రేడ్ రకమని తెలిపారు. పుట్టికి రూ.18వేలు రైతులు అమ్ముకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గిట్టుబాటు ధర కోసం, ఎట్టి పరిస్థితుల్లోనూ ధర కంటే తక్కువ కాకుండా వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ఒత్తిడి తేవాలన్నారు. 19 సోమవారం సాయంత్రం 3 గంటలకు స్థానిక బోసుబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు జరిగే ప్రదర్శనలో జిల్లాలోని రైతాంగం కదలి రావాలని కోరారు. కార్మికులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు, వివిధ రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చి ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## స్టౌవ్‌లో 4.6 కిలోల బంగారం

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ




గౌహతి నుంచి చెన్నయ్‌కు వెళుతున్న రైలులో రూ.కోటి 43 లక్షలు విలువైన బంగారాన్ని ఆంధ్రప్రదేశ్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలో ఈ బంగారం దొరికింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నెల్లూరు మీదుగా వెళ్తున్న ఈ రైలులో సోదాలు నిర్వహించారు. స్టౌబర్నర్‌లో బంగారం నింపి తరలిస్తుండటాన్ని గుర్తించినట్లు సమాచారం. మొత్తం 4.658 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విజయవాడ డిఆర్ఐ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.

## కేంద్రీయ విద్యాలయం ప్రారంభించాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ యూనివర్శిటీ పాఠ్యాంశాలు 2018-19 విద్యా సంవత్సరంలోనే ప్రారంభించేలా కేంద్రం ప్రభుత్వం దృష్టి సారించాలని కేంద్రీయ విశ్వ విద్యాలయ సాధన ప్రజా సంఘా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సమావేశంలో కేంద్రీయ విశ్వ విద్యాలయ సాధన ప్రజా సంఘాల సమాఖ్య కన్వీనర్ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, కో కన్వీనర్ చంద్రశేఖర్, ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటనరసయ్య, నాయకులు సాకే నరేష్, నూరుల్లా, జాన్సన్ బాబు, నరేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాఖ్య కో-కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాకు కేటాయించిన జాతీయ సంస్థలను వెంటనే నిర్మించాలని, గుంతకల్లు రైల్వే జోన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సెంట్రల్ యూనివర్శిటికి రూ.10 కోట్లు కేటాయించినప్పటికీ పనులు ఇంత వరకు జరగలేదన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాఖ్య కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలోనే కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రారంభించి తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణ

# ప్రతిపాదిత విద్యుత్ ఛార్జీలను పరిశీలిస్తాం

- ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ జి.భవానీప్రసాద్



విశాఖలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింగరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

కేంద్ర విద్యుత్ చట్టం, ఎపిఇఆర్‌సి అధికారాలకు లోబడి డిస్కాంల ఆదాయ స్థితిగతులు, ప్రభుత్వ ఆదాయాన్ని బేరీజువేసుకొని లోటు భర్తీకి వినియోగ దారులు ఎంతవరకు తోడ్పడగలరనేది ఆలోచిస్తామని ఎపిఇఆర్‌సి (ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి) ఛైర్మన్, జస్టిస్ జి.భవానీ ప్రసాద్ అన్నారు. ఈ ఏడాది విద్యుత్ ఛార్జీలు పెంచవద్దని డిస్కాంలు, ప్రభుత్వం చెప్పిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఏ ఛార్జీలు పెంచకుండా లోటును సమతుల్యత చేసుకోవాల్సివుందన్నారు. ఇపిడిసిఎల్ (ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) ప్రతిపాదిత విద్యుత్ టారిఫ్‌పై ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలోని ఎటిసి భవన్లో సోమవారం ఎపిఇఆర్‌సి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడుతూ ప్రజల మనోభావాలకు అనుగుణంగా సరసమైన ధరలకు విద్యుత్ సరఫరాచేసేలా ఉత్తర్వులిస్తామన్నారు. ఈ సభలో ఎపిఇఆర్‌సి సభ్యులు పి.రామ్మోహన్, డాక్టర్ పి.రఘు, ఇపిడిసిఎల్ సిఎమ్‌డి హెచ్‌వై దొర పాల్గొన్నారు.

**ఎన్నికల లబ్ధికోసమే పెంపు వాయిదా : సిహెచ్ నర్సింగరావు**

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ లబ్ధికోసం ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపును వాయిదా వేసింది తప్ప వినియోగ దారులపై భారాలు మోపకూడదన్న చిత్తశుద్ధితో కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన ప్రభుత్వం డిస్కాంల లోటును సబ్సిడీతో భర్తీచేస్తామని ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. ఇపిడిసిఎల్ ప్రతిపాదిత టారిఫ్‌పై సోమవారం విశాఖలో ఎపిఇఆర్‌సి నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో ఆయన మాట్లాడారు. ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో ఏర్పడే రూ.7,900 కోట్ల లోటును ప్రభుత్వం ఎలా భర్తీచేస్తుందో చెప్పలేదంటే... ఎన్నికల తరువాత విద్యుత్ ఛార్జీలు పెంచి వడ్డీతో సహా వినియోగదారుల నుంచి వసూలు చేయనుందని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల బహుళజాతి సంస్థలు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు లాభపడుతుండగా, ప్రజలపై భారాలు పడుతున్నాయని వివరించారు. చౌకగా ఉత్పత్తయ్యే సోలార్ విద్యుత్‌ను విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పిపిఎ)లోని లోపాలను సరిచేయాలని కోరారు. డిస్కాంల్లో పనిచేస్తున్న 24వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సిపిఎం నిరసన**

విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే ఆలోచనలు, ప్రయివేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. డిస్కాంల ప్రతిపాదిత టారిఫ్‌పై ఎపిఇఆర్‌సి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించి విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనపై నిరసన తెలిపారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, బెల్లం క్రషింగ్ రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నినాదాలు చేశారు. తొలుత ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయానికి కార్యకర్తలు ర్యాలీగా వచ్చారు.

## తాజ్‌మహల్ ఉత్సవాలపై వివాదం

**లక్నో :** యుపిలోని యోగి ఆదిత్యనాథ్ సర్కారు నిర్వహించనున్న తాజ్ మహల్ ఉత్సవాలు వివాదాస్పదంగా మారాయి. 2018 తాజ్ ఉత్సవాలు ఈ నెల 18 నుంచి 27 వరకు జరగనున్నాయి. ఏటా ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మొఘల్ సామ్రాజ్య విశిష్టతను తెలియజేసే కళలను ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తోంది. కాగా, తాజ్‌మహల్ ఉత్సవాలను రామాయణ విశేషాలను తెలియజేసే కళా ప్రదర్శనతో ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి పేర్కొనడంతో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతున్నాయి. తాజ్ ఉత్సవాలకు కాషాయ రంగు అద్దే ప్రయత్నం చేస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీంతో మొఘల్ సామ్రాజ్య వారసత్వ సంపదైన స్మారక మందిర గొప్పతనాన్ని ప్రపంచం ముందు చెడ్డగా చిత్రీకరించడమేనని సమాజ్ వాది పార్టీ నేత సునీల్ సజన్ అన్నారు.



**ఎన్నికలు** । గుజరాత్‌లో 1,145 గ్రామ పంచాయితీలకు ఫిబ్రవరి 5వ తేదీన జరిగిన ఎన్నికలలో 73 శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఫలితాలు ఈ రోజు వెలువడతాయి.

# మేజర్ల వివాహంలో జోక్యం చేసుకునే హక్కు ఎవ్వరికీ లేదు

### కాఫ్ పంచాయితీలకు వ్యతిరేకంగా సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ :** ఇద్దరు మేజర్లు వివాహం చేసుకున్నట్లయితే వారిని శిక్షించే హక్కు ఎవరికి ఉండదని సుప్రీంకోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఉత్తర భారత్‌లోని కొన్ని గ్రామాలలో పెద్దల అభిప్రాయాలకు విరుద్ధంగా వివాహం చేసుకున్నవారిని కఫ్ పంచాయితీల పేరుతో కొందరు గ్రామ పెద్దలు శిక్షిస్తున్నారని, దీనిపై న్యాయం చేయాలని కోరుతూ శక్తి వాహిని అనే సంస్థ ఒక పిటిషన్‌ను వేసింది. దీనిని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం పై విధంగా స్పందించింది. ముఖ్యంగా హర్యానాలో మధ్యయుగపు సంప్రదాయాలను కాపాడటం తమ బాధ్యత అంటూ కొందరు గ్రామ పెద్దలు ఈ విధంగా శిక్షలు విధిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా, కఫ్ పంచాయితీలతో తమకు సంబంధం లేదని, వివాహం చేసుకున్న ఇద్దరు మేజర్ల బంధంపై మాత్రమే మాకు సంబంధం ఉందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా పేర్కొన్నారు. వారు మేజర్లు అయితే కులాంతర వివాహం చేసుకున్నా, ఎవ్వరూ అభ్యంతరం చెప్పడానికి వీల్లేదన్నారు. తల్లిదండ్రులు, సమాజం ఎవరైనా వారిని శిక్షించే హక్కు లేదని స్పష్టం చేసింది.

## అనుమతి లేని యాంటిబయోటిక్స్ అమ్మకాలు

### యుకె బృందం అధ్యయనంలో వెల్లడి

**న్యూఢిల్లీ :** డ్రగ్ ఆర్గనైజేషన్ అనుమతి లేని యాంటిబయోటిక్స్‌ను బహుళజాతి కంపెనీలు భారతలో అత్యధికంగా విక్రయిస్తున్నారని యుకె బృందం చేపట్టిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. లండన్ లోని క్వీన్ మేరీ యూనివర్శిటీ, న్యూకాస్టిల్ యూనివర్శిటీ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. 2007 నుంచి 2012 సంవత్సరాల మధ్యకాలంలో సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆమోదించని 64 శాతం యాంటీబయాటిక్స్ ఔషధాలను అక్రమంగా విక్రయిస్తున్నట్లు తేల్చారు. 500 ఫార్మాస్యూటికల్ కంపెనీలు తయారు చేస్తున్న 3,300 రకాల యాంటీబయాటిక్స్‌ను అక్రమంగా విక్రయించడం ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు.

## ఈసారైనా ప్రామిస్ టూత్‌పేస్టు పనిచేస్తుందా..! : ప్రకాష్‌రాజ్



**బెంగళూరు :** రాజకీయాలలో వస్తున్న మార్పులపై ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ చర్యలను టార్గెట్ చేస్తూ ప్రకాష్‌రాజ్ ట్విటర్‌లో ట్వీట్ చేస్తుంటారు. కాగా, తాజాగా ప్రధాని మోడీ బెంగళూరు ర్యాలీపై ట్వీట్ చేశారు. ' 2014లో అమ్మిన ప్రామిస్ టూత్‌పేస్ట్ రైతులు, నిరుద్యోగ యువత ముఖాలపై నవ్వులు పూయించడంలో విఫలమైందని, బెంగళూరు ర్యాలీలో అమ్మిన ప్రామిస్ టూత్‌పేస్ట్ అయినా ఆ నవ్వులను తీసుకొస్తాయని మీరు నమ్ముతున్నారా?' అంటూ తనదైన శైలిలో ప్రభుత్వాన్ని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఈ విధంగా ట్విటర్ ద్వారా విమర్శించారు.

## యుపిలో మతఘర్షణలకు కారణమైన నిందితుని అరెస్టు

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో కస్‌గంజ్‌లో రిపబ్లిక్ డే రోజున జరిగిన మత ఘర్షణలకు కారణమైన నిందితులలో ఒకరిని పోలీసులు ఢిల్లీలో సోమవారం ఉదయం అరెస్టు చేసినట్లుపేర్కొన్నారు. ఆ మతఘర్షణలలో చందన్ గుప్తా అనే వ్యక్తి మరణించిన సంగతి తెలిసిందే. యుపిలో 'చెన్ను గాంగ్' లో సభ్యుడైన తన్వీర్ అలియాస్ మున్నావర్ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు చాకచక్యంగా అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా, ఆ ప్రయత్నంలో నిందితునికి, పోలీసులకు గాయాలైనట్లు పేర్కొన్నారు. నిందితుడిని ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. యుపిలో పలు కేసులలో అతను నిందితుడని, ఢిల్లీలో కూడా అతనిపై కేసులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తన్వీర్‌పై రూ. 70, 000 రివార్డు ఉన్నట్లు తెలిపారు.

## ముస్లిం పురుషులను వేటాడండి

### హిందుత్వ ఫేస్‌బుక్ పేజీలో దుర్మార్గపూరిత వ్యాఖ్యలు

### 100కు పైగా మతాంతర జంటల పేర్లు

న్యూఢిల్లీ : హిందూత్వవాదులు మరోసారి రెచ్చిపోయారు. సామాజిక మీడియా వేదికగా ముస్లిం పురుషుల సామూహిక హత్యాకాండకు పిలుపునిచ్చారు. హిందుత్వ గ్రూప్ ఫేస్‌బుక్ పేజీలో 100కు పైగా మతాంతర వివాహాలు చేసుకున్న జంటల పేర్లు ప్రకటించారు. 'ఈ జాబితాలోని బాలికలంతా లవ్ జీహాద్ బాధితులు. జంటల్లోని పురుషులను వేటాడాలని 'హిందూ సింహా'లకు పిలుపునిస్తున్నాం' అని ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నాంఫేస్‌బుక్‌లో ప్రకటించిన జంటల్లోని బాలికలంతా హిందువులు కాగా, పురుషులంతా ముస్లింలు. అలాగే ఈ ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టులన్నీ కూడా ముస్లింలను దెయ్యాలుగా పేర్కొంటూ, హిందువులకు రక్షణకావాలని కోరుతున్నట్లుగా ఉన్నాయి. అలాగే ఈ పేజీలో ఇటీవల పోస్టు చేసిన వీడియోలో ఒక తండ్రి తన కుమార్తెకు తుపాకీ ఎలా ఉపయోగించాలో నేర్పుతున్నట్లు ఉంది.మరొక వీడియోలో ఒక వ్యక్తిని దారుణంగా హింసిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. 'అవును హత్య చేసిన వ్యక్తి కూడా మరణిస్తాడు' అనే క్యాప్షన్ ఈ వీడియోకు ఉంది. మతాంతర వివాహం చేసుకున్న జంటల పేర్లను ఆదివారం రాత్రి పోస్టు చేశారు. అయితే మరో హిందుత్వ పేస్‌బుక్‌లో ఈ జాబితాను గత ఏడాది నవంబరులోనే పోస్టు చేశారు. 'హిందుత్వ వార్త', 'జస్టిస్ ఆఫ్ హిందుస్' అనే ఫేస్‌బుక్ పేజీల్లో కూడా ఈ జాబితాను పోస్ట్ చేశారు. అయితే వీటిల్లో ముస్లింల హత్యకు పిలుపు ఇవ్వలేదు కానీ, హిందువులు మేలుకోవాలని పేర్కొన్నాయి.

## గుర్‌గ్రామ్ విద్యార్థి హత్య కేసు

### చార్జిషీటులో 16 ఏళ్ళ విద్యార్థి : సిబిఐ

**గురుగ్రామ్ :** హర్యానా గురుగ్రామ్ పాఠశాలలో విద్యార్థి హత్య కేసుకు సంబంధించి 16 ఏళ్ళ విద్యార్థిని ప్రధాన నిందితుడిగా సిబిఐ పేర్కొంది. రెండో తరగతి చదువుతున్నవిద్యార్థి హత్య కేసులో భోండ్సిలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన 16 ఏళ్ళవిద్యార్థి పేరును ప్రధాన నిందితుడిగా సోమవారం నమోదు చేసినట్లు సిబిఐ తెలిపింది. అడిషనల్ సెషన్స్ జడ్జి జస్బీర్ సింగ్ కుందు ఎదుట సిబిఐ 50 వేల పేజిల ఛార్జి షీటును ఉంచింది. ఇదిలా ఉండగా ఈ కేసులో బాల నేరస్తుడిగా ఉన్న విద్యార్థికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. కోర్టు బెయిల్ నిరాకరించడం ఇది మూడోసారి. ఈ కేసులో అతనిని వయోజనుడిగానే కోర్టు పరిగణిస్తోంది. ఈ హత్య కేసుతో ప్రమేయమున్న వారి గుర్తింపును వెల్లడించే విషయంలో కోర్టు మీడియాను, ప్రభుత్వాన్ని దూరంగా ఉంచింది. హర్యానా గురుగ్రామ్ పాఠశాలలోని వాష్‌రూమ్ వద్ద సెప్టెంబరు 8, 2017న రెండో తరగతి విద్యార్థి హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నవంబరు 2017న పదహారేళ్ళ విద్యార్థిని సిబిఐ ప్రధాన నిందితుడిగా పేర్కొంది. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బస్సు కండక్టరును విడుదల చేసింది.

## రాజౌరీ సెక్టార్‌లో పాక్ కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

ఇక్బాల్ అహ్మద్‌లు మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, ఈ ఘటలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ గాయపడగా, ఆస్పత్రికి తరలించినట్లు తెలి పారు. పాక్ కాల్పులు కొనసాగిస్తుండ టంతో రాజౌరీ సెక్టార్ సరిహద్దుకు సమీపంలో ఉన్న 84 పాఠశాలలను మూసివేయించారు. మూడు రోజుల వరకు సెలవులు ప్రకటించారు. అలాగే సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పాక్ కాల్పులకు భారత దళాలు దీటుగా బదులిస్తున్నట్లు ఆర్మీ అధికారిక ప్రతినిధి తెలిపారు.

**పాక్‌కు ధీటైన సమాధానమిస్తాం : ఆర్మీ వైస్ చీఫ్‌శరత్ చంద్**

పాక్‌కు ధీటైన సమాధానం ఇవ్వడాన్ని భారత్ కొనసాగిస్తుందని ఆర్మీ వైస్ చీఫ్ శరత్ చంద్ సోమవారం అన్నారు. జమ్మూ కాశ్మీర్ లోని నియంత్రణ రేఖపై ఆదివారం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ బల గాలు జరిపిన కాల్పుల్లో నలుగురు సైనికులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియం త్రణ రేఖపై ఉగ్రవాదుల చొరబాట్లకు పాక్ సైన్యం మద్దతిస్తోందని అన్నారు. పాకిస్తాన్‌కు ధీటైన సమాధానమిస్తూనే ఉంటామని, ఇకపై తాము మాట్లాడమని, తమ చర్యలే మాట్లాడతాయని వ్యాఖ్యానించారు.

# 'రైతు సంక్షేమం' మాటల్లోనే..

### వాస్తవాలకు దూరంగా రాష్ట్రపతి ప్రసంగం

- ఉద్యోగకల్పనలో మోడీ సర్కారు పూర్తిగా విఫలం
- ఎంఎ, బీఏ అభ్యర్థులు రిక్షాలు తొక్కే పరిస్థితి
- రాజ్యసభ చర్చలో సిపిఎం ఎంపీ టీకే రంగరాజన్



**ప్రజాశక్తి-న్యూఢిల్లీబ్యూరో**

ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ చేసిన ప్రసంగం దేశంలోని వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉందని సీపీఐ(ఎం) సీనియర్ ఎంపీ టీ రంగరాజన్ విమర్శించారు. నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళా భద్రత, ఆకలి చావులు తదితర అంశాలను ప్రసంగంలో విస్మరించారని అన్నారు. రైతు సంక్షేమంపై ఎన్డీయే సర్కారుతో సహ పాలకవర్గాలన్నీ నినాదాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. 'కేంద్రంలో నాలుగు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నప్పటికీ.. రైతుల ఆదాయం రెండింతలు చేయలేదు. పైగా 2012 వరకు ఆదాయం రెండింతలు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. రైతులు మరో నాలుగేండ్లు ఆగాలా? అప్పటి వరకు మరిన్ని ఆత్మహత్యలు జరుగుతాయి. వీటికి పరిష్కారం ఏమిటి?' అని ప్రశ్నించారు. ఎన్డీయే సర్కారు ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైందని, ఫలితంగా ఎంఎ, బీఏ అభ్యర్థులు రిక్షాలు తొక్కే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో సోమవారం చర్చ జరిగింది. ఈ చర్చలో సీపీఐ(ఎం) నుంచి రంగరాజన్ పాల్గొన్నారు. 'కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై ఏ ఒక్క వర్గమూ సంతృప్తిగా లేదు. చివరికి తన భాగస్వామ్యపక్షాలైన శివసేన, టీడీపీ సైతం అసంతృప్తితో ఉన్నాయి' అని ఎద్దేవా చేశారు. 'రాష్ట్రపతి ప్రసంగంలో, బడ్జెట్‌లో రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని చెప్పారు. అమిత్‌షా సైతం తన ప్రసంగంలో రైతులపై తామొక్కరమే ఆందోళనగా ఉన్నట్లు చెప్పారు. అమిత్‌షా ఒక్కరే కాదు గతంలో లాల్‌బహుదూర్ శాస్త్రి సైతం జై జవాన్, జై కిసాన్ అని నినాదం ఇచ్చారు. ఇలా దేశంలోని పాలకవర్గాలన్నీ రైతుల సంక్షేమాన్ని నినాదాలకే పరిమితం చేశాయి' అని విమర్శించారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నదని, కానీ ఇప్పటికే వేల సంఖ్యలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలను ఎలా నిలువరిస్తారో సమాధానం చెప్పలేదని అన్నారు. 'రైతుల ఆదాయానికి మరో నాలుగేండ్లు ఆగాలి అంటున్నారు. అప్పటి వరకు రైతు ఆత్మహత్యలు మరిన్ని చోటుచేసుకుంటాయి. దీనికి పరిష్కారం ఏమిటి?' అని ప్రశ్నించారు. ఇక నిరుద్యోగంపై మాట్లాడుతూ.. ప్రధాని మోడీ, అమిత్‌షా చెప్పినట్లు పకోడీలు అమ్ముకోవడం ఉపాధి కల్పించినట్లు కాదని స్పష్టం చేశారు. అయితే స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న వారి వార్షికాదాయం యేడాదికి కేవలం రూ.60 వేలు మాత్రమేనని, ఈ లెక్కన ప్రతినెలా ఐదు వేల రూపాయలని, రోజువారిగా పరిశీలిస్తే రెండు వందల రూపాయల లోపేనని చెప్పారు. పెరుగుతున్న ధరలతో రోజూ రెండువందలతో కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. దేశంలో ఉపాధి కల్పన పూర్తిగా అటకెక్కిందని అన్నారు. ఫలితంగా ఎంఎ, బీఏ చేసినవారు రిక్షాలు తొక్కుతున్నారని అన్నారు. నయాసరళీకరణ ఆర్థిక విధానాల వల్ల రెగ్యులర్ ఉపాధి తగ్గిందని, టీచర్లను సైతం కాంట్రాక్టు విధానంలో నియమిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నోట్లరద్దు నిర్ణయం చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై ప్రతికూల ప్రభావం చూపిందని అన్నారు. 'వసుధైక కుటుంబం' అంటూ రాష్ట్రపతి తన ప్రసంగం ప్రారంభించారని గుర్తు చేసిన రంగరాజన్... రోహింగ్యా శరణార్థుల విషయంలో మాత్రం భారత ప్రభుత్వం మౌనం వహించిందని విమర్శించారు. బిజెపి మతోన్మాద సిద్ధాంతం వల్లే రోహింగ్యాల అంశంలో కేంద్రం జోక్యం చేసుకోలేదని చెప్పారు. దేశంలో అసమానతలు పెరిగిపోయాయని ఎంపీ రంగరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని ఒక్క శాతం జనాభా 73 శాతం సంపద కల్గిఉండగా..మిగితా 99 శాతం ప్రజానీకం వద్ద కేవలం 29 శాతం ఆదాయముందని చెప్పారు. వ్యాపార సులభతరంలో భారతదేశ స్థానం మెరుగుపడుతుందని చెప్పిన రాష్ట్రపతి.. పిల్లలపౌష్టికాహారలోపం, ప్రపంచ ఆకలి నివేదికల్లో భారతదేశ స్థితి గురించి ప్రస్తావించలేదని అన్నారు. ఈ సందర్భంగా రంగరాజన్ ప్రాతినిథ్యం వహిస్తున్న తమిళనాడుపై కేంద్రం చూపుతున్న వివక్షా వైఖరిని సభలో ఎండగట్టారు. జల్లికట్టు విషయంలో కేంద్రం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇక కావేరి విషయంలో 'కావేరి నిర్వహణ బోర్డు' ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు అడుగుముందుకు పడలేదని అన్నారు. కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రులు సైతం తమిళనాడుకు నీరు ఇవ్వబోం అంటూ విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని అన్నారు. 'తమిళనాడు భారతదేశంలో అంతర్భాగం అవునా కాదా?' అనే విషయంపై కేంద్ర పెద్దలు సమాధానం చెప్పాలన్నారు.

## హజ్ యాత్రికులకు స్వతంత్ర ముస్లిం సంస్థ

### ఢిల్లీ హై కోర్టులో పిల్

**న్యూఢిల్లీ :** హజ్ యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లు చూసేందుకు స్వతంత్ర ముస్లిం సంస్థను ఒక దానిని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నియంత్రణలోని హజ్ కమిటీని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ హై కోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ముస్లింలు హజ్ యాత్రకు వెళ్ళి వచ్చేందుకు ఇస్తున్న సబ్సిడిని రద్దు చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఈ సందర్భంగా పిటిషన్ లో ప్రస్తావించారు. ప్రభుత్వం సబ్సిడీని రద్దు చేస్తే ప్రభుత్వ నియంత్రణలోని కమిటీ అవసరం ఉండదని, 2002 నాటి హజ్ కమిటీ చట్టాన్ని రద్దు చేయవచ్చునని తెలిపింది. ఢిల్లీకి చెందిన అడ్వకేట్ షాహిద్ ఆలీ గతవారంలో ఈ పిటిషన్ దాఖలు చేశారు. హజ్ యాత్రికులు బోంబే-జెడ్డాల మధ్య విమానంలో రాకపోకలు సాగించేందుకు 1959లో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ విధానాన్ని ప్రవేశపెట్టింది. "ప్రస్తుతమున్న హజ్ కమిటీ చట్టాన్ని రద్దు చేసేందుకు అవసరమైన ఆదేశాలను, ఉత్తర్వులను జారీ చేయండి. దేశంలో నివసిస్తున్న సిక్కులు 1925 నాటి సిక్కు గురుద్వారా చట్టం ద్వారా తమ మైనార్టీ వ్యవహారాలను ఎలా నిర్వహించుకుంటున్నారో అదే విధంగా దేశంలోని ముస్లిం పౌరులు కూడా తమ సొంత సంస్థను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించండి." అని పిటిషన్‌లో కోరారు.

## అరబ్బు దేశాలకు త్వరలో మోడీ



**దుబాయ్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ వారంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) లోపర్యటించనున్నారు. ఆ దేశంతో ఉన్న సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రాధాన్యత నిస్తూ, దౌత్య, ఆర్థిక, భద్రత అంశాలలో మరింత సహకారాన్ని పొందే లక్ష్యంతో మోడీ పర్యటన జరుగుతుందని పలువురు వ్యాపార వేత్తలు , అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 10, 11 తేదీలలో ఆయన అక్కడ పర్యటించనున్నారు. దుబాయ్‌లో జరగనున్న ఆరో ప్రపంచ ప్రభుత్వ సదస్సులో పాల్గొననున్నారు. మోడీ యుఎఇలో పర్యటించడం ఇది రెండో సారి. అంతకుముందు 2015 ఆగస్టులో ఆయన యుఎఇ ఒకసారి పర్యటించారు. యుఎఇ- భారత్ సంబంధాలలో మరింత సాన్నిహిత్యం నెలకొల్పడమే ఈ పర్యటన లక్ష్యమని యుఎఇలో భారత్ దౌత్యాధికారి నవదీప్ సింగ్ సూరి తెలిపారు.

## లాలూతో శరద్ యాదవ్, బాబులాల్ మరాండీ భేటీ

**రాంచి :** జనతాదళ్ (యునైటెడ్) తిరుగుబాటు నేత, పార్టీమాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్ సోమవారం ఉదయం రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌ను రాంచి జైలులో కలుసుకున్నారు. దాణా కుంభకోణం కేసుకు సంబంధించి రాంచిలోని బిర్సా ముండా సెంట్రల్ జైలులో లాలూ యాదవ్ శిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతాంత్రిక్) నేతలు బాబులాల్ మరాండీ, ప్రదీప్ యాదవ్ కూడా లాలూ ప్రసాద్‌ను కలుసుకున్నారు. తాము దేశ రాజకీయాల గురించి చర్చించామని, పరస్పరం పరామర్శించుకున్నామని ఈసందర్భంగా లాలూ చెప్పారు.

# ప్రధానిగా మోడీ అర్హుడు కాదు

- కర్నాటక సిఎం సిద్దరామయ్య



**బెంగళూరు :** ప్రధానమంత్రి పదవికి నైతికంగా నరేంద్ర మోడీ అర్హుడు కాదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం విమర్శించారు. దేశ ప్రధానమంత్రిగా వున్న వ్యక్తి మాటలు అధిక విశ్వసనీయతను కలిగివుండాలని, మోడీ తాను చేసిన ఆరోపణలను నిరూపించాలని సిద్దరామయ్య డిమాండ్ చేశారు. కర్నాటకలో నేరస్తులు పరిపాలిస్తున్నారని, అవినీతి ప్రభుత్వం వుందని, అధికార దుర్వినియోగం జరుగుతోందని ఆదివారం మోడీ ఆరోపించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని, ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కమిషన్లు అడుగుతున్నారని కూడా మోడీ విమర్శించారు. ఈ ఆరోపణలపై సిద్దరామయ్య స్పందిస్తూ అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు మోడీకి లేదని అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ తొమ్మిది సంవత్సరాలు ఉన్న కాలంలో లోకాయుక్తాను ఏర్పాటు చేయలేదని తెలిపారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యెడ్యురప్పపై కూడా సిద్దరామయ్య విమర్శలు గుప్పించారు. అమిత్‌షా ఒక హత్య కేసులో వున్నారని, ఆయన అన్ని అబద్ధాలే మాట్లాడతారని ఆరోపించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కర్నాటకకు భారీగా నిధులు ఇస్తున్నామని మోడీ చెప్పడాన్ని సిద్దరామయ్య తప్పుపట్టారు. 'మేము చెల్లించిన పన్నులనే తిరిగి మాకు ఇస్తున్నారు' అని అన్నారు. '14వ ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం గత మూడు ఏళ్లలో మేం రూ. 95,200 కోట్లు చెల్లించాం. మాకు తిరిగి రూ. 84,500 కోట్లు వచ్చింది' అని తెలిపారు. కేంద్రం ఇంకా రూ. 10 వేల కోట్లు తిరిగి ఇవ్వాల్సి వుందని సిద్దరామయ్య పేర్కొన్నారు.

## ఢిల్లీలో పది రైళ్లు రద్దు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో సోమవారం ఉదయం అత్యల్పంగా 6.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ విభాగంపేర్కొంది. దృశ్యత స్థాయి 8:30 గంటలకు 800 మీటర్లు ఉండగా, తేమ 91 శాతం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో 10 రైళ్లను రద్దు చేయగా, 19 రైళ్లు ఆలస్యంగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

## కర్ణాటకలో న్యాయవాదుల సమ్మె

**బెంగళూరు :** కర్ణాటక హైకోర్టులో ఖాళీగా ఉన్న పోస్టులకు న్యాయమూర్తులను నియమించడంలో సుప్రీం కోర్టు, అలాగే కేంద్ర ప్రభుత్వానికి ఆలస్యం చేయడంతో దానికి నిరసనగా న్యాయవాదులు సోమవారం సమ్మెను ప్రారంభించారు. ఇతరులు కూడా కర్ణాటక హైకోర్టు గోల్డెన్ జూబ్లీ గేట్ వద్ద రిలే దీక్షల్లో కూర్చున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోతే వారం రోజుల పాటు సమ్మె కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. వారం తరువాత, రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు పాటు కోర్టు విచారణకు న్యాయవాదులు దూరంగా ఉంటారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే, న్యూఢిల్లీలో పార్లమెంటు ఎదుట ధర్నా చేయాలని వారు నిర్ణయించుకున్నారు.


## కాశ్మీర్ యువకులపై దాడిని ఖండించిన ఎస్ఎఫ్ఐ

**న్యూఢిల్లీ, ఇండియా న్యూస్ నెట్‌వర్క్ :** హర్యానాలో ఇద్దరు కాశ్మీర్ యువకులపై దాడిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. మహేందర్‌ఘర్ వద్ద శుక్రవారం ప్రార్థనలకు వెళ్లి తిరిగిన వస్తున్న యువకులపై కర్రలు, ఇటుకలు, హెల్మెట్లతో దారుణంగా దాడి చేయడంపై ఎస్ఎఫ్ఐ కేంద్ర కార్యవర్గ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. యువకులకు సహాయం చేయడానికి రక్షణ కల్పించడానికి ఎవ్వరూ రాకపోవడంపై, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. హర్యానా ముఖ్యమంత్రిని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి కోరిన తరువాత కేసు నమోదుచేయడాన్ని గుర్తు చేస్తూ.. కేసు నమోదుకు ముఖ్యమంత్రి జోక్యం అవసరమైందని విమర్శించింది. గతంలో హర్యానా విశ్వవిద్యాలయంలో 'పాకిస్తాన్ జిందాబాద్' అనే నినాదాలు చేసినందుకు కాశ్మీర్ విద్యార్థులపై దాడి చేశారని తెలిపింది.

**ప్రత్యేకం**

# ఆ నిర్లక్ష్యమేంటి?

- ఆర్థిక శాఖ వ్యవహార శైలిని తప్పు పట్టిన సిఐసి
- మాల్యా రుణాలపై నెలలోగా స్పందించాలని ఆదేశాలు



**న్యూఢిల్లీ :** ప్రముఖ పారిశ్రామికవేత్త విజయ్ మాల్యాకు వివిధ బ్యాంకులు మంజూరు చేసిన రుణాల వివరాలు, మాల్యా ఇచ్చిన గ్యారంటీలపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలివ్వకుండా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని ముఖ్య సమాచార కమిషనర్ (సిఐసి) తప్పు పట్టారు. ఆర్థిక శాఖలోని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి (సిపిఐఓ) ఇచ్చిన సమాధానం చాలా అస్పష్టంగా, డొల్లగా వుంది, చట్టానికి అనుగుణంగా లేదని సిఐసి ఆర్.కె.మాథుర్ తీవ్రంగా విమర్శించారు. 2016 మార్చి 16వ తేదీన రాజీవ్ కుమార్ ఖరే దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తును ఐదు రోజుల్లోగా సంబంధిత అధారిటీకి బదిలీ చేయాలని, ఆ శాఖ 30 రోజుల్లోగా దానిపై స్పందించాలని మాథుర్ ఆదేశించారు. మాల్యా వ్యవహారంపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పదే పదే బహిరంగ ప్రకటనలు చేస్తున్నా గత రెండేళ్ళలో దీనిపై సమాచారం వెల్లడించడానికి ఆర్థిక శాఖ ఎలాంటి చర్యా తీసుకోలేదు. మాల్యా తీసుకున్న రు.7వేల కోట్ల రుణాన్ని రద్దు చేయలేదని 2016 నవంబరులో జైట్లీ చెప్పారు. 2017 ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో జైట్లీ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం మాల్యాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. అదే నెల చివరిలో, లండన్ పర్యటనలో మాల్యా గురించి పరోక్షంగా ప్రస్తావిస్తూ, రుణాలు ఎగవేతదారుల విషయాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటోందని, బ్రిటన్ ప్రభుత్వంతో ఈ విషయంపై చర్చిస్తామని చెప్పారు. ఈ కేసు గురించి అన్ని వివరాలు తనకు బాగా తెలుసున్నట్లు ఆర్థిక మంత్రి చెబుతుండగా, మరోపక్క ఆర్థిక మంత్రిత్వ శాఖ, కేంద్ర సమాచార కమిషన్ ముందు చేస్తున్న వాదనల్లో వేరే రకంగా సంకేతాలు ఇస్తోంది. మాల్యా భారత్ నుండి పారిపోయిన కొద్ది రోజులకే 2016 మార్చిలో రాజీవ్ ఖరే ఆర్‌టిఐ దరఖాస్తు పెట్టారని మాథుర్ తెలిపారు. దానిపై ఆర్థిక శాఖ సిపిఐఓ ఏప్రిల్ 18న స్పందించింది. ఆ సమాధానం దరఖాస్తుదారుని ఏవిధంగానూ సంతృప్తిపరచ లేదని, తనకెలాంటి సమాచారం ఇవ్వలేదని రాజీవ్ చెప్పారని మాథుర్ తెలిపారు. ఈ విషయమై ఈ ఏడాది జనవరి 29న జరిగిన విచారణలో ఖర్ మాట్లాడుతూ, ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఎ), 8(1)(జె) కింద తనకు సమాచారం ఇవ్వడానికి ఆర్థిక శాఖ తప్పుగా నిరాకరించిందని చెప్పారు. తనలాంటి వ్యక్తులు రుణాలు తిరిగి చెల్లించలేకపోతే బ్యాంకులు తమపై కఠిన చర్యలు తీసుకుంటాయని, బ్యాంక్ నోటీసు బోర్డులో రుణాల ఎగవేతదారుల పేర్లు, ఫోటోలు వుంచుతారని ఖరే పేర్కొన్నారు. విస్తృత ప్రజా ప్రయోజనాల రీత్యా తాను ఈ సమాచారం కోరుతున్నానని, వెంటనే తనకు అందచేయాలని కోరారు. దానిపై స్పందించిన ఆర్థిక శాఖ, ఖరే అడిగిన సమాచారం తమ వద్ద లేదని తెలిపింది. బహుశా ఈ సమాచారం సంబంధిత బ్యాంకులు లేదా ఆర్‌బిఐ వద్ద లభించివచ్చని తెలిపింది.

**సంక్షిప్తం**

## పాక్‌కు ధీటైన సమాధానమిస్తాం

**న్యూఢిల్లీ :** పాక్‌కు ధీటైన సమాధానం ఇవ్వడాన్ని భారత్ కొనసాగిస్తుందని ఆర్మీ వైస్ చీఫ్ శరత్ చంద్ సోమవారం అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖపై ఆదివారం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ బలగాలు జరిపిన కాల్పుల్లో నలుగురు సైనికులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంత్రణ రేఖపై ఉగ్రవాదుల చొరబాట్లకు పాక్ సైన్యం మద్దతిస్తోందని అన్నారు. పాకిస్తాన్‌కు ధీటైన సమాధానమిస్తూనే ఉంటామని, ఇకపై తాము మాట్లాడమని, తమ చర్యలే మాట్లాడతాయని వ్యాఖ్యానించారు.

## కూరగాయల ప్రాధాన్యత నరేంద్రమోడీ విస్మరించారు

**న్యూఢిల్లీ :** బిజెపిని విమర్శిస్తూ పిఒటి(పొటాటో,ఆనియన్, టమాట) అనే పదాన్ని కర్ణాటక కాంగ్రెస్ నేత దివ్య స్పందన(రమ్య) ట్వీట్ చేశారు. కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్రమోడీ టిఒపి (టమాటా, ఆనియన్, పొటాటో) రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రసంగించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందిస్తూ తను ఆశ్చర్యానికి గురయ్యాయని, ఎందుకంటే నరేంద్రమోడీ కూరగాయల ప్రాధాన్యతను విస్మరించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తరపున సోషల్ మీడియా ప్రచార బాధ్యతలు దివ్య నిర్వహిస్తున్నారు.

## జమ్ముకశ్మీర్‌లో పంచాయతీ ఎన్నికలు వాయిదా

**శ్రీనగర్ :** జమ్ము కశ్మీర్‌లో ఫిబ్రవరి 15న జరిగాల్సిన పంచాయతీ ఎన్నికలను వాయిదా వేశారు. ప్రస్తుతం కాశ్మీర్లోని అనేక ప్రాంతాల్లో ప్రతికూల భద్రతా పరిస్థితుల కారణంగా అఖిల పక్ష సమావేశానంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ నిర్ణయాన్ని పాలక పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (పిడిపి) భాగ్యస్వామ్య పక్షమైన బిజెపి వ్యతిరేకించింది. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరపాలని బిజెపి కోరుతోంది. కశ్మీర్‌లో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ముఖ్యమంత్రి మోహబూబా ముఫ్తీ నిర్ణీత కాలం పాటు ఎన్నికలను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నారు.

## శీతాకాలం ఒలింపిక్స్‌లో 36 వేల మంది విదేశీయులకు నో ఎంట్రీ

**సియోల్:** శుక్రవారం నుండి ప్రారంభం కానున్న శీతాకాలం ఒలింపిక్స్ క్రీడలకు వస్తున్న 36 వేల మంది విదేశీయులకు అనుమతిని నిరాకరిస్తున్నట్లు ద.కొరియా ప్రకటించింది. దేశ భద్రతా కారణాల రీత్యా వీరి ప్రవేశంపై నిషేధం విధిస్తున్నట్లు ద.కొరియా ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ అధికార యోనాప్ వార్తా సంస్థ వెల్లడించింది. ఒలింపిక్స్ నేపథ్యంలో కొందరు విదేశీయులు ఉగ్రవాద దాడులకు పాల్పడే అవకాశం వున్నట్లు నిఘా వర్గాలు చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఈ నిషేధం విధించినట్లు ద.కొరియా ప్రభుత్వ ప్రతినిధి ఒకరు వివరించారు.



నిరసన ప్రదర్శన

**పేరుమార్పు విషయంలో పక్కనున్న మాసిడోనియాతో తలెత్తిన వివాదంలో వెనక్కుతగ్గవద్దంటూ లక్షలాది మంది గ్రీకు ప్రజలు ఆదివారం అథెన్స్‌లో ప్రదర్శన జరిపారు.**

## కోస్టారికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరికీ దక్కని మెజారిటీ

**శాన్‌జోస్ :** కోస్టారికా అధ్యక్ష ఎన్నికల్లో ఇవాంగ్లికల్ అభ్యర్థి ఫాబ్రిసియో అల్వారాడో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అయితే మరో రెండు నెలల్లో జరగబోయే రనాఫ్ ఎన్నికను నివారించేందుకు అవసరమైన మెజారిటీ సాధించడంలో విఫలమయ్యారు. ఇప్పటివరకు 58శాతం ఓట్లు లెక్కించగా, అల్వారాడోకు 25.6శాతం ఓట్లు లభించాయి. తర్వాత స్థానాల్లో వున్న ఇద్దరు అభ్యర్థులకు పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. రెండో స్థానంలో వున్న సిటిజన్స్ యాక్షన్ పార్టీకి చెందిన కార్లోస్ అల్వారాడోకి 20.6శాతం ఓట్లు రాగా మూడవ స్థానంలోవున్న నేషనల్ లిబరేషన్ పార్టీకి చెందిన ఆంటోనియో అల్వారెజ్‌కు 19.2శాతం ఓట్లు లభించాయి. మొత్తంగా 13మంది అభ్యర్థులు రంగంలో వుండగా వారిలో ఏ ఒక్కరికీ 40శాతానికి పైగా ఓట్లు రాని పక్షంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ఏప్రిల్ 11న రెండో దఫా ఓటింగ్ జరుగుతుంది. గే వివాహం ఈ ఎన్నికల్లో ప్రధానాంశంగా మారింది. స్వలింగ సంపర్కుల వివాహం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసిన ఫాబ్రిసియో అల్వారాడోకు ఒపీనియన్ పోల్స్‌లో ప్రథమ స్థానం లభించింది. కోస్టారికాలో మూడింట రెండు వంతుల మంది ప్రజలు గే వివాహాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే, మూడో వంతు కన్నా ఎక్కువ మంది ప్రజలు ఇంకా ఈ విషయంలో అనిశ్చితిగానే వున్నారని సర్వేల్లో వెల్లడైన నేపథ్యంలో రనాఫ్ జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## సైప్రస్ అధ్యక్షుడిగా రెండోసారి నికొస్ ఎన్నిక

**నికోసియా :** సైప్రస్ అధ్యక్షుడిగా నికొస్ అనస్టాసిడెస్ రెండోసారి ఎన్నికయ్యారు. 2013లో అధ్యక్షుడిగా ఎన్నికైన కొద్ది రోజులకే తలెత్తిన ఆర్థిక మాంద్యాన్ని అదుపు చేయడంలో ఆయన చేసిన కృషికి గానూ ప్రజలు ఈసారీ ఆయనకే పట్టం కట్టారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో కన్జర్వేటివ్‌లకు 56శాతం ఓట్లు రాగా, వామపక్షాల మద్దతు వున్న స్టావ్‌రోస్ మలాస్‌కు 44శాతం ఓట్లు లభించాయి. మనం మరింత ఐక్యతతో ముందుకు సాగాల్సి వుందని, ఆ పయనం ఇప్పుడే ప్రారంభమవుతోందని నికొస్ వ్యాఖ్యా నించారు. ఫలితాలు వెలువడిన వెంటనే మద్దతుదారుల హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సైప్రియాట్ల అధ్యక్షుడిగా తాను కొనసాగుతానన్నారు. ఇందు లో విజేతలు, పరాజితలు అంటూ ఎవరూ లేరు. సైప్రస్ మనందరిదీ అని ఆయన పేర్కొన్నారు.

## ఆరోగ్య సంరక్షణ కోరుతూ

# లండన్‌లో వేలాదిమంది ప్రదర్శన

**లండన్ :** జాతీయ ఆరోగ్య సేవ (ఎన్‌హెచ్‌ఎస్) కార్యక్రమానికి మద్దతుగా లండన్‌లో శనివారం వేలాదిమంది ప్రదర్శన నిర్వహించారు. పీపుల్స్ అసెంబ్లీ, హెల్త్ కేంపైన్స్ టుగెదర్ కొయిలేషన్ అనే సంస్థలు కలిసి ఈ ప్రదర్శన నిర్వహించాయి. సెంట్రల్ లండన్ నుండి డౌనింగ్ స్ట్రీట్ వరకు సాగిన ఈ ర్యాలీ నిర్వహణలో పీపుల్స్ అసెంబ్లీకి బ్రిటన్‌లోని రెండు అతిపెద్ద కార్మిక సంఘాలు, గ్రీన్ పార్టీ మద్దతు వుండగా, ఎన్‌హెచ్‌ఎస్‌కి మద్దతుగా వివిధ స్థానిక సంస్థలు, గ్రూపులు నిలిచాయి. మౌలిక నిధులు, వనరులు కొరత కారణంగా ప్రజలకు ఆరోగ్య సంరక్షణ లభించడం లేదు. దాంతో ఈ శీతాకాల సమయంలో ఆరోగ్య రంగంలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. అటువంటి తరుణంలో ఇంకా నిధుల్లో కోతలు విధించడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఎస్ మరిన్ని నిధులు కల్పించాలని, ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి ప్రజలు చెప్పేది ప్రభుత్వం వినాలని ప్రదర్శకులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్ష నేత జెరెమి కార్బిన్ మాట్లాడుతూ, ఎన్‌హెచ్‌ఎస్ కోసం లేబర్ పార్టీ పోరాడుతుందని చెప్పారు. టోరీల ప్రైవేటీకరణను అంతం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు.




## ద.కొరియాలో పర్యటించనున్న ఉ.కొరియా అగ్రనేత

**సియోల్:** మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న శీతాకాలం ఒలింపిక్స్ అనంతరం ఉభయ కొరియాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరగనున్న నేపథ్యంలో ఉ.కొరియా పార్లమెంట్ స్పీకర్ కిమ్‌యాంగ్ నామ్ ఈ వారంలో ద.కొరియాలో పర్యటించనున్నారు. స్పీకర్ కిమ్‌యాంగ్ నామ్ నేతృత్వంలోని 22 మంది సభ్యుల ప్రతినిధి బృందం మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం ఇక్కడకు చేరుకుంటుందని ద.కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ వివరించింది. కాగా ఈ వార్తను ధృవీకరిస్తూ ఉ.కొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్ఎ శుక్రవారం నాడు ఒలింపిక్స్ ప్రారంభ వేడుకకు కిమ్ నేతృత్వంలోని ప్రతినిధి వర్గం హాజరవుతుందని వెల్లడించింది. ఈ నెల 9నుండి 25 వ తేదీ వరకూ జరుగనున్న శీతాకాలం ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో కేవలం ఉభయ కొరియాల మధ్య మాత్రమే కాక ఉ.కొరియా, అమెరికా మధ్య కూడా ఉన్నత స్థాయి చర్చలు జరుగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభ వేడుకకు అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, జపాన్ ప్రధాని షింజో అబే, ఇతర ప్రపంచ నేతలు హాజరు కానున్నారు. ఉభయ కొరియాల సాన్నిహిత్యానికి ప్రయత్నాలు ఊపందు కున్నాయని ద.కొరియా అధ్యక్షుడు మూన్‌జే ఇన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చేసిన ఫోన్ కాల్‌లో వివరించారు. ఈ ప్రయత్నాలకు అమెరికా ఉపాధ్యక్షు ని పర్యటన మరింత ఊతమివ్వగలదని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇదిలా వుండగా శీతాకాలం ఒలింపిక్ క్రీడల ప్రక్రియను ఉ.కొరియా తన ప్రచారానికి అనుకూలంగా మల్చుకునేందుకు ప్రయత్నిస్తున్నదని, దీనిని అడ్డుకునేందుకే పెన్స్ క్రీడల ప్రారంభ వేడుకలకు హాజరవుతున్నారని వైట్‌హౌస్ అధికారి ఒకరు చెప్పారు.

## రోహింగ్యా సంక్షోభంతో ప్రాంతీయ భద్రతకు చేటు

- ఐరాస హెచ్చరిక

**జకార్తా (ఇండోనేసియా):** రోహింగ్యా ముస్లిం మైనార్టీలపై మయన్మార్ ప్రభుత్వం ప్రారంబిం చిన సైనిక చర్య ఆసియా ప్రాంతీయ భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం వుందని ఐరాస మానవ హక్కుల కమిషన్ చీఫ్ జీడ్‌రాద్ అల్ హుస్సేన్ హెచ్చరించారు. సోమవా రం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రోహింగ్యాలను తుడిచి ఎట్టేందుకు మయన్మార్ ప్రభుత్వం చేపట్టిన హింసాత్మక సైనిక చర్యతో దాదాపు పదిలక్షల మందికి పైగా రోహింగ్యాలు పొరుగునే వున్న బంగ్లాదేశ్‌కు వలస బాట పట్టారన్నారు. మయన్మార్ ప్రభుత్వం ఇప్పుడు ఎదుర్కొంటున్న ఈ తీవ్ర సంక్షోభం ప్రాంతీయ భద్రతపై పెను ప్రభావాన్ని చూపే అవకాశం వుందని ఆయన హెచ్చరించారు. ఈ రోజు జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలు రేపటి యుద్ధాలకు నాంది అవుతున్నాయని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కొనసాగుతున్న రోహింగ్యాల సంక్షోభం మత ప్రాతిపదికన ఘర్షణ రూపం దాలిస్తే, తరువాత చెలరేగే వివాదాలు ఈ ప్రాంతం మొత్తానికి ప్రమాదకరంగా మారుతాయన్నారు.



మయన్మార్‌లోని రఖినే రాష్ట్రంలో గత ఆగస్టులో ప్రారంభమైన శరణార్థుల వెల్లువ అక్కడ ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వివక్షకు, హింసాకాండకు పరాకాష్ట అని ఆయన వ్యాఖ్యానించారు.

# సింగపూర్ ఎయిర్ షో

### ఆయుధాల అమ్మకానికి అమెరికా తహతహ

**బీజింగ్ :** ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన అయిన సింగపూర్ ఎయిర్ షోలో అమెరికా ఆయుధాల అమ్మకాలను పెంచడానికి కృషి చేస్తామని ఆయుధ అమ్మకాలను పర్యవేక్షించే అమెరికా ఉన్నతాధికారి చెప్పారు. సింగపూర్ ఎయిర్ షోలో చైనా ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఎఫ్-35 యుద్ధ విమానాలు వంటి అమెరికా తయారీ ఆయుధాలను ఆగ్నేయాసియా ప్రభుత్వాలు కొనుగోలు చేసేలా ప్రోత్సహించేందుకు అమెరికా ప్రతినిధి బృందం శాయశక్తులా కృషి చేస్తుందని అమెరికా రాయబారి టినా కైదనొవ్ తెలిపారు. అమెరికా ప్రాభవం తగ్గుతోందనే భావనను తోసిపుచ్చడానికి ఆమె ప్రయత్నించారు. చైనా ప్రభావానికి అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించాలంటూ డిసెంబరులో ట్రంప్ ప్రభుత్వం కొత్త జాతీయ భద్రతా వ్యూహాన్ని తీసుకువచ్చింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ప్రాబల్యాన్ని, ఉనికిని మరింత పటిష్టపరచాల న్నది దాని యోచన. వియత్నాం వంటి మాజీ శత్రు దేశాలను ఆయుధాల అమ్మకాలతో, బదిలీలతో ఆకట్టుకునేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోంది. మరోవైపు మానవ నిర్మిత దీవుల్లో విస్తృతమైన నిర్మాణ ప్రాజెక్టులతో దక్షిణ చైనా సముద్రంలో తన బలాన్ని చైనా పటిష్టపరుచుకుంటోంది. వియత్నాంకు సంఘీభావంగా విమాన వాహక నౌకను పంపాలని భావిస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి జిమ్ మాటిస్ వియత్నాంలో పర్యటన సందర్భంగా ప్రకటించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే కైదనొవ్ హనోయ్ సందర్శించారు.


## ఓడ ద్వారా దక్షిణ కొరియాకు చేరనున్న ఆర్ట్ బృందం

**ప్యోంగ్యాంగ్ :** ఉత్తర కొరియా ఆర్ట్ బృందం ద్వైపాక్షిక ఆంక్షల మినహాయింపుతో దక్షిణ కొరియాకు ఓడద్వారా ప్రయాణించి వెళ్లనున్నట్లు ఉత్తర కొరియా ఏకీకరణ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. ఈ బృందం ఈ వారంలో మొదలు కానున్న వింటర్ ఒలింపిక్స్‌లో ప్రదర్శనలివ్వనున్నట్లు పేర్కొన్నారు. రష్యా మన్‌గ్యోన్‌గ్బాంగ్ 92 ఫెర్రీని రవాణా, బసల కొరకు ఉపయోగించ డానికి ప్రతిపాదించినట్లు ఉత్తర కొరియా రవాణా మంత్రిత్వశాఖ అధికారి బైక్ తై హ్యూన్ పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## అంతా అందులోనే

వెనుకబడిన జిల్లాలకు నిధులు కూడా సమకూర్చే పరిస్థితి ఉంటుందని వారు చెబుతున్నారు. అయితే గత రెండేళ్లలో ఇలా కేటాయించిన నిధుల నుంచి రాష్ట్రానికి వచ్చిన వాటా చూస్తే ఆందోళన కలగకమానదు. 2016-17లో రూ.10,900 కోట్లు కేటాయించగా, అందులో రాష్ట్రానికి ఆదాయ లోటు కింద 1170 కోట్లు, రాజధాని నిర్మాణానికి 450 కోట్లు, ఏడు జిల్లాల అభివృద్ధికి 350 కోట్లు వచ్చాయి. ఇక 2017-18లో రూ.11 వేల కోట్లు కేటాయించగా, అందులో ఇప్పటివరకు ఒక్క పైసా కూడా రాలేదని అధికారులు చెబుతున్నారు. అది కూడా వార్షికాంతానికి ఈ మొత్తాన్ని సవరణ అంచనాల ద్వారా కేవలం రూ.7500 కోట్లకు కుదించినట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందుకే చివరి రెండు నెలల్లో కూడా ఎన్ని నిధులొస్తాయన్నది చెప్పలేకపోతున్నామని వారు విశ్లేషిస్తున్నారు. ఇక కొత్త బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించగా, దానిపైనా పెద్దగా ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి లేదని వారు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కొత్త బడ్జెట్‌లో రాజధాని నిర్మాణం, లోటు నిధులకు ఎటువంటి కేటాయింపులూ లేవు. ఒకవేళ వస్తే 15 వేల కోట్ల రూపాయల ప్రత్యేక సాయం కిందనే రావాల్సి ఉంటుందని, అది కూడా అతి తక్కువ మొత్తంలో మాత్రమేనని అధికారులు అంటున్నారు. ఈ నిధులతో ఎలా సర్దుకుపోవాలని ఒక అధికారి ప్రశ్నిస్తున్నారు. కేంద్రంతో మరోసారి చర్చించేందుకుగాను శాఖల వారీగా వచ్చిన కేటాయింపుల్ని అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. శాఖల వారీ వివరాల్ని ఈ నెల 7లోగా ప్రణాళికాశాఖకు పంపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అన్ని శాఖల ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. ఆ తరువాత రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఒక స్పష్టత వస్తుందని, అనంతరం కేంద్రంతో మాట్లాడేందుకు అవకాశముంటుందని ఆయన భావిస్తున్నారు.



**ప్రధాని నరేంద్ర మోడీ 'పకోడి' వ్యాఖ్యలను నిరసిస్తూ బెంగళూరులో పకోడీలు తయారుచేసి అమ్ముతున్న నిరుద్యోగ యువత**

## పకోడ ఉద్యోగాలు

పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం వుందని అన్నారు. పకోడీలు అమ్ముకోవడమంటే స్వయం ఉపాధితో బతుకుతున్నారని, అటువంటి వారిని బిచ్చగాళ్ళతో పోలుస్తారా అని ప్రశ్నించారు. రాజ్యసభలో ప్రధాని మోడీ పక్కనే కూర్చున్న అమిత్ షా ప్రభుత్వం సాధించిన విజయాలను ఏకరవు పెట్టారు. మోడీ ప్రభుత్వం చారిత్రక పనులను చేపట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వాలు విధానపరమైన పక్షవాతంతో ఇబ్బందులు పడ్డాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియచేసే తీర్మానంపై చర్చను ప్రారంభించిన షా, ఉద్యోగాలపై మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం చేసిన వ్యాఖ్యను తీవ్రంగా తప్పు పట్టారు. ఈ దేశంలో నిరుద్యోగ సమస్య వుంది, దాన్ని కాదనడం లేదు. అయితే, మీరు 55 ఏళ్ళు పాలించిన తర్వాత కూడా నిరుద్యోగం వుందంటే దీనికి ఎవరు బాధ్యులని తాను ప్రశ్నించాలనుకుంటున్నానని అన్నారు. గతంలో, ప్రస్తుతం కలిసి ఎనిమిదేళ్ళు పనిచేయడానికి తమకు అవకాశం లభించిందని, కేవలం ఈ స్వల్ప కాలంలోనే నిరుద్యోగ సమస్య ఇంతలా నెలకొనదని షా పేర్కొన్నారు. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అనడాన్ని ప్రస్తావిస్తూ, ఇదేమైనా దోపిడీనా? అని ప్రశ్నించారు. జిఎస్‌టి అనేది అతిపెద్ద సంస్కరణ అని అన్నారు. నూతన జాతీయ పన్ను విధానం అమలును విజయవంతం చేయాలని ఆయన అన్ని పార్టీలను కోరారు. రాజకీయాలు చేయడానికి ఇంకా చాలా ప్రదేశాలు వున్నాయని, ఇక్కడ (పార్లమెంట్) కాదని అన్నారు.

**మోడీ పకోడాలు : కర్నాటకలో వినూత్న నిరసన**

ప్రధాని నరేంద్రమోడీ 'పకోడీ' వ్యాఖ్యలకు బెంగళూరులో కొందరు విద్యార్థులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఉద్యోగ కల్పనలో కేంద్రం విఫలమవుతుందన్న ప్రశ్నకు ప్రధాని నరేంద్రమోడీ పకోడీలు అమ్ముకోవటం కూడా ఉద్యోగ కల్పనలో భాగమేనని, రోజుకు రూ.200 సంపాదించినా నిరుద్యోగ సమస్యను రూపుమాపినట్లేనని సమాధానమిచ్చిన సంగతి తెలిసిందే. కాగా, ఈ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే బెంగళూరులో కొందరు విద్యార్థులు మెహ్‌క్రి సర్కిల్ వద్దకు చేరుకుని 'మోదీ పకోడా, అమిత్ షా పకోడా, వై రెడ్డి(యాడ్యురప్ప) పకోడా' అంటూ పకోడాలు అమ్మసాగారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

# కలిసికట్టు నాటకం.. ఉత్తుత్తి పోరాటం

మొదటి పేజీ తరువాయి

రాశారు. అదే లేఖలో రాజధాని నిర్మాణానికి 42వేల కోట్లు ఖర్చవుతాయని, కేటాయించాలనీ విజ్ఞప్తి చేశారు. ఇంతవరకు వచ్చింది రూ.2500 కోట్లు మాత్రమే. దీనిపై ముఖ్యమంత్రి నోరెత్తలేదు. ప్రతిపక్షాలను తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి చేయలేదు. ఎవరైనా హోదా కోసం ఆందోళన చేస్తుంటే రాజకీయ లబ్ధిగా వర్ణించడం మినహా మూడేళ్లుగా కేంద్రంపై ఎటువంటి ఒత్తిడి చేయకపోవడం ఏమిటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2016, 2017, 2018 బడ్జెట్లను వరుసగా పరిశీలిస్తే రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, అడిగినన్ని నిధులివ్వలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చల్లబడిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి శ్రేణులు బిజెపి శ్రేణులపై నిప్పులు చెరిగారు. మూడు రోజుల అనంతరం మళ్లీ చెట్టాపట్టాలేసుకుని తిరిగేశారు. ప్రస్తుత బడ్జెట్ అనంతరం తంతు కూడా అదేనని, కొత్తగా ఏమీ లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు. అయితే ఈ ఏడాది కొత్తగా బిజెపి, టిడిపి మధ్య తగవును ముందుకు తీసుకొచ్చారు. పార్లమెంటులో బడ్జెట్ ప్రకటన రాగానే అన్యాయం జరిగిందని సిఎం, ఇతర మంత్రులు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం శ్రేణులు రగిలిపోతున్నారని, అయినా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కలిసి ఉన్నందున ఏం మాట్లాడలేకపోతున్నామని మీడియాకు లీకులిచ్చారు. ఢిల్లీలో పార్లమెంటు సభ్యులు కూడా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీనాయకులతో సమావేశం, క్యాబినెట్, ఎంపిలతో సమావేశం అనంతరం పార్లమెంటులో నిరసన వ్యక్తం చేయాలని, జరిగిన నష్టాన్ని కేంద్రానికి విన్నవించాలని పార్టీ తరుపున ప్రకటించారు. దీనిపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, తట్టుకోలేక పోతున్నానని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు చల్లబడ్డారని ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ ప్రశ్నించారు. ఉత్తరాంధ్రకు ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వలేదని, కనీసం రైల్వేజోన్ విషయంలోనూ ఇదే జరిగిందని ఆయన ఇటీవల ఢిల్లీలో అన్ని పార్టీల నాయకులకూ వినతిపత్రాలు సమర్పించారు. అటు బిజెపి కూడా గత బడ్జెట్ సమయంలో రాష్ట్రానికి న్యాయం చేస్తామని చెప్పింది.

అమిత్‌షా వచ్చి సుమారు లక్ష కోట్లు కేటాయించామని చెప్పారు. సంస్థలు ఇచ్చామనీ తెలిపారు. వాటన్నిటికీ కలిపి రూ.420 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే ఈ మూడేళ్లుగా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కేంద్రంపై ఒత్తిడి తేవడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. బిజెపి కూడా నిధులు కేటాయింపు విషయంలో అన్యాయం చేస్తూ అభివృద్ధి గురించి మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు చేస్తూ నష్టం జరిగిందనే విషయంపై ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయి. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యాఖ్యాలే దీనికి ఉదాహరణని, నిధులు కేటాయింపుపై నోరెత్తకుండా వ్యక్తిగత విమర్శలతో ప్రజలను పక్కదారి పట్టించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడి వెనుదిరిగారు. కేంద్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి ఈ ఆందోళనకు డుమ్మా కొట్టారు. అశోక్ గజపతి రాజు దూరం నుంచే చూస్తూ ఉండిపోగా, సుజనా చౌదరి ఆ ఛాయలకే రాలేదు. అలాగే మిగిలిన 13 మంది టిడిపి ఎంపిలు కూడా ఆందోళనలో పాల్గొనలేదు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన ఇద్దరు ఎంపిలు కూడా ఈ ఆందోళనకు దూరంగా వున్నారు. అనంతరం లోక్‌సభ సమావేశంలో పాల్గొన్నప్పటికీ, విభజన హామీలపై నోరు మెదపలేదు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అధికార బిజెపి ఎంపి హుకుమ్ సింగ్ మృతికి నివాళులర్పించి సభ మంగళవారానికి వాయిదా పడింది.

**రాజ్‌నాథ్‌తో భేటీ: విభజన హామీలపై వినతి**

అనంతరం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యేందుకు కేంద్ర మంత్రులు సుజనా, అశోక్, టిడిపి ఎంపిలు అపాయింట్‌మెంట్ కోరగా, జైట్లీ సిఐఐ సదస్సులో ఉండటంతో ఆయనను కలిసేందుకు అవకాశం లభించలేదు. దీంతో హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆయన కార్యాలయంలో సుజనా చౌదరి, అశోక గజపతి రాజు, ఎంపిలు తోట నరసింహం, నిమ్మల క్రిష్టప్ప, కె.రామ్మోహన్ నాయుడు కలిసి దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. విభజన హామీలు, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, బడ్జెట్ కేటాయింపులు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అనంతరం మంత్రులు, ఎంపిలు మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

**రాజ్యసభలో కాంగ్రెస్ ఆందోళన..మద్దతివ్వని టిడిపి**

విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు రాజ్యసభలో ఆందోళన చేపట్టారు. కెవిపి రామచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీలు తమ స్థానాల్లో నిల్చుని నినాదాలు చేశారు. కాంగ్రెస్ నేతలు ఆందోళన చేస్తూంటే టిడిపి సభ్యులు కనీసం సంఘీభావంగానైనా నిలబడలేదు. తమ స్థానాల్లోనే కూర్చోని ఉండిపోయారు. కాంగ్రెస్ సభ్యుల ఆందోళనల మధ్య సభా కార్యకలాపాలకు అడ్డుతగలొద్దని, సభ నిర్వహణకు సహకరించాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు కోరినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ ఎంపి కెవిపి రామచంద్రరావును పలుసార్లు తన సీటు వద్దకు వెళ్లి కూర్చోవాలని వెంకయ్య కోరారు. అయినప్పటికీ కెవిపి తన నిరసనను ఆపకపోవడంతో, వెంకయ్యనాయుడు అసహనం వ్యక్తం చేశారు. ఈ నిరసనల మధ్య రాజ్యసభను వెంకయ్యనాయుడు రెండు గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కెవిపి తన ఆందోళన కొనసాగించారు "ఏపికి న్యాయం చేయాలి" ప్లకార్డు ప్రదర్శిస్తూ ఛైర్మన్ పోడియం వద్ద ఆందోళనకు దిగారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ "ఆదివారం జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం తీవ్రమైన పోరాటం చేస్తామని టిడిపి చెప్పింది. కానీ అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్ర ప్రయోజనాల గురించి చంద్రబాబు ఇప్పటికైనా పట్టించుకుంటే ప్రజలు అదష్టవంతులు అవుతారు. చంద్రబాబుకు ఆగ్రహం వచ్చినదని, పళ్ళు పటపట కొరికారని, గడ్డం పెంచాడని ఇలాంటి లీకులతో కాలక్షేపం చేస్తున్నారు. పోలవరం కాంట్రాక్టుల కోసం, ఖర్చు లేకుండా బిల్లులు ఆమోదించడం కోసం, రాష్ట్ర ప్రయోజనాల తాకట్టు పెడుతున్నారు. ఈ సారైనా ప్రజలను వంచించకుండా ఉంటారని ఒక ఆంధ్ర పౌరుడిగా నేను ఆశిస్తున్నా. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు కాపాడే భాగంగా ఒక స్వల్పకాలిక చర్చకు నోటీస్ ఇచ్చాను. కేంద్ర బడ్జెట్‌లో ఏపి కేటాయింపులపై ప్రజలకు స్పష్టం చేయాలని కోరుతూ సావధాన తీర్మాన నోటీస్ కూడా ఇవ్వడం జరిగింది. రాజ్యసభ ఛైర్మన్ విశాలమైన దక్పథంతో, రాజకీయ పరిణితితో ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలను ఆకాంక్షిస్తారని, నోటీసులను సభలో ప్రవేశ పెట్టడానికి ఆమోదం తెలియజేస్తారని ఆశిస్తున్నాను. రాజ్యసభలో ఒక అర్థవంతమైన చర్చ జరిగి, ఏపి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆశిస్తున్నాను" అని కెవిపి అన్నారు.

**ఉభయ సభల్లో నోటీసులు**

విభజన హామీలపై చర్చ చేపట్టాలని పార్లమెంట్ ఉభయ సభల్లో కాంగ్రెస్, టిడిపి, వైసిపి ఎంపిలు నోటీసులు ఇచ్చారు. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కుఇచ్చిన నోటీసులో టిడిపి ఎంపిలు తోట నరసింహం, కేశినేని నాని, నిమ్మల కిష్టప్ప విభజన హామీల అమలుపై 193వ నిబంధన కింద చర్చ చేపట్టాలని పేర్కొన్నారు. విభజన హామీల అమలుపై 184వ నిబంధన కింద చర్చ చేపట్టాలని వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి నోటీసులు ఇచ్చారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కెవిపి రామచంద్రరావు, వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి 180 నిబంధన కింద చర్చ చేపట్టాలని నోటీస్‌లు ఇచ్చారు. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలపై కెవిపి, విజయసాయి రెడ్డి సావదాన తీర్మాన నోటీసులిచ్చారు.

## 8వ తేదీ బంద్‌కు పెరుగుతున్న మద్దతు

మొదటి పేజీ తరువాయి

ముందుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. ఎనిమిదో తేదీ వరకు ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపట్టా లని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి పిలుపు నిచ్చారు. బంద్‌కు వైఎస్ఆర్‌సిపి కూడా సోమవారం మద్దతు ప్రకటించింది. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్, విశాఖ రైల్వే జోన్, దుగ్గరాజుపట్నం పోర్ట్, కడప ఉక్కు పరిశ్రమ తోపాటు విభజన చట్టంలోని హామీల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని... వీటిపై ఏ పార్టీ ఆందోళన చేసినా తాము మద్దతిస్తామని వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి అనుగుణం గానే వామపక్షాలు ప్రకటించిన బంద్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆ పార్టీ తెలిపింది. మరోవైపు వివిధ వర్గాలకు చెందిన సంఘాలు కూడా బంద్‌కు మద్దతు తెలుపు తున్నాయి. విజయవాడలోని దాసరిభవన్‌లో ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు సంఘాల నేతలు సోమవారం మీడియాతో మాట్లా డుతూ బంద్‌కు మద్దతు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమైనదని, దగా కోరుగా వుందని విమర్శించారు. కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగానూ, కార్మిక వర్గాలకు నష్టం చేకూర్చేదిగానూ వుందని మండిపడ్డారు. 50కోట్ల మంది కార్మికుల ఆశలపై నీళ్లు పోసిందని వాపోయారు. 5కోట్ల మంది ఆంధ్రులకు ద్రోహం చేసేలా కేంద్ర బడ్జెట్ వుందని విమర్శిం చారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని, ఎపికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కేంద్రప్రభుత్వ విద్యారంగ సంస్థలు నిర్మాణానికి నిధుల కేటాయింపులో మొండిచేయి చూపిందని విమర్శించారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఊసేలేదని వాపోయారు. నాలుగేళ్ల నుంచి తన స్వార్థ ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వానికి సిఎం చంద్రబాబు కొమ్ముకాస్తు న్నారని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయిం పులలో పూర్తిగా వివక్షత కొనసాగిందని, దీనిపై మోడీని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ప్రజల శ్రేయస్సు కంటే అధికార దాహమే చంద్ర బాబుకు అధికంగా వుందని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజ నాలపై ఏ మాత్రం చిత్తశుద్ధి వున్నా బంద్‌ను అడ్డుకోకుండా మద్దతు పలకాలని తెలిపారు. బంద్‌కు భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం హక్కుల్ని సాధించడంలో ఘోరంగా విఫలమయ్యిందని ఆ కమిటీ నాయకులు విమర్శిం చారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవని, రుణమాఫీ సక్రమంగా అమలు కాలేదని చెప్పారు.

దళితులపైన దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. భూముల్ని పేదలనుండి బల వంతంగా లాక్కుంటున్నారన్నారు. 2013 భూసేకరణ చట్ట సవరణకు పూనుకున్నారన్నారు. వీటన్నింటికోసం రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు, ప్రజలు ఈ నెల 8న జరిగే రాష్ట్ర బంద్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. బంద్ రోజు గ్రామాల నుంచి ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లతో రైతాంగం, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వీరితోపాటు బంద్‌కు విద్యార్థి, జర్నలిస్టు సంఘాలు కూడా మద్దతు తెలిపాయి.

## పోలవరం 50శాతం పూర్తి

మొదటి పేజీ తరువాయి

మీటర్ల మేర డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం ఈ వారం రోజుల్లో చేపట్టినట్లు సిఎంకు వివరించారు. పోలవరం నిర్మాణం కోసం మొత్తం రూ.12,915.38 కోట్లు ఖర్చు చేయగా, ఇందులో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత రూ.7,779.52 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ మొత్తంలో గతేడాది డిసెంబర్ 31 వరకు కేంద్రం రాష్ట్రానికి రూ.4,329.06 కోట్లు ఇచ్చిందన్నారు. వరద మళ్లింపునకు సంబంధించి స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ చానల్, పైలెట్ ఛానల్ రేడియల్ గేట్ల ఏర్పాటు, డయాఫ్రమ్‌వాల్ తదితర పనులకు రూ.4,375.73 కోట్లు వ్యయం కానుందని అధికారులు అంచనా వేశారు. 2019 కల్లా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఇప్పటికే రూ.1,531 కోట్లు ఖర్చు చేయగా, మరో రూ. 2,844.20 కోట్లు అవసరముందని సిఎంకు చెప్పారు. సమీక్షలో జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కథ ఒకటే సినిమాలు రెండు


నితిన్


'మణికర్ణిక'లో కంగనా రనౌత్

కథ ఒకటే కానీ..సినిమాలు మాత్రం రెండు. ఒకటి బాలీవుడ్‌లోనూ, మరొకటి ఇండో-బ్రిటీష్ చిత్రంగానూ రూపొందుతున్నాయి. రెండు మూడు వారాల వ్యవధిలోనే ఈ రెండు చిత్రాలూ ప్రేక్షకుల ముందుకు రాబోతుండడం మరో విశేషం. ఆంగ్లేయులపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి గడగడలాడించిన వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత కథే ఈ రెండు చిత్రాల నేపథ్యం. ఇలా ఒకే కథను రెండు చిత్రాలుగా తీసిన సందర్భాలు తెలుగు చిత్రసీమలో కూడా ఉన్నాయి. 'దానవీర శూరకర్ణ', 'కురుక్షేత్రం'...ఈ రెండు ఒకే కథతో రూపొంది సంక్రాంతికి విడుదలయ్యాయి. అది అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఇప్పుడు బాలీవుడ్‌లో ఇదే పరిస్థితి ఎదురు కానుంది. కాకపోతే రెండూ బాలీవుడ్‌లో రూపొందకపోయినా ఇండో -బ్రిటీష్ సినిమాను కూడా హిందీలో విడుదల చేయబోతున్నారు.

సామాజిక సందేశంతో 'కంచె'ను రూపొందించి తన సత్తాను చాటిన జాగర్లమూడి రాధాకృష్ణ(క్రిష్) ఝాన్సీలక్ష్మీ బాయి జీవిత కథ ఆధారంగా బాలీవుడ్‌లో 'మణికర్ణిక' పేరుతో 125 కోట్ల బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. కంగనా రనౌత్ ఝాన్సీ పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రానికి సంబంధించిన ఫొటోలు కూడా సామాజిక మాధ్యమంలో లీకయ్యాయి. దీంతో సోషల్ మీడియాలో భారీ స్థాయిలో స్పందన లభించింది. ఫలితంగా అంచనాలు కూడా పెంచేసింది. జీ స్టూడియో 'మణికర్ణిక'ను నిర్మిస్తుంది. అతుల్ కులకర్ణి, సోనూసూద్, జిష్ను సేన్‌గుప్తా, అంకిత లోకనాథ్, వైభవ్ తత్వవాది తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ ఈ చిత్రానికి కథ అందించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు ప్రకటించారు. ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత కథ ఆధారంగా ఇండో- బ్రిటీష్ చిత్రం 'స్వర్డ్ అండ్ సెటర్' రానుంది. దీన్ని 'మణికర్ణిక'కు రెండు మూడు వారాల ముందే ప్రేక్షలకు ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. ఈ సినిమాను కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఈ చిత్రం షూటింగ్ మొదలైంది. ప్రస్తుతం పోస్టుప్రొడక్షన్ దశలో ఉంది. ఝాన్సీ బ్రిటీష్ వారితో పోరాటానికి సంబంధించిన యుద్ధ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయట. యుద్ధ సన్నివేశాల కోసం స్పెషల్ ఎఫెక్ట్స్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు చేస్తున్నారు. ఈ పనులు ఈనెలలో పూర్తయిపోతే మార్చిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి స్వాతి భిషే దర్శకత్వం వహిస్తున్నారు. దేవిక భిషే ఝాన్సీ లక్ష్మీబాయిగా కనిపించనుంది. జోధి మే విక్టోరి మహారాణి పాత్రను చేస్తుంది. కెయన్నే పెప్పర్ ప్రొడక్షన్, దునే ఫిల్మ్స్, శివ శక్తి ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నాయి.


'స్వర్డ్ అండ్ సెటర్'లో దేవిక భిషే

## ప్రేమ... కుటుంబం

నితిన్, మేఘా ఆకాష్ జంటగా ఓ సినిమా రూపొందుతోంది. ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. శ్రేష్ట్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. నిఖితారెడ్డి సమర్పణలో ఎన్.సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వం. హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ఇప్పటివరకూ షూటింగ్ జరుపుకుంది. ప్రేమకథలో సరికొత్తగా ఉండే విధంగా రూపొందుతోందని నిర్మాతలు తెలిపారు. అమెరికాలో జరిగిన షెడ్యూల్లో కీలక సన్నివేశాలు తీశామని చెప్పారు. దర్శకుడు కథనాన్ని ఆసక్తికరంగా మలిచేలా చేస్తున్నాడని ఇందులో పాటలు హైలైట్‌గా నిలుస్తాయి తెలిపారు. ఈనెల 12న ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేయనున్నారు. చిత్రం టీజర్‌ను ఈ నెల 14న, సినిమాను ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటుంది. ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రం ఇది.

## మెగా జెండా రెపరెపలే నా గుండె చప్పుడు

### – సాయి ధరమ్ తేజ్


సాయి ధరమ్ తేజ్, వి.వి.వినాయక్, లావణ్య త్రిపాఠి

"చిరంజీవి స్థాపించిన ఈ సామ్రాజ్యంలో జెండా రెపరెపలనే నా గుండె చప్పుడులుగా భావించి కష్టపడుతుంటాను. మెగాస్టార్, పవర్‌స్టార్, మెగా పవర్‌స్టార్, స్టైలిష్ స్టార్, వరుణ్ ఇలా అందరూ నాకు పంచభూతాలు" అని సాయి ధరమ్ తేజ్ అన్నారు. ఆయన హీరోగా లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. వినాయక్ దర్శకత్వం వహించారు. సి.కల్యాణ్ నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు.

సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ ' ఒక ఆర్టిస్ట్‌కు కంఫర్ట్ జోన్‌ను క్రియేట్ చేసి..సినిమాను గ్రాండ్‌గా తెరకెక్కించడానికి వెనుకాడని సి.కల్యాణ్‌కి థాంక్స్. మంచి సినిమా తీశామని నమ్మకంతో ముందుకెళ్తున్నాం. బామ్మర్ది ఎప్పుడూ బావ మంచినే కోరుకుంటాడు. కాబట్టి వరుణ్ సినిమా కూడా తప్పకుండా హిట్ అవుతుంది. ఒకరోజు ఇద్దరు మెగా హీరోలు బాక్సాఫీస్ వద్దకు వచ్చి హిట్ కొడితే ఆ కిక్కే వేరు. ఆ రికార్డ్ మనం మిస్సయ్యాం. చిరంజీవి, పవన్‌కల్యాణ్, నాగబాబు నాకు గురువులు. వారు లేకుండా ఈ స్టేజ్‌పై నేను లేను' అని అన్నారు.

**పవన్ కల్యాణ్‌కు రిక్వెస్ట్**

వి.వి. వినాయక్ మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్‌కి ఓ రిక్వెస్ట్. ఆయన సినిమాలు చేయనని అన్నారు. కానీ ఆయన రాజకీయంగా ఎంత ఎదిగినా, ప్రజా సమస్యలపై ఎంత పోరాడినా.. సమయం దొరికినప్పుడల్లా సినిమాలు చేయండి. సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది. సినిమాను చూసిన వారందరూ సంతోషిస్తారు. తేజుతో చమకు చమకు సాంగ్ చేసేటప్పుడు నాకు చిరంజీవే గుర్తుకొచ్చారు. రెండు మూడు సన్నివేశాలు పవన్ కల్యాణ్‌లా తేజు కనపడేలా షూట్ చేశాను. ఎందుకంటే చిరంజీవి, పవన్ కల్యాణ్ కలిస్తే ఎలా ఉంటుందో అలా తేజు స్టైల్ ఉంటుంది. మెగా ఫ్యామిలీలో కష్టపడేతత్వం ఎలా ఉందో.. తేజులో ఆ తత్వం కనపడుతుంది. చిరంజీవిలా తేజు అందరినీ కలుపుకు పోతుంటాడు' అని తెలిపారు.

## ఫోర్బ్స్‌లో బాలీవుడ్ తారలు

### భూమి, మిథిల, విక్కీకి స్థానం

ఫోర్బ్స్ విడుదల చేసిన 'ఫోర్బ్స్ ఇండియాస్ 30 అండర్ 30' జాబితాలో బాలీవుడ్ తారలు నిలిచారు. భూమి పడ్నేకర్, మిథిల, విక్కీ కౌషల్ ఫోర్బ్స్ జాబితాలో స్థానాన్ని దక్కించుకున్నారు. జాబితాను 15 కేటగిరీల్లో విడుదల చేస్తారు. ఆయా వ్యక్తులు సాధించిన విజయాలు, ప్రతికూల పరిస్థితులకు ఎదురీదే సామర్థ్యాలు, వ్యాపారం వంటివి ఆధారంగా జాబితాను విడుదల చేస్తారు. అక్షయ్ కుమార్‌తో 'టాయిలెట్ ఏక్తా ప్రేమ్ కథ'లో నటించిన భూమి, సామాజిక మాధ్యమాల్లో సంచనలమైన మిథిల పాల్కార్, మషాన్ ఈ జాబితాలో నిలవడం విశేషం. నటుడు విక్కీ కూడా ఇందులో స్థానం లభించింది. 'ది హుమ్మా సాంగ్', 'మెహర్బాని', 'సోచ్ హై' వంటి ట్రాక్స్‌తో పాపులర్ అయిన జుబిన్ నౌతియాల్ ఫోర్బ్స్ లిస్ట్‌లో గౌరవం దక్కింది.








## ఇది తరుణ్ లవ్ స్టోరీ


తరుణ్ హీరోగా నటించిన చిత్రం 'ఇది నా లవ్ స్టోరీ'. ఈ చిత్రం ద్వారా కోలీవుడ్ హీరోయిన్ ఓవియా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుంది. రమేష్ గోపి దర్శకులు. అభిరామ్ సమర్పణలో రామ్ ఎంటర్ టైనర్స్ పతాకంపై ఎస్.వి.ప్రకాష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు కానుకగా ఈనెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇప్పటికే ట్రైలర్, సాంగ్ టీజర్‌తో సోషల్ మీడియా ట్రెండింగ్‌లో నిలిచింది. ఇటీవలే సెన్సార్ పూర్తి చేసుకుంది. చాలా రోజుల తర్వాత పూర్తి లవ్ ఫీల్‌ని కలిగించే చిత్రంగా ఇది నా లవ్ స్టోరీ ఉందని సెన్సార్ సభ్యులు చెప్పినట్టు చిత్ర యూనిట్ తెలిపింది.


ఓవియా, తరుణ్

## జురాసిక్ పార్క్ ఫాలెన్ కింగ్‌డమ్

జురాసిక్ పార్క్ ...ఈ పేరుతో వచ్చే చిత్రాలకు అభిమానులెక్కువ. 2015లో వచ్చిన 'జురాసిక్ వరల్డ్'కు సీక్వెల్ 'జురాసిక్ పార్క్ : ఫాలెన్ కింగ్‌డమ్' రూపొందుతోదింది. ఇస్లా నబ్లర్ దీవిలోని అగ్నిపర్వతం బద్దలవుతుంది. ఫలితంగా అక్కడున్న డైనోసార్లుకు ముప్పు వాటిల్లుతుంది. ఆ ప్రమాదం నుంచి డైనోసార్ల జాతిని కథానాయకుడు ఏ విధంగా రక్షించాడన్న నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆసక్తిగా రూపొందించిన ఈ చిత్రం రెండో ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. ఎప్పటిలాగే డైనోసార్లతో కథానాయకుడు చేసే సాహసాలు, వాటికి దొరకకుండా తప్పించుకునే ప్రయత్నాలూ ఈ ట్రైలర్‌లో కనిపించాయి. ఈ సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్‌కు జేఏ బెయోనా దర్శకుడు. క్రిస్ ప్రాట్, బ్రైస్ డల్లాస్ హోవర్డ్, బి.డి.వాంగ్ తదితరులు కీలకపాత్రల్లో నటించారు. యూనివర్సల్ పిక్చర్స్, అంబ్లిన్ ఎంటర్‌టైన్‌మెంట్, ది కెనడీ మార్షల్ కంపెనీ, లెజండరీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్పీల్ బర్గ్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత. జూన్ 22న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించింది.




అక్షయ్ కుమార్

## హాకీలో 'గోల్డ్'

అక్షయ్ హీరోగా, రీమా కాగ్తి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న సినిమా'గోల్డ్'. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం ట్విట్టర్‌లో అక్షయ్ విడుదల చేశారు. 1946 హాకీ టీమ్ పడ్డ కష్టాలను టీజర్‌లో చూపించారు. హాకీ కోట్ టీమ్‌ను, ప్రభుత్వాన్ని ఒప్పించడం, బంగారు పతకం తీసుకురావడం వంటివి టీజర్‌లో కనిపించాయి. ఈ సినిమాలో మౌని రాయ్, కునాల్ కపూర్, అమిత్ సాధ్, వినీత్ సింగ్, సున్నీ కౌషల్ తదితరులు నటిస్తున్నా టీజర్ మొత్త అక్షయ్ మీదే రూపొందించారు. రెండు చోట్ల మాత్రం మౌని రాయ్, అమిత్ సాధ్ పాత్రలు మెరిశాయి. 1948 జరిగిన ఒలంపిక్‌లో హాకీ టీమ్ మొదటి బంగారు పతాకాన్ని సాధించింది. ఈ టీమ్‌లో బల్బీర్ సింగ్ ఓ సభ్యుడు. ఇతను జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. అయితే 'ఇది బల్బీర్ బయోపిక్ కాదు. 1933-48 నాటి భారతదేశ పరిస్థితి, హాకీ గురించే రూపొందించిన పూర్తి స్థాయి ఫిక్షనల్ చిత్రం. ఇది ఎవరి క్యారెక్టర్ ఆధారంగా తీయలేదు' అని నిర్మాతలు రితేశ్ దేశ్‌ముఖ్, సిధ్వాని పేర్కొన్నారు.

## ఎఫ్‌బీఐ మాజీ అధికారి పోరాటం


'స్కై స్క్రాపర్'లో ఓ సన్నివేశం

అమెరికాలో ఉన్న 'స్కై స్క్రాపర్' అనేది పెద్ద టవర్. ఇదే పేరుతో యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్‌గా ఓ సినిమా రాబోతుంది. హాలీవుడ్ నటుడు డ్వెయిన్ జాన్సన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. దీనికి నిర్మాత కూడా అతనే. ఇతనుతో రాసన్ ఎం.తుర్బెర్, హిరామ్ గార్సియోరాసన్ నిర్మాతలు. మార్షల్ థర్బర్ దర్శకత్వం వహిస్తున్నాడు. నేవే చాంబెల్, చిన్ హన్ తదితరులు కీలకపాత్రల్లో నటించారు. ఇందులో డ్వెయిన్ మాజీ ఎఫ్‌బీఐ అధికారి పాత్రలో నటిస్తున్నారు. ఈ టవర్‌కు ఇతను సెక్యూరిటీగా పని చేసే పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్ర ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. ట్రైలర్‌లో డ్వెయిన్ కుటుంబం 240 అంతస్తుల భవనంలో చిక్కుకుంటుంది. ఒకే కాలుతో ఉన్న డ్వెయిన్ వారిని కాపాడుకోవడం కోసం అన్ని అంతస్తుల భవనం నుంచి దూకడం ఉన్న సన్నివేశాలు ఈ టీజర్‌లో చూపించారు. లెజెండరీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని చైనాలో తెరకెక్కించారు. జులై 13న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

డా॥ స్పెషలిస్ట్



కుటుంబమే ప్రాథమిక సమాజవ్యవస్థ. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజమూ ఆరోగ్యం దిశగానే అడుగులు వేస్తుంది. ఏ కుటుంబంలోనైనా కీలకపాత్ర వహించేది దంపతులు.. అంటే స్త్రీ-పురుషులు. వారి మధ్య ఉండే లైంగిక సంబంధాలు, ఇతర కారణాలు పునరుత్పత్తి వ్యవస్థకు ముఖ్య భూమిక వహిస్తాయి. సమాజంలో లైంగిక అంశాలపై కొన్ని వేల సంవత్సరాలుగా గోప్యంగా వ్యవహరిస్తుండడంవల్ల యుక్తవయసుకు ఎదిగిన స్త్రీ, పురుషులకు తగిన అవగాహన ఉండడం లేదు. అవగాహన స్థానంలో అపోహలే ఎక్కువవుతున్నాయి. దీంతో లైంగిక సమస్యలు ఆరోగ్య సమస్యలుగా, కుటుంబ సమస్యలుగా మారి, సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఫిబ్రవరి 12న 'లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య అవగాహనా దినోత్సవం' సందర్భంగా యువత లైంగికారోగ్య, పునరుత్పత్తి సమస్యలు వాటిపై అవగాహన ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్' లో



# అవగాహనే కీలకం

ప్రతి ఒక్కరూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. లైంగికారోగ్య సమస్యలు మాత్రం మహిళలకు, పురుషులకు భిన్నంగా ఉంటాయి. అయితే ఈ సమస్యలు ఏవీ ఆందోళన కలిగించేవి కావు. అవగాహనా లోపంతో చిన్న సమస్యని పెద్దగా ఊహించుకుని భయపడడం ఒక సహజ లక్షణంగా మారిపోతోంది. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలకు లైంగిక అవయవాల గురించి, పునరుత్పత్తి వ్యవస్థ గురించి బొమ్మల సాయంతో అవగాహన కల్పించాలి. ఇందులో సిగ్గు పడాల్సినదేమీలేదు. శరీరంలో మిగిలిన అవయవాలు వంటివే లైంగిక అవయవాలు అనే స్పృహని పెంచాలి. అవగాహన పెరిగితే సగానికి పైగా లైంగిక ఆరోగ్య సమస్యలు సునాయాసంగా పరిష్కారమైపోతాయి.

## మహిళల్లో లైంగిక సమస్యలు

ఈ సమాజంలో మొదట్నుంచీ మహిళలు ద్వితీయశ్రేణి పౌరులుగానే మిగిలిపోయారు. వారు తమ లైంగిక సమస్యలను బయటకు చెప్పుకోలేక, లోపల భరించలేక తీవ్రంగా సతమతమౌతున్నారు.

ఈ సమస్యలకు మహిళలు భయపడాల్సిన పని ఎంతమాత్రమూ లేదు. తగిన అవగాహన పెంచుకుంటే వీటిని దూరం చేసుకోవచ్చు.

## లైంగిక విముఖత

కొంతమంది మహిళల్లో లైంగిక విముఖత ఉంటుంది. కోరికలను అణచుకుని వారు సెక్స్‌పైన ఆసక్తి చూపించరు. దీనికి కారణం హార్మోన్ల ప్రభావం, అనారోగ్య పరిస్థితులు, కొన్ని రకాల చికిత్సలు, మానసిక ఒత్తిడి, ఇతర పరిస్థితుల వలన మహిళలు లైంగిక చర్యల పట్ల విముఖతతో ఉంటారు. ఇటువంటి వారు తమ సమస్యలపై కౌన్సెలింగ్ ద్వారా తగిన అవగాహన పెంచుకుంటే ఈ విముఖత నుంచి బయటపడొచ్చు.

## సంభోగంలో నొప్పులు

కొంతమంది మహిళలకు సంభోగ సమయంలో లేదా తరువాత నొప్పి ఉంటుంది. ఈ సమస్యలో సంభోగ సమయంలో నొప్పి, యోని కండరాలలో ఈడ్పు, వుల్వోడైనా అనే మూడు రకాల ఇబ్బందులుంటాయి. సంభోగ సమయంలో విడుదలయ్యే స్రావాలు, విడుదల స్థాయిలు తగ్గడం వల్ల ఈ సమస్య కలుగుతుంది. సెక్స్ అంటే భయం, ఆందోళన వల్ల, తగినంత లైంగిక ఉత్సాహం లేకపోవటం లేదా గర్భం ఉన్న సమయంలో హార్మోన్లలో మార్పులు, బ్రెస్ట్ ఫీడింగ్, ఋతువిరతి వంటి వాటివలన ఈ రకమైన లైంగిక సమస్యలు కలుగుతాయి. అసంకల్పిత లేదా బలవంతపు లైంగిక ప్రేరణల వలన యోని కండరాలలో ఈడ్పు కలుగుతుంది. సాధారణంగా ఇలాంటి లైంగిక సమస్యలు అత్యాచారం లేదా బలవంతపు లైంగికచర్యల వల్ల కలుగుతాయి. యోనిలో లేదా యోని గోడలు ఇన్ఫెక్షన్లకు గురైతే వుల్వోడైనా అనే లైంగిక సమస్య కలుగుతుంది.

## భావప్రాప్తి సమస్య

భావప్రాప్తి సమస్య అనేది లైంగిక అసమర్థత వల్ల ఏర్పడుతుంది. ఒక మహిళ సాధారణ లైంగిక అనుభూతి తర్వాతా భావప్రాప్తికి గురవకపోతే దానికి కారణం భావప్రాప్తి రుగ్మత. ఈ సమస్య శరీరధర్మపరమైన, మానసికమైన, రసాయనికమైన కారణం వల్ల ఏర్పడవచ్చు. భావప్రాప్తి అనేది దంపతులు, భాగస్వాములు పంచుకునే సంబంధాల వల్లా ప్రభావితమౌతుంది.

## లైంగిక సమస్యలకు కారణాలు



కొంతమంది మహిళల్లో చిన్నతనంలో సెక్స్ పట్ల ఉన్న అపోహలను ఇతరుల ద్వారా చెడుగా వినడం, అసభ్యకర లైంగిక దృశ్యాలను చూడడం వల్ల లైంగిక సమస్యలు కలుగుతాయి. మరికొంత మందిలో లైంగికంగా ప్రమాదాలకు గురికావడం వల్ల లైంగిక సమస్యలు కలుగుతాయి.

ప్రతిరోజూ ఒత్తిడికి గురికావడమూ లైంగిక సమస్యలకు కారణమౌతుంది. భాగస్వామితో విభేదాలు ఏర్పడడం వల్ల, గర్భం ధరించిన తర్వాత హార్మోన్లలో వచ్చే మార్పులు, ఋతుచక్రంలో హార్మోన్ల ప్రభావం, అధిక రక్తపోటు, మధుమేహం, డిప్రెషన్ వంటివీ లైంగిక సమస్యలకు దారితీస్తాయి.

## పురుషుల్లో లైంగిక సమస్యలు

పురుషుల్లో లైంగిక సమస్యలు సాధారణంగా భాగస్వామితో శృంగారం చేసే సమయంలో బయటపడు తుంటాయి. పురుషుల లైంగిక సమస్యల్లో అంగస్తంభన సమస్యలు, అకాల స్ఖలనం, తొందరగా స్ఖలనం జరగడం, అల్ప స్ఖలనం, లైంగిక వాంఛలను అణచుకోవడం వంటివి సాధారణంగా కన్పిస్తుంటాయి. ఇలాంటి సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చు కానీ కొంతమంది పురుషులు ఈ సమస్యలను డాక్టర్‌తో చెప్పుకోవడానికి సిగ్గు పడి, వాటిని దాచుకొని సతమతమవుతుంటారు. లైంగిక సమస్యలు అనేవి చాలా సాధారణం. ఇవి జన్యుపరమైన లోపాలు, మానసిక స్థితి, ఇతరేతర కారణాల పైనా ఆధారపడి ఉంటాయి. వీటి విషయంలో ఎలాంటి భయాందోళనలకూ తావివ్వకుండా సమస్యలను డాక్టర్‌కి చెబితే పరిష్కారం సులభమౌతుంది.



## స్ఖలన సమస్యలకు కారణాలు

చాలా మందిలోని స్ఖలన సమస్యలకు కారణాలు... లైంగికంగా భాగస్వామి ఆకర్షణీయంగా లేదనుకున్నపుడు, కట్టుబాట్లు ఉన్న వారితో లైంగిక చర్యలను కొనసాగించడం, మానసికపరమైన ఒత్తిడిలో ఉన్నపుడు శృంగారంలో పాల్గొనడం వంటివిగా గుర్తించారు. డయాబెటిక్ న్యూరోపతీ కలిగినవారు ఎక్కువగా శృంగార సమయంలో, వీర్యానికి బదులుగా వేరే ద్రవాలు స్రవించడం వంటి సమస్యలను కలిగి ఉంటారు.

## లైంగిక వాంఛలను అణచడం

లైంగిక వాంఛలను అణిచిపెట్టుకోవడం వల్ల శృంగారంపై ఉన్న ఆసక్తిని పూర్తిగా కోల్పోతారు. ఈ రకమైన సమస్యను కామవాంఛలను (లాస్‌అఫ్ లిబిడో) కోల్పోవడం అనీ అంటారు. డిప్రెషన్, వైద్యపరమైన సమస్యలు, మధుమేహం, అధిక రక్త పీడనం, భార్య–భర్తల మధ్య అపోహల వల్ల, మందుల వాడకంతో కలిగే దుష్ప్రభావం వల్ల ఈ రకమైన లైంగిక సమస్యలు ఏర్పడతాయి.



## అంగస్తంభన/నపుంసకత్వం

సంభోగ సమయంలో, మానసికంగా శృంగారానికి సిద్ధమైనప్పటికీ అంగం సరైన స్థాయిలో నిలబడకపోవడం లేదా గట్టి పడకపోవడాన్ని అంగస్తంభన సమస్యలంటారు. కొంతమంది దీనినే నపుంసకత్వం అనీ వ్యవహరిస్తుంటారు. ఇలాంటి సమస్యలు ఎంతోమందికి ఉంటాయి. ఇది మొదటిరాత్రి లేదా లైంగికంగా ఒకటయ్యే సమయంలో బయటపడుతుంది. మానసిక పరిస్థితి, శారీరకలోపాల వల్ల ఈ సమస్యలు కలుగుతాయి. అంతేకాకుండా డిప్రెషన్, ఒత్తిడి, శృంగారం పట్ల ఉన్న ఆందోళన, ఉద్రేకతల వల్లా ఈ రకమైన లైంగిక సమస్య ఏర్పడుతుంది.

## స్ఖలన సమస్యలు

స్ఖలన సమస్యలు సాధారణంగా చాలా రకాలుగా ఉంటాయి. అకాల స్ఖలనం, తొందరగా స్ఖలనం (శీఘ్ర స్ఖలనం), అల్ప స్ఖలనం వంటివి వీటిలో ముఖ్యమైనవి.

## అకాల స్ఖలనం

అకాల స్ఖలనం అంటే తన ప్రమేయం లేకుండా లేదా తెలియ కుండానే శృంగార సమయంలో స్ఖలనం కావడం. ఇందులో అంగప్రవేశం ముందుగానీ లేదా తరువాత గానీ తెలియకుండానే స్ఖలనం అవుతుంది. శీఘ్ర స్ఖలనం అంటే లైంగిక చర్య మొదలుపెట్టడానికి ముందే స్ఖలనం జరగడం. అల్ప స్ఖలనం అంటే తగినంత వీర్యం బయటకు రాకపోవడం. శృంగారంలో పాల్గొనే సమయంలో చాలా ఆలస్యంగా కొంతమందికి స్ఖలనమౌతుంది. ఈ రకమైన లైంగిక సమస్యలు కలిగి ఉన్నవారిలో ఎలాంటి సమస్యా లేదు. వీర్యం బదులు ఇతర ద్రవాలు స్ఖలించే సమస్య కొందరిలో ఉంటుంది. వీరిలో వీర్యం ఉత్పత్తి బాగానే ఉంటుంది.. కానీ ఉత్పత్తి అయిన వీర్యం మూత్రతిత్తిలోకి చేరుతుంది. అంగం గుండా మూత్రతిత్తిలో నిల్వ ఉన్న ఇతర ద్రవాలు లైంగిక సమయంలో బయటకి వస్తాయి. దీనికి భయపడాల్సిన పనిలేదు.

## రెండు రూపాల్లో చికిత్సలు

లైంగిక సమస్యలకు రెండు రూపాల్లో చికిత్సలు అందించాలి. ఎందుకంటే ఇవి మానసిక, శారీరకలోపాల వల్ల ఏర్పడుతుంటాయి. దీంతో కౌన్సెలింగ్, అవసరమైతే మందులు తీసుకోవడం వంటి విధానాల ద్వారా చికిత్సలుంటాయి.

## కౌన్సెలింగ్‌తో చికిత్స

ఈ రకమైన చికిత్సలో, మానసికపరమైన చికిత్స చేయాలి. ఇందులో శృంగారం పట్ల భయం, ఆందోళన, అపోహలు, అపరాధం అనే భావనలో ఉండేవారికి కౌన్సెలింగ్ చేయడం ద్వారా వారి భయాలను, అపోహలనూ తొలగించి.. వారి సమస్యని పరిష్కరించొచ్చు.

## హార్మోన్ల చికిత్స

కొంతమంది పురుషులలో లైంగిక హార్మోన్ అయిన టెస్టోస్టెరోన్ హార్మోన్ ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. హార్మోన్ థెరపీ లేదా చికిత్స ద్వారా టెస్టోస్టెరోన్ హార్మోన్ ఉత్పత్తి స్థాయిలను పెంచడం ఇందులో భాగం. ఇతర హార్మోన్ల సమతుల్యతని పరిశీలించి, అవసరమైన మేరకు హార్మోన్ చికిత్స చేయాలి. మరికొందరిలో వాక్యుమ్ డివైస్ లేదా పురుషాంగ ఇంప్లాంట్ వంటి చికిత్సల ద్వారా అంగస్తంభన కాకపోవడం వంటి లైంగిక సమస్యలను తగ్గిస్తారు.

## సహజమైన పునరుత్పత్తి

లైంగిక అవయవాలు ప్రత్యుత్పత్తి వ్యవస్థకు మూలాధారాలు. లైంగిక అవయవాల్లో వచ్చే మార్పులు, హార్మోన్ల పరిణామం తదితర అంశాలపై చిన్నవయసు నుంచే తగిన అవగాహన పిల్లల్లో ఉంటే వారు ఎదిగేకొద్దీ తమలో వచ్చే శారీరక, మానసిక మార్పులను స్వయంగా అర్థం చేసుకోగలుగుతారు. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం తయారౌతుంది. మహిళల్లోనూ, పురుషుల్లోనూ పునరుత్పత్తి సమస్యల్లో ప్రధానమైనది వంధ్యత్వం. దీనికి రకరకాల కారణాలున్నాయి. వాటిని పరిశీలించిన తర్వాతే అవసరమైన చికిత్సలు అందించాలి. పునరుత్పత్తి జరపడంలో విఫలమైనంత మాత్రాన దానిని లైంగిక సమస్యగా భావించకూడదు. సంతాన సాఫల్యానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే లైంగిక జీవితాన్ని ఆనందంగా గడపొచ్చు. భాగస్వాములు లైంగికంగా సమర్ధతతో ఉన్న సందర్భాల్లోనూ సంతాన సాఫల్యానికి దూరమైతే ఒకరినొకరు నిందించుకుని తమ సంబంధాలను తెంచుకోవాల్సిన పనిలేదు. సమస్య ఎవరిలో ఉందో గుర్తించి తగిన చికిత్స అందించే అదేమంత పెద్ద విషయం కాదు. అప్పటికీ పునరుత్పత్తి విషయంలో ఫలితం లేకపోతే ఎవరినైనా దత్తత స్వీకరించి తమ అనుబంధాన్ని మరింత బలపర్చుకుని లైంగిక జీవితాన్ని ఆనందంగా కొనసాగించ వచ్చు.





డాక్టర్ జి. సమరం
ఎంబిబిఎస్, ఎఫ్‌సిజిపి,ఎంసిఎస్ఇపిఐ
వాసవ్య నర్సింగ్‌హోమ్,
బెంజిసర్కిల్, విజయవాడ.



# చిన్నారి

## పొడుపు కథ

పాలరాతి కట్టడం,
అందమైన అద్భుతం,
షాజహాన్, ముంతాజ్‌ల,
ప్రేమకు ప్రతిరూపం?

జవాబు : తాజ్‌మహల్

## జోక్ :

రాము : డాడీ నువ్వు చీకట్లో కూడా రాయగలవా?
తండ్రి : ఎందుకు రాయలేను.. ఏం రాయాలో చెప్పు?
రాము : ఏమీలేదు డాడీ నేను నా ప్రోగ్రెస్ కార్డు ఇస్తాను.. దానిపై నేను రాయమన్న చోట నీ పేరు రాయాలి. అంతే..!

## రంగులు దిద్దండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని బొమ్మలకు రంగులు వేయండి!

## బూడిదరంగు కోడి



ఒకప్పుడు మనిషి తన పరిసరాల్లో ఉన్న జంతువులను, పక్షులను వేటాడి తినేవాడు. కొంతకాలం తర్వాత వాటిని పెంచుకొని తినడం ప్రారంభించాడు. కోళ్ళను పెంచడం, తినడం మనకు తెలిసిందే. అయితే ఇప్పటికీ అడవికోళ్ళను వేటాడి తినడం మానలేదు మనిషి. ఆ అడవి కోళ్ళ విశేషాలు ఇప్పుడు తెలుసుకుందాం..

బూడిద రంగులో ఉండే అడవికోడి (గొల్లస్ సొన్నెరట్టి) ని సొన్నెరట్స్ అని పిలుస్తారు. ఇళ్లల్లో పెంచుకొనే పెంపుడు కోడికి, దీనికీ దగ్గర సంబంధం ఉంటుంది. ఈ జాతి పక్షులు ప్రధానంగా భారత ఉపఖండంలోని ఉత్తర సరిహద్దు ప్రాంతంలో కనిపిస్తాయి. ఇవి కొన్ని సందర్భాలలో ఎరుపు వర్ణపు అడవిజాతి కోడితో కలిసి సంకరజాతిని సృష్టిస్తాయి. వీటి అరుపులు గట్టిగా వినిపిస్తాయి. వీటిని మాంసం కోసం వేటాడతారు. వీటి మెడచుట్టూ ఉండే పొడవైన ఈకలు, తలమీద పింఛం వంటి భాగాలు చేపలను పట్టడానికి ఎరలుగా ఉపయోగిస్తాయి. మగపక్షి కాషాయరంగు చుక్కలు, నల్లని పింఛం కలిగి ఉండి.. మిగతా శరీరం బూడిదరంగు ఈకలతో అందంగా ఒక రకమైన డిజైన్‌తో ఉంటుంది. దీని మెడభాగం నుంచి కిందకు వేలాడే ఈకలు నల్లరంగులో ఉండి చివర పసుపు అంచులా ఉంటుంది.



అసాధారణమైన ఆకారం, రంగులతో ఇవి కృత్రిమ పక్షుల రూపాలను అధిక స్థాయిలో తయారు చేయడానికి ఉపయోగపడుతున్నాయి. మగ పక్షులకు తలమీద దువ్వెన పళ్ళ ఆకారం పింఛం, మెడకింద వేలాడే ఎర్రని దళసరి చర్మం ఉంటుంది. కానీ ఎర్రని అడవికోడి అంత ప్రస్ఫుటంగా ఉండదు. ఇవి ఫిబ్రవరి నుంచి మే వరకూ జతకడతాయి. ఇవి 5 నుంచి 7 వరకు గుడ్లను పెడతాయి. గుడ్లలో నుంచి పిల్లలు బయటపడటానికి 21 రోజుల సమయం పడుతుంది. ఇవి చాలావరకూ నేలపై తిరుగుతూనే ఉన్నా, ఈ బూడిదరంగు అడవిపక్షి, వేటాడే శత్రువుల బారి నుంచి తప్పించుకోవడం కోసం చెట్ల పొదలలోకి, కొమ్మలపైకి ఎగిరిపోతుంది. ఇవి వెదురుగింజలతో పాటు అన్ని గింజలను, చిన్న పళ్ళను, కీటకాలను, చెద పురుగులను ఆహారంగా తీసుకుంటాయి. ★







పార సంజయ్ వర్మ
6వ తరగతి,
వెంకటేశ్వర టాలెంట్ స్కూల్, వాత్సవాయి,
కృష్ణాజిల్లా.

## పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



# దవడకు గాయమైనా సెంచరీ కొట్టాడు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ బ్యాట్స్‌మన్, అండర్-19 మాజీ కెప్టెన్ ఉన్ముక్త్ చంద్‌కు దవడకు గాయమైనా సెంచరీతో చెలరేగాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఉత్తరప్రదేశ్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ ఓపెనర్‌గా వచ్చిన ఉన్ముక్త్ 125 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 116 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. దీంతో ఢిల్లీ జట్టు 50 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. అనంతరం ఉత్తరప్రదేశ్ జట్టు 252 పరుగులకు ఆలౌట్ అవ్వడంతో ఢిల్లీ జట్టు 55 పరుగుల తేడాతో గెలుపొందింది. దవడకు బలమైన గాయమైనా ఏ మాత్రం లెక్కచేయకుండా సిక్స్‌లు, ఫోర్లతో చాంద్ చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా బంతి బలంగా దవడకు తగలడంతో ఉన్ముక్త్‌కు తీవ్రగాయమైంది. నొప్పి వస్తున్నా.. లెక్క చేయకుండా ముఖానికి కట్టు కట్టుకుని ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. ఓ వైపు నొప్పి భరిస్తూనే.. ప్రారంభం నుంచి దూకుడుగా బ్యాటింగ్ చేసి ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించాడు.



1) ప్రపంచకప్ గెలిచిన అండర్-19 జట్టుకు ముంబాయి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం, 2) అండర్-19 ప్రపంచకప్‌ను మీడియాకు చూపుతున్న యువజట్టు 3) మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కోచ్ రాహుల్ ద్రావిడ్, టీమిండియా సారథి పృథ్వీ షా




# స్పిన్నర్లకు దాసోహం...

- దక్షిణాఫ్రికా పతనాన్ని శాసిస్తున్న కుల్దీప్, చాహల్
- వన్డే సిరీస్ విజయానికి చేరువలో టీమిండియా

**తొలి రెండు వన్డేల్లో టీమిండియా గెలిచింది పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌తో అనడం కంటే... బౌలింగ్ సామర్థ్యంతో అనడంలో అతిశయోక్తి లేదు. దక్షిణాఫ్రికా క్రీడాకారులు ఫాస్ట్ బౌలింగ్‌ను ఎంత సునాయాసంగా ఆడతారో.. స్పిన్నర్లను ఎదుర్కోవడానికి అంత ఆపసోపాలు పడతారు. సఫారీ పర్యటనలో టీమిండియా గెలిచిన రెండు వన్డేల విజయాలను పరిగణలోనికి తీసుకుంటే మనకే ఈ విషయం అర్థమౌతుంది. తొలి వన్డేలో వీరిరువురు 5 వికెట్లు పడగొడితే... రెండో వన్డేలో 7 వికెట్లను కూల్చి సఫారీ రెండు వన్డేలను గెలిచి 2-0 ఆధిక్యతలో నిలిచిన టీమిండియా 25 ఏళ్ళలో తొలిసారి వన్డే సిరీస్ గెలిచే సువర్ణావకాశానికి దగ్గరలో నిలిచింది.**

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

భారత ఉపఖండంలో పర్యాటక దేశం ముందు స్పిన్‌ను ఎదుర్కోవడానికి కొంత ఇబ్బంది పడేవి. మన ఉపఖండ దేశాల్లోని పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలిస్తాయనే నానుడి ఎప్పటినుండో ఉంది. అదేవిధంగా మన జట్లు ఇతర దేశాల పర్యటనకు వెళ్లేటప్పుడు అక్కడి దేశాల్లోని ఫాస్ట్ బౌలింగ్‌కు, స్వింగ్ మరియు బౌన్సీ బంతులను ఎదుర్కోవడానికి కష్టపడాల్సి వచ్చేది. ఇది ఒక్క మన దేశ క్రికెట్ జట్టు సమస్యే కాకుండా పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లను కూడా ఈ కోవలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

భారతజట్టుకు తొలినుండి స్పిన్నర్లే మ్యాచ్‌లను గెలిచింపిన సందర్భాలు కోకొల్లలున్నాయి. వారిలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది మనీందర్ సింగ్... 1980-90 దశకాల్లో క్రికెట్‌ను శాసించే వెస్టిండీస్ జట్టులో వివిఎన్ రిచర్డ్ ప్రపంచ బౌలర్లందరికీ చుక్కలు చూపించి నప్పటికీ... మనీందర్ సింగ్ బౌలింగ్ అంటే వణికి పోయేవాడు. ఆ తర్వాత దశలో హర్భ జన్ సింగ్, అనీల్ కుంబ్లేల గురించి చెప్పుకోవచ్చు. వీళ్లిద్దరూ ప్రపంచజట్లను గడగడలాడించి ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిచింపిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వారి తర్వాత వచ్చిన రవిచంద్రన్ అశ్విన్... రవీంద్రు జడేజాలు... ఇప్పటికీ అశ్విన్ బౌలింగ్ ఆడడానికి చాలామంది క్రికెటర్లు భయపడతారు. వారి తర్వాతి తరంలో దూసుకొచ్చిన స్పిన్నర్లే యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్...

చాహల్, కుల్దీప్ యాదవ్ వీరిరువురి బౌలింగ్ పూర్తి భిన్నంగా ఉంటుంది. హర్యానాకు చెందిన చాహల్ కుడిచేతి లెగ్‌స్పిన్ బౌలింగ్ చేయడంలో దిట్ట.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుల్దీప్ యాదవ్ 'చైనామన్' బౌలర్‌గా ప్రఖ్యాతి చెందాడు. ఎడమచేతి గుగ్లీ బౌలింగ్ చేయడంలో నిష్ణాతుడు. వీరిద్దరూ ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డేల్లో హీరోలయ్యారు.

తొలి మ్యాచ్‌లో కోహ్లీ, రహానే బ్యాటింగ్‌లో రాణించినా... కుల్దీప్, చాహల్ వీరిరువురు సగభాగం వికెట్లను పడగొట్టారు. రెండోవన్డేలో అయితే ఏకంగా 7 వికెట్లను సాధించి ఆ జట్టుకు కోలుకోలేని దెబ్బ తీశాడు. వీరిద్దరు రాణిస్తుండడంతో అశ్విన్, జడేజాలు బెంచ్‌కే పరిమితమౌతున్నారు.

వీరిద్దరూ ఇటీవల స్వదేశంలో జరిగిన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకపై అద్భుతంగా రాణించారు. అవన్నీ స్వదేశీ మైదానాల్లో కావడంతో విదేశీ పర్యటనలలో వీరిరువురి రాణింపుపై కొన్ని సందేహాలున్నాయి. ఆ సందేహాలను పటాపంచలు చేస్తూ వీరిరువురూ రెండు వన్డేలో అనూహ్యంగా రాణించారు. సంచూరియన్ మైదానంలో చాహల్ అనూహ్యంగా రాణించి దక్షిణాఫ్రికా జట్టును కోలుకోలేని దెబ్బతీశాడు. దీంతో ఆ జట్టు కేవలం 118 పరుగులకే ఆలౌట్ అయ్యింది. చాహల్, కుల్దీర్ రాబోయే వన్డేల్లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించి టీమిండియాకు చిరస్మరణీయమైన సిరీస్ సాధించిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మెరిసిన స్మృతి మంధాన

## దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో గెలుపు




**కింబర్లీ:** దక్షిణాఫ్రికాతో సోమవారం జరిగిన తొలి వన్డేలో భారత మహిళా జట్టు 88 పరుగుల తేడాతే ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా మహిళా జట్టు 125 పరుగులకు ఆలౌట్ అయింది. జులాన్ గోస్వామికి 4, శిఖాపాండేకు 3 వికెట్లు లభించాయి. పరుగులు మాత్రమే చేసింది. ఓపెనర్ స్మృతి మంధన 84 (98 బంతులు, 8 ఫోర్లు ఒక సిక్సర్ సాయంతో) పరుగులు చేసింది. టీమిండియా మిథాలీ రాజ్ 45 (70 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. మిగతా బ్యాట్స్‌ఉమెన్లు విఫలమవ్వడంతో భారత్ ఆతిథ్య జట్టు ముందు స్వల్పలక్ష్యాన్ని ఉంచింది. దక్షిణాఫ్రికా మహిళా బౌలర్లలో మరిజన్నే కాప్, అయబోంగా కాకాలు రెండేసి వికెట్లు పడగొట్టగా.. మసబట క్లాస్ ఓ వికెట్ దక్కించుకున్నారు.



# ఫోర్బ్స్ ఇండియాలో నలుగురు యువ క్రీడాకారులు

**న్యూఢిల్లీ :** భారత్‌కు చెందిన అండర్-30 ఫోర్బ్స్ ఇండియా జాబితాలో నలుగురు క్రీడాకారులకు చోటు లభించింది. సోమవారం బిజినెస్ మ్యాగజైన్ ఫోర్బ్స్ (ఇండియా) ప్రకటించిన జాబితాలో జస్ప్రీత్ బుమ్రా (క్రికెట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), హీనా సింధూ (షూటింగ్), సవితా పూనియా (హాకీ)లకు చోటు లభించింది.

## ఎసిబి వలలో

# అవి'నీటి'చేప

- పట్టుబడ్డ వడ్డాది సెక్షన్ ఇరిగేషన్ జెఇ ఆకుల ప్రకాష్


ప్రకాష్‌ను విచారిస్తున్న అధికారులు, జెఇ ప్రకాష్ (బ్లూషర్ట్ వేసుకున్న వ్యక్తి)

ప్రజాశక్తి - చోడవరం, విశాఖపట్నం

విశాఖ జిల్లా చోడవరం ఇరిగేషన్ కార్యాలయంలో ముడుపులు తీసుకుంటూ వడ్డాది సెక్షన్ జెఇ ఆకుల ప్రకాష్, అతని అనుచరుడు ప్రసాద్ సోమవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి కెవిఆర్‌పి.ప్రసాద్ అందించిన వివరాల మేరకు.. మాడుగుల మండలం కెజె పురం గ్రామానికి చెందిన ఆళ్ల సంతోష్ అనే వ్యక్తి నీరు - చెట్టు కార్యక్రమంలో భాగంగా శ్రీరామ్ చెరువు, సీతారామ్ చెరువు, రంగారావు చెరువు పనులు చేశారు. వీటిలో ఒక చెరువు పనికి సంబంధించి బిల్లు మంజూరైంది. మరో చెరువునకు సంబంధించి రూ.7.50 లక్షల బిల్లుకు గాను కొంత మొత్తాన్ని చెల్లించగా, మిగతా బిల్లు మంజూరుకు రూ.50 వేలు ముడుపులివ్వాలని ప్రకాష్ పట్టుబట్టడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఎసిబిని ఆశ్రయించాడు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఎసిబి అధికారులు, పక్కా ప్రణాళికతో వలపన్ని, జెఇకి డబ్బులు ఇస్తుండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా జెఇ ప్రసాద్‌తో పాటు అతని అనుచరుడు ప్రసాద్‌ను కస్టడీలోకి తీసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిబి ఇన్‌స్పెక్టర్లు గణేష్, మహేష్ పాల్గొన్నారు.

# రూ.5,300 కోట్ల రుణానికి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ (ఎపిడిడబ్ల్యూఎస్‌సి)కు తాగునీటి ప్రాజెక్టుల కోసం జాతీయ బ్యాంకుల నుంచి రూ.5,300 కోట్లు రుణంగా పొందేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో రూ.6,300 కోట్లతో ఈ ప్రాజెక్టుల్ని ప్రతిపాదించారు. ఈ మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేస్తుండగా, మిగిలిన రూ.5,300 కోట్లు జాతీయ బ్యాంకుల నుంచి రుణాల రూపంలో ఎపిడిడబ్ల్యూఎస్‌సి పొందనుంది. రూ.9,400 కోట్లతో చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో పిపిపి పద్ధతిలో చేపట్టేందుకు కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చిన విషయం తెలిసిందే.

# జాతీయస్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర కూటమి

- జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం
- బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం : ప్రకాశ్ కరత్ విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ స్థాయిలోనూ వామపక్ష ప్రజాతంత్ర కూటమిని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలు చేస్తున్న బిజెపిని ఓడించాలంటే ఇదొక్కటే పరిష్కార మార్గమని అభిప్రాయపడ్డారు. ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలనుకోవడం అప్రజాస్వామిక మన్నారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా సోమవారం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. పదవీ కాలం ముగియకుండా అంసెంబ్లీలను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలనుకోవడం సరైన విధానం కాదన్నారు. ఏదైనా కారణం వల్ల అసెంబ్లీ రద్దయితే వచ్చే ఎన్నికల వరకు రాష్ట్రపతి పాలన విధించడం జరుగుతుందే కానీ, ఐదేళ్లు పూర్తయ్యే వరకూ చట్టం ప్రకారం ఏమీ చేయడానికి వీలుకాదన్నారు. సహజంగా ఐదేళ్లకోసారి ఎన్నికలు జరగాలి కానీ, కేవలం ఎన్నికల కోసం అధ్యక్ష పాలన విధించడం అప్రజాస్వామికమవుతుందన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కరత్

లోక్‌సభ, అసెంబ్లీలకు ఐదేళ్ల పదవీకాలం ఎప్పుడు పూర్తయితే అప్పుడు ఎన్నికల్ని నిర్వహించాలన్నారు. మహాసభల్లో ఎన్నికల వ్యూహాల గురించి మాట్లాడటం లేదని, ఎన్నికల సమయంలో మాత్రమే ఎత్తుగడలు అనుసరిస్తామన్నారు. తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు బీఎల్‌ఎఫ్ ఆవిర్భావమే నిదర్శనమని, జాతీయ స్థాయిలోనూ ఇలాంటి లెఫ్ట్ డెమోక్రటిక్ అలయెన్స్ ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై స్పందించిన ఆయన ప్రస్తుత బడ్జెట్ వల్ల సామాన్యులకు ఒరిగిందేమి లేదన్నారు. పెద్దపెద్ద ప్రకటనలు చేసి వాటికి నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి బడ్జెట్‌లో మాత్రం రూ.2 వేల కోట్లు కేటాయించిందన్నారు. కానీ కేంద్రం ప్రకటించిన హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలంటే లక్ష కోట్ల రూపాయలు కావాలని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారన్నారు.

ఇది ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని బాగుచేసే నిర్ణయం కాదన్నారు. పెట్టుబడికి అదనంగా 50 శాతాన్ని కలిపి గిట్టుబాటు ధర కల్పించాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేస్తే, కేంద్రం దాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇక దేశంలో పెట్రోల్, డీజిల్ సంక్షోభం ఎలాగూ కొనసాగుతూనే ఉందన్నారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని తొమ్మిదిసార్లు పెంచిందన్నారు. లీటర్ పెట్రోల్‌పై రూ.2 తగ్గించి, సెస్ పేరుతో రూ.2 పెంచుతోందన్నారు. ఒకచేత్తో ఇచ్చి, మరో చేత్తో తీసుకోవడమంటే ఇదే అని ఆయన ఎద్దేవా చేశారు. ముందస్తు ఎన్నికలపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ప్రస్తుతం త్రిపుర ఎన్నికలు జరుగుతున్నాయని, ఆ తర్వాత మరికొన్ని రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములు, బి.వెంకట్, జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఓటు హక్కును వినియోగించుకుంటున్న సిఐటియు నాయకులు రామారావు, అయోధ్యరామ్ తదితరులు

# 'ఉక్కు' గుర్తింపు యూనియన్ ఎన్నిక ప్రశాంతం

## 96.73 శాతం పోలింగ్

ప్రజాశక్తి- ఉక్కునగరం, విశాఖ

విశాఖ ఉక్కు కర్మాగారంలో గుర్తింపు యూనియన్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 5 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 వరకూ సాగింది. కర్మాగారంలో వివిధ విభాగాల దగ్గర 14 బూత్‌లతో పాటు, ట్రైనింగ్ సెంటర్, స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి దగ్గర ఒక్కో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. 11,517 ఓట్లకుగాను 11,119 ఓట్లు పోలయ్యాయి. ఈ సారి 96.73 శాతం పోలింగ్ నమోదుకావడం విశేషం. గత నెల 19న రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) ఎస్‌కె.మిశ్రా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి కార్మిక సంఘాలు ప్రచారాన్ని హోరెత్తించాయి. ఎన్నికల్లో 12 యూనియన్లు పోటీ చేసినప్పటికీ ప్రధాన పోటీ మాత్రం సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి మధ్యే నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా ఈ సారి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో ప్రధాన కార్మిక సంఘాల నాయకులు ఎన్.రామారావు, జె.అయోధ్యరాం, వైటి.దాస్, మంత్రి రాజశేఖర్, జి.బోసుబాబు, వై.మస్తానప్ప, విళ్ల రామ్మోహన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# రియల్ ఎస్టేట్ వ్యాపారి చంద్రబాబు

- ప్రభుత్వ భూములను ప్రైవేటుకే కట్టబెడుతున్నారు
- పాదయాత్రలో జగన్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

సిఎం చంద్రబాబునాయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి అని వైసిపి అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్ర సోమవారం జొన్నవాడ గ్రామం నుంచి ప్రారంభమైంది. పెనుబల్లి, సాల్మాన్‌పురం, చెల్లాయపాళెం, వడ్డిపాళెం, మీదుగా బుచ్చిరెడ్డిపాళెంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పలువురు రైతులు, ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను జగన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆక్వా రైతులకు విద్యుత్ బిల్లులు చెల్లించలేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. విద్యుత్ శాఖ ఎసిడి పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జగన్ వారితో మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకూ న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ ఇటీవల బడ్జెట్ విషయంలో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో టిడిపికి చెందిన కేంద్ర మంత్రులు ఆమోదం తెలిపి బయటి వచ్చి మాట్లాడటం దారుణమన్నారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను ప్రయివేటు సంస్థలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో లంచాలు తీసుకుని కోకోకోలా కంపెనీకి కట్టబెట్టారన్నారు. ఆ కంపెనీకి రైతులకు ఇవ్వాల్సిన సాగునీటిని సైతం సరఫరా చేస్తున్నారన్నారు. 2002లో చంద్రబాబు నాయుడు పాలనలో కోవూరు చక్కెర కర్మాగారాన్ని మూత వేసి తక్కువ ధరకు అమ్ముకోవాలని ప్రయత్నించారని ఆరోపించారు. 2014 ఎన్నికల సమయంలో కోవూరు చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తానని బూటకపు వాగ్దానాలతో రైతులు, కార్మికుల ఓట్లు వేయించుకుని ఫ్యాక్టరీని శిథిలావస్థకు తెచ్చారన్నారు. చంద్రబాబు పాలనలో నెల్లూరులోని తన బినామీ అయిన సిఎం రమేష్‌కు దారాదత్తం చేశారని ఆరోపించారు. లంచాలు, పర్సంటేజీలు తీసుకుని ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు ఇస్తున్న చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సంగం, నెల్లూరు బ్యారేజీల కోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పనులు ప్రారంభిస్తే చంద్రబాబు ఇప్పటికీ ఆ పనులు పూర్తి చేయలేదన్నారు. సమైక్యంగా ఉన్న రాష్ట్రం చంద్రబాబు వైఖరి వల్లనే విడిపోయిందన్నారు. మొదట ప్రత్యేక హోదా అని, ప్రస్తుతం ప్యాకేజీ అంటూ బూటకపు మాటలు చెప్పడం చంద్రబాబుకే సాధ్యమని విమర్శించారు.


బుచ్చిరెడ్డిపాళెం కూడలిలో మాట్లాడుతున్న జగన్

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68